ప్రజా కలం
Digital Editions
http://prajakalam.com
epaper.prajakalam.com
paperboy.com
www.magzter.com

epaper.prajakalam.in
www.prajakalam.in
Published From Nizamabad
# ప్రజా కలం
PRAJA KALAM Telugu Daily
తెలుగు దినపత్రిక
PRGI No.TELTEL/2010/33275

ప్రజా కలం
PRAJA KALAM Telugu Daily
Classifieds
&
Public Notice
Advertising
5 Lines Rs.250 only
క్లాసిఫైడ్స్
సంప్రదించండి
9010972526

గురువారం | 27-08- 2026 | సంపుటి: 17, సంచిక: 145, నిజామాబాద్, పేజీలు: 12, వెల: 3/- | ◆ ఎడిటర్: కలకొండ రామకృష్ణ ◆



## ఇందిరమ్మ ఇళ్లకు చివరి బిల్లులు నేడు జమ

### - మంత్రి పొంగులేటి

హైదరాబాద్, ఆగస్టు 26 (ప్రజాకలం) : గ్రామీణ ఇందిరమ్మ ఇళ్ల పథకానికి కేంద్రం సహకరించడం లేదని, అయినా రాష్ట్ర ప్రభుత్వం వెనక్కి తగ్గబోదని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. కేంద్రం నుంచి రావాల్సిన నిధుల కోసం ఏడాదిగా ఎదురు చూశామని, పలుమార్లు విజ్ఞప్తి చేసినా ఇప్పటివరకు ఒక్క రూపాయి విడుదల కాలేదని తెలిపారు. కేంద్రం సహకరించకపోయినా.. ఈ ఏడాది మార్చి 31వరకు గ్రామీణ ప్రాంతాల్లో పూర్తైన 15,475 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.185 కోట్లు విడుదల చేసిందని, ఈ నిధులు గురువారం లబ్ధిదారుల ఖాతాల్లో జమవుతాయని పేర్కొన్నారు. మిగిలిన వారికి కూడా విడతల వారీగా నిధులు అందిస్తామని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. రాష్ట్రంలో 2014 నుంచి 2023 వరకు గ్రామీణ ప్రాంతాల్లో పేదల ఇళ్ల నిర్మాణం జరగలేదని, ఫలితంగా ఇళ్ల నిర్మాణానికి ప్రజల నుంచి భారీ డిమాండ్ ఉందని పొంగులేటి అన్నారు. "దానిని దృష్టిలో పెట్టుకునే సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా ప్రధాని మోదీ, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌ను పలుమార్లు కలిశారు. తెలంగాణకు ఇళ్లను మంజూరు చేయాలని కోరారు.

# మహా విపత్తు

## నేపాల్‌లో విరుచుకుపడిన కొండచరియలు

## 157 మంది మృతి - 1000 మందికి పైగా గల్లంతు



ఆచూకీ లేని వందలాది యాత్రికులు..

403 మంది విదేశీ పర్యాటకుల గల్లంతు

రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోదీ తీవ్ర దిగ్భ్రాంతి

ఖాట్మండు, న్యూఢిల్లీ, ఆగస్టు 26: కళ్లు మూసి తెరిచేలోపే కొండచరియలు విరిగిపడ్డాయి. నదులు ఉగ్రరూపం దాల్చాయి. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పరుగులు తీస్తున్న అమాయక ప్రజలను ఐదంతస్తుల ఎత్తున విరుచుకుపడ్డ రాకాసి వరదనీటి అలలు తన్నుకుపోయాయి. ఎక్కడి వారు అక్కడే.. జలసమాధి అయ్యారు. హిమాలయాల ఒడిలో ఉన్న నేపాలీ గ్రామాలను క్షణాల్లోనే శ్మశాన నిశ్శబ్దంలోకి నెట్టేసిన మహా విపత్తు ఇది. కనీవినీ ఎరుగని ఈ జల ప్రళయం అటు చైనాలోని టిబెట్, ఇటు నేపాల్ సరిహద్దు గ్రామాలు, పట్టణాలను తుడిచిపెట్టేసింది. ఈ దారుణ ప్రకృతి విలయానికి సుమారు 157 మంది వరకు ప్రాణాలు కోల్పోగా, 1000 మందికి పైగా గల్లంతైనట్టు

తరువాయి 2వ పేజీలో...

రాష్ట్రంలో క్రీడాకారులను

## తీర్చిదిద్దడమే లక్ష్యం

- కొరియా నేషనల్ స్పోర్ట్స్ యూనివర్సిటీతో యంగ్ ఇండియా స్పోర్ట్స్ వర్సిటీ అవగాహన ఒప్పందం
- 2036 ఒలింపిక్స్‌లో పతకాలు సాధించేలా ప్రోత్సాహం
- 'ఎక్స్'లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడి



హైదరాబాద్, ఆగస్టు 26 (ప్రజాకలం) : రాష్ట్రంలోని గ్రామాలు, పట్టణాల్లో ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి.. అంతర్జాతీయ స్థాయి శిక్షణతో వారిని ఒలింపిక్స్ వేదిక వరకు తీసుకెళ్లే దిశగా ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీ.. దక్షిణ కొరియాలోని ప్రతిష్ఠాత్మక 'కొరియా నేషనల్ స్పోర్ట్స్ యూనివర్సిటీ (కేఎన్ఎస్‌యూ)'తో అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడించారు. ఇందుకు సంబంధించి బుధవారం 'ఎక్స్' వేదికగా కీలక అంశాలను ఆయన పంచుకున్నారు. ప్రపంచ స్థాయి క్రీడా శిక్షణ, స్పోర్ట్స్ సైన్స్, హైపెర్ఫార్మెన్స్ ఎడ్యుకేషన్ తదితర రంగాల్లో ఈ భాగస్వామ్యం దోహదపడుతుందన్నారు. తెలంగాణ క్రీడా ప్రతిభకు ప్రపంచస్థాయి శిక్షణ, క్రీడా విజ్ఞానం, అత్యుత్తమ శిక్షణ విధానాలను అనుసంధానించే వారధిగా ఈ భాగస్వామ్యం నిలుస్తుందన్నారు. అథ్లెట్ ట్రైనింగ్, స్పోర్ట్స్ సైన్స్, హైపెర్ఫార్మెన్స్ ఎడ్యుకేషన్‌లో కేఎన్ఎస్‌యూ అనుభవాన్ని తెలంగాణ యువ క్రీడాకారులకు అందుబాటులోకి తీసుకురావాలన్నదే తమ లక్ష్యమని పేర్కొన్నారు. గత దక్షిణ కొరియా పర్యటన సందర్భంగా తాను, కేఎన్ఎస్‌యూ ఉన్నత ప్రతినిధి బృందంతో సమావేశమైన విషయాన్ని సీఎం గుర్తుచేశారు. కేఎన్ఎస్‌యూ అధ్యక్షుడు మూన్ వోన్-జే సహా ఉన్నతస్థాయి ప్రతినిధులతో అప్పట్లో విస్తృత చర్చలు జరిపినట్లు తెలిపారు. ప్రతిపాదిత యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీతో, కేఎన్ఎస్‌యూ భాగస్వామ్యంపై

తరువాయి 2వ పేజీలో...

## ధరణితోనే అనేక భూ సమస్యలు

### - గత ప్రభుత్వంపై వీహెచ్ ఫైర్



హైదరాబాద్, ఆగస్టు 26 (ప్రజాకలం) : గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై ప్రభుత్వ సలహాదారుడు వి.హనుమంతరావు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. బుధవారం గాంధీభవన్‌లో ప్రజలతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో వీహెచ్ పాల్గొన్నారు. ప్రజలు, కార్యకర్తల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం ప్రగతి భవన్‌ను కట్టి ప్రజల సమస్యలను చెప్పుకోవడానికి అవకాశాలు ఇవ్వలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే ప్రగతి భవన్‌ను

తరువాయి 2వ పేజీలో...

వాహన ప్రమాద బీమా

## పరిహారాల్లో అక్రమాలు

### - మోసపూరిత క్లెయిములను తేల్చేలా ప్రత్యేక దర్యాప్తు బృందాల ఏర్పాటుకు సుప్రీం ఆదేశం



న్యూఢిల్లీ, ఆగస్టు 26: దేశవ్యాప్తంగా వాహన ప్రమాద బీమా క్లెయిములలో జరుగుతున్న మోసాలపై విచారణ చేపడుతున్నట్టు సుప్రీంకోర్టు ప్రకటించింది. అన్ని రాష్ట్రాలు ప్రత్యేక దర్యాప్తు బృందా (సిట్)లను

తరువాయి 2వ పేజీలో...

## కలం కౌంటర్




## అంతర్జాతీయ ప్రమాణాలతో..

### స్వామి నారాయణ్ గురుకుల పాఠశాల

- రఘునాథపాలెం మండలం జింకలతాండలో 13 ఎకరాల్లో గురుకుల పాఠశాల
- నిరుపేద విద్యార్థులకు 10 శాతం ఉచిత సీట్లు
- స్వామి నారాయణ్ గురుకుల పాఠశాల నిర్మాణ పనులకు భూమిపూజ, శంకుస్థాపన చేసిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



ఖమ్మం, ఆగస్టు 26( ప్రజా కలం న్యూస్) గిరిజన ప్రాంతంలో విద్యా ప్రమాణాలను మరింత పెంచడంతో పాటు, ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలతో పాటు చుట్టుపక్కల జిల్లాల విద్యార్థులకు సైతం నాణ్యమైన, విలువలతో కూడిన విద్యను అందించే దిశగా రఘునాథపాలెం మండలం జింకలతండాలో అంతర్జాతీయ ప్రమాణాలతో స్వామినారాయణ గురుకుల పాఠశాల నిర్మాణానికి రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ తో కలిసి బుధవారం భూమిపూజ, శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, 13.10 ఎకరాల్లో స్వామి నారాయణ గురుకుల్ ఆధ్వర్యంలో ఏర్పాటు కానున్న ఈ పాఠశాలలో 1వ తరగతి నుంచి 12వ తరగతి వరకు విద్యాబోధన అందించనున్నారన్నారు. సుమారు లక్ష చదరపు అడుగుల విస్తీర్ణంలో పాఠశాల భవనాలు, విద్యార్థులకు అవసరమైన ఆధునిక సౌకర్యాలతో క్యాంపస్ రూపుదిద్దుకోనుందని తెలిపారు. విద్యతో పాటు మానవతా విలువలు, సంస్కృతి, సంప్రదాయాలు, కుటుంబ వ్యవస్థ, నైతిక విలువలకు ప్రాధాన్యం ఇచ్చే విధంగా విద్యాబోధన సాగనుందని మంత్రి తెలిపారు. ఆధునిక విద్యతో పాటు భారతీయ విలువలను విద్యార్థుల్లో పెంపొందించేలా గురుకుల్ విద్యా విధానం ఉండనుందన్నారు. తెలంగాణలో స్వామినారాయణ గురుకుల్‌కు ఇది 5వ విద్యాసంస్థ అని మంత్రి అన్నారు. పాఠశాలలో అందుబాటులో ఉండే సీట్లలో 10 శాతం సీట్లను ఎలాంటి ఫీజు లేకుండా నిరుపేద విద్యార్థులకు కేటాయించే అధికారాన్ని జిల్లా కలెక్టర్‌కు అప్పగించారన్నారు. దీంతో ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన పిల్లలు కూడా అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యను పొందే అవకాశం లభించనుందని తెలిపారు.

తరువాయి 2వ పేజీలో...

## కాంగ్రెస్ పార్టీని వీడేది లేదు

సుస్మిత వ్యాఖ్యలు ఆమె వ్యక్తిగతం!

మా బిడ్డ వ్యాఖ్యలతో మాకు ఏంటి సంబంధం? : కొండా మురళి

ఆమె మనోభావాలు ఆమెకుంటాయి

బీఆర్ఎస్ లోంచి కవిత వెళ్లిపోలేదా?

సుస్మిత వ్యాఖ్యలపై భట్టితో చర్చించలేదు



హైదరాబాద్, ఆగస్టు 26 (ప్రజాకలం) : తెలంగాణ కాంగ్రెస్‌లో మంత్రి కొండా సురేఖ అంశం పై రోజురోజుకూ ఉత్కంఠ కొనసాగు తోంది. ఆమెపై అధిష్ఠానం ఎలాంటి చర్యలు తీసుకోబోతుందనే సస్పెన్స్ కొనసాగుతున్న వేళ కీలక పరిణామం చోటు చేసుకుంది. తాము కాంగ్రెస్‌ను వీడబోమని కాంగ్రెస్ సీనియర్ నేత కొండా మురళి స్పష్టం చేశారు. కూతురు వేరు.. రాజకీయం వేరని, సుస్మిత వ్యాఖ్యలతో తమకు సంబంధం లేదని తేల్చిచెప్పారు. కాంగ్రెస్ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీపై తమకు సంపూర్ణ విశ్వాసం ఉందని తాము కాంగ్రెస్‌లోనే కొనసాగుతామన్నారు. ఈ మేరకు బుధవారం కొండా సురేఖ భర్త కొండా మురళి ప్రజా భవన్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో భేటీ కావడం

తరువాయి 2వ పేజీలో...

ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే

## ఇందిరమ్మ ప్రభుత్వ లక్ష్యం

- కులమతాలకు తావులేకుండా అర్హతే ప్రామాణికంగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తాం : మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి
- రూ.212.25 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపనలు
- కార్పోరేషన్ 1, 59వ డివిజన్ ప్రాంతాల్లో పర్యటించి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసిన మంత్రి పొంగులేటి



ఖమ్మం, ఆగస్టు 26(ప్రజా కలం న్యూస్ ) పేదల సంక్షేమంతో పాటు కార్పోరేషన్ లో కలిసిన విలీన గ్రామాల సమగ్ర అభివృద్ధే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. బుధవారం ఖమ్మం కార్పోరేషన్ పరిధిలోని ఒకట డివిజన్ కైకొండాయిగూడెం, 59వ డివిజన్ దానావాయి గూడెంలో జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్ తో కలిసి పర్యటించిన మంత్రి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. బుధవారం ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోని 1వ డివిజన్ కైకొండాయి గూడెంలో సుడా నిధులు రూ.100 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణ పనులకు, అనంతరం 59వ డివిజన్‌లో సుడా నిధులు రూ.112.25 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు కూడా మంత్రి శంకుస్థాపనలు చేశారు.

తరువాయి 2వ పేజీలో...

# మహా విపత్తు

మొదటి పేజీ తరువాయి...

ప్రాథమికంగా అందిన సమాచారం ఆధారంగా తెలుస్తోంది. కైలాస మానస సరోవరం యాత్ర కోసం వెళ్లిన సుమారు వందలాది మంది భక్తుల ఆచూకీ కూడా తెలియరావడం లేదు. ప్రాణనష్టం గణనీయంగా పెరిగే అవకాశం ఉంది. 91 మంది వరకు గాయపడ్డారు. 93 మందిని కాపాడారు. రసువా, నువాకోట్, దాడింగ్, చిత్వాన్ తదితర ఏడు జిల్లాల్లో బుధవారం సాయంత్రానికి 72 మృతదేహాలు బయటపడినట్లు నేపాల్ విపత్తుల నిర్వహణ సంస్థ ప్రకటించింది. సుమారు 403 మంది విదేశీ పర్యాటకులు గల్లంతైనట్లు నేపాల్ టూరిజం బోర్డు ప్రకటించింది. ఇందులో 105 మంది భారతీయులు, 37 మంది ప్రవాస భారతీయులు (ఎన్ఆర్ఐలు) ఉన్నట్లు ప్రాథమికంగా ధృవీకరించింది.

**క్షణాల్లో సర్వనాశనం.. అసలేం జరిగింది?**

నేపాల్‌లోని టిబెట్ సరిహద్దులో ఉన్న రసువా (ఖాట్మండుకు 125కిలోమీటర్ల దూరం), దాడింగ్ జిల్లాల పరిసరాలపై బుధవారం ఒక్కసారిగా ఆకస్మిక మెరుపు వరదలు విరుచుకుపడ్డాయి. స్థానికంగా ఎటువంటి వర్షం లేకపోయినప్పటికీ.. ఉదయం 8.30–9 గంటల సమయంలో క్షణాల వ్యవధిలో కొండత ఎత్తున దూసుకొచ్చిన బురదనీరు, బండరాళ్లు.. గ్రామాలు, పట్టణాలు, మార్కెట్లు, సరిహద్దు చెక్‌పోస్టులను తుడిచిపెట్టేశాయి. టిబెట్ వైపు భారీ హిమనీనదం బద్దలు కావడం ఈ విపత్తుకు దారితీసినట్టు భావిస్తున్నారు. వరద రావడానికి ముందు ఆ ప్రాంతంలో (గొసైన్‌కుండకు ఉత్తరాన 47కిలోమీటర్ల దూరంలో టిబెటన్ పరిధిలో) 4.4 తీవ్రతతో భూకంపం వచ్చినట్టు, యూఎస్ జియోలాజికల్ సర్వే గుర్తించింది. దీనివల్లే హిమనీనదం బద్దలై ఉంటుందని భావిస్తున్నారు. దీంతో టిబెట్ వైపు నుంచి నేపాల్‌లోకి ప్రవహించే భోటేకోశి, త్రిశూల్ నదులు ఉప్పొంగి, నేపాల్ సరిహద్దు ప్రాంతాలపై విరుచుకుపడ్డాయి. స్థానికుల కథనం ప్రకారం.. ఒక్కసారిగా అగ్నిపర్వతం బద్దలైనంత పెద్ద శబ్దంతో బురదనీరు, భారీ బండరాళ్లు సరిహద్దు ప్రాంతాలపైకి దూసుకువచ్చాయి. టిబెట్‌లోని సరిహద్దు పట్టణం గైరోంగ్ సైతం తుడిచిపెట్టుకుపోయింది.

ఎగువన టిబెట్ నుంచి ఐదంతస్తుల ఎత్తున బురదమట్టి, బండరాళ్లతో కూడిన వరదనీరు గైరోంగ్ సరిహద్దుదాటి నేపాల్‌లోని రసువాపై పడింది. కొన్ని నిమిషాల వ్యవధిలోనే టిమురే, స్యాబ్రుబేసి ప్రాంతాల్లో హోటళ్లు, వాణిజ్య సముదాయాలు, ప్రధాన రోడ్లు, వంతెనలు, సరిహద్దు చెక్‌పోస్టులు, వాహనాలు, కమ్యూనికేషన్ టవర్లు జలసమాధి అయ్యాయి. 12 జలవిద్యుత్ ప్రాజెక్టులకు భారీనష్టం వాటిల్లిందని అంచనా. దీంతో 430 మెగావాట్ల జలవిద్యుదుత్పత్తి (దేశ మొత్తం సామర్థ్యంలో 12 శాతం) నిలిచిపోయింది. గైరోంగ్‌లోని చైనా సరిహద్దు ఇమ్మిగ్రేషన్ చెక్‌పోస్టును ఐదంతస్తుల ఎత్తులో వచ్చిన వరద నీరు ముంచెత్తిన భయానక దృశ్యాలు సీసీటీవీ కెమెరాల్లో రికార్డయ్యాయి. వరదనీరు ఇళ్లను పేకమేడల్లా పెకిలించేయడం అందులో కనిపించింది. నేపాల్‌లోని నువాకోట్, చిత్వాన్ జిల్లాల్లోని సమీప ప్రాంతాలు కూడా ఈ విపత్తు బారినపడ్డాయి. హిమాలయల్లోని సరస్సు విస్ఫోటనం కారణంగా ఆకస్మిక వరదలు సంభవించి ఉంటాయని ఖాట్మండ్ కేంద్రంగా పనిచేస్తున్న ఇంటర్నేషనల్ సెంటర్ ఫర్ ఇంటెగ్రేటెడ్ మౌంటెయిన్ డెవలప్‌మెంట్ నిపుణులు పేర్కొన్నారు. సరిగ్గా గతేడాది ఆగస్టులోనూ ఈ ప్రాంతంలో ఆకస్మిక వరదలు సంభవించడం గమనార్హం. కాగా, నేపాల్ ప్రభుత్వం వెంటనే సహాయక చర్యలు మొదలుపెట్టింది. వరదనీటిలో చిక్కుకుపోయిన వారిని కాపాడేందుకు నేపాల్ సైన్యం, ప్రైవేటు సంస్థల ఆధ్వర్యంలో 30కు పైగా హెలికాప్టర్లను రంగంలోకి దింపింది. సాయుధ బలగాలు (ఏపీఎఫ్), విపత్తు నిర్వహణ బృందాలు సైతం రంగంలోకి దిగి సహాయక చర్యలు మొదలుపెట్టాయి అయితే, మౌలిక వసతులు కొట్టుకుపోవడం సహాయక చర్యలకు ఆటంకిగా మారింది. 80 మంది భద్రతా సిబ్బంది ఆచూకీ లభించడం లేదని నేపాల్ పార్లమెంట్‌కు విదేశాంగ మంత్రి శిశిర్ ఖనాల్ తెలిపారు. భోటేకోశి, త్రిశూల్ నదుల సమీప గ్రామాల్లోని ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని నేపాల్ వరద విపత్తు నిర్వహణ విభాగం సూచించింది. భారత్ తక్షణమే స్పందించి మిలటరీ రవాణా విమానంలో సహాయక సామగ్రిని పంపింది. ఇందులో అత్యవసర షెల్టర్లు, దుప్పట్లు, సోలార్ ల్యాంప్‌లు, ఔషధాలు ఉన్నాయి.

**యూపీ, బిహార్‌లో అప్రమత్తం..**

నేపాల్‌లోని త్రిశూల్ నది నుంచి భారీగా వరదనీరు దిగువకు వస్తుండడంతో బిహార్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో సరిహద్దు జిల్లాల అధికారులు అప్రమత్తమయ్యారు. బిహార్‌లోని వాల్మీకీనగర్ వద్ద ఉన్న గండక్ బ్యారేజీ 36 గేట్లను ఎత్తివేసి, హై అలర్ట్ ప్రకటించారు. యూపీలోని మహారాజ్‌గంజ్, కుషీనగర్ జిల్లాల అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు.

# ధరణితోనే అనేక భూ సమస్యలు

మొదటి పేజీ తరువాయి...

ప్రజా భవన్‌గా మార్చి ప్రజా సమస్యల పరిష్కార కేంద్రంగా మార్చారని తెలిపారు. గాంధీభవన్ కూడా ప్రజల సమస్యల పరిష్కార వేదిక అయ్యేలా ముఖాముఖీ కార్యక్రమం చేపట్టారని చెప్పారు.

**ఆ భూములపై అక్రమ రిజిస్ట్రేషన్లు**

ఈరోజు ముఖాముఖి కార్యక్రమంలో.. భూములకు సంబంధించిన సమస్యలే ఎక్కువగా తన దృష్టికి వచ్చినట్లు వీహెచ్ తెలిపారు. పటేల్ పట్వారి విధానం వల్ల భూ సమస్యలు తక్కువగా ఉండేవన్నారు. గత ప్రభుత్వం.. ధరణితో పాటు అనేక సమస్యలు తీసుకొచ్చిందని వ్యాఖ్యానించారు. నాడు ఇందిరా గాంధీ పంచిన భూములను మళ్లీ భూస్వాములు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నారని తెలిపారు. రిజిస్ట్రేషన్ ఆఫీసులో తప్పిదాలు జరుగుతున్నాయని.. రెవెన్యూ శాఖ మంత్రి పటిష్ట చర్యలు తీసుకోవాలని వి.హనుమంతరావు సూచించారు.

**వన్ నేషన్ వన్ ఎలక్షన్‌కు వ్యతిరేకం..**

వన్ నేషన్ వన్ ఎలక్షన్‌తో నరేంద్ర మోదీ నాలుగోసారి ప్రధాని అవ్వాలని చూస్తున్నా రని వీహెచ్ అన్నారు. వన్ నేషన్ వన్ ఎలక్షన్ అమెరికాలో సాధ్యమని.. భారత దేశంలో కాదన్నారు. ప్రధాని మోదీకి, అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు సంబంధాలు ఉన్నాయని.. అందుకే భారత్‌ను అమెరికాలా చేయాలని మోదీ చూస్తున్నారని అన్నారు. భారత్ సెక్యులర్ దేశమని.. ఇక్కడ వన్ నేషన్ వన్ ఎలక్షన్ సాధ్యం కాదని చెప్పారు. భారత దేశంలో భిన్న మతాలు, భిన్న కులాల ఉన్నాయన్నారు. కేంద్రం చేస్తున్న క్యాస్ట్ సెన్స్, కులగణనలో బీసీల కాలమే లేదని తెలిపారు. అలాంటిది వన్ నేషన్ వన్ ఎలక్షన్ ఎక్కడిదని ప్రశ్నించారు. 70 శాతం ఉన్న బీసీలకు అన్యాయం చేస్తారా అంటూ నిలదీశారు. ముందు బీసీల సంగతి తేల్చాలన్నారు. 'మేము వన్ నేషన్ వన్ ఎలక్షన్‌కు వ్యతిరేకం' అని స్పష్టం చేశారు. కులగణన పేరుతో ఓట్లు తొలగిస్తున్నారని ఆరోపించారు. తెలంగాణలో ఉన్న ఓట్లకు, ఈసీ లెక్కలకు తేడా ఉందని వీహెచ్ పేర్కొన్నారు.

# అంతర్జాతీయ ప్రమాణాలతో..

మొదటి పేజీ తరువాయి...

గిరిజన ప్రాంతాలతో పాటు ఖమ్మం జిల్లా, ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలకు నాణ్యమైన విద్యను మరింత చేరువ చేయడం లక్ష్యంగా ఈ విద్యాసంస్థ ఏర్పాటు జరుగుతోందని మంత్రి తెలిపారు. ఆధునిక విద్యతో పాటు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, మానవతా విలువలను విద్యార్థుల్లో పెంపొందించాల్సిన అవసరం ఉందని, స్వామినారాయణ గురుకుల్ విద్యా విధానం ఈ లక్ష్యానికి అనుగుణంగా ఉంటుందని మంత్రి అన్నారు.

ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ పువ్వాల్ల దుర్గాప్రసాద్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహ్మద్ ఖాదర్ బాబా, ఆర్ అండ్ బి ఎస్ఇ యుగంధర్ రావు, జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, స్వామీ నారాయణ్ గురుకుల్ ప్రతినిధులు, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే

# ఇందిరమ్మ ప్రభుత్వ లక్ష్యం

మొదటి పేజీ తరువాయి...

ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ, ప్రజా ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాలు పూర్తయిందని, ఈ కాలంలో ప్రజలకు అవసరమైన మౌళిక సదుపాయాలు, సంక్షేమ కార్యక్రమాలను పెద్ద ఎత్తున అమలు చేస్తున్నామని తెలిపారు. మిగిలిన రెండున్నర సంవత్సరాల్లో కూడా ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసి, పేదింటి గుమ్మానికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలను చేర్చడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. కైకొండాయిగూడెం 1వ డివిజన్‌లో ఈరోజు శంకుస్థాపన చేసిన రూ.కోటి పనులతో కలిపి ఇప్పటివరకు సుమారు రూ.12.83 కోట్ల విలువైన అభివృద్ధి పనులను మంజూరు చేసి, అనేక పనులను పూర్తి చేశామని మంత్రి తెలిపారు. ఖమ్మం కార్పొరేషన్ ఏర్పడిన తర్వాత తక్కువ కాలంలో ఇంత పెద్ద మొత్తంలో నిధులు కేటాయించి అభివృద్ధి పనులు చేపట్టడం ఇదే తొలిసారి అని పేర్కొన్నారు. 1వ డివిజన్ పరిధి విస్తృతంగా ఉండటంతో ఇంకా అనేక ప్రాంతాల్లో అంతర్గత రోడ్లు, ఇతర మౌళిక సదుపాయాల అవసరం ఉందని తెలిపారు. డివిజన్‌లో మిగిలిన రోడ్ల అభివృద్ధికి అవసరమైన నిధులను దశలవారీగా కేటాయించి పనులను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను మంత్రి వివరించారు. అర్హులైన పేద కుటుంబాలకు రేషన్ కార్డులు, సన్నబియ్యం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం వంటి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు. విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించేందుకు డైట్ ఛార్జీలు పెంచడంతో పాటు, విద్యార్థినులకు ప్రత్యేకంగా ఆర్థిక సహాయం పెంచామని చెప్పారు. పేద పిల్లలు చదువులో ముందుకు వెళ్లేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలుస్తుందని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే మొదటి విడతలో నాలుగున్నర లక్షల ఇళ్లను, రెండో విడతలో మరో రెండున్నర లక్షల ఇళ్లను మంజూరు చేశామని తెలిపారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి దశలవారీగా ఇందిరమ్మ ఇల్లు అందిస్తామని మంత్రి స్పష్టం చేశారు. అర్హతే ప్రామాణికంగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని, కులం, మతం, రాజకీయాలకు ఎలాంటి తావు ఉండదని పేర్కొన్నారు. పేదల ఆత్మగౌరవంతో జీవించేందుకు సొంతింటి కలను సాకారం చేయడమే ఇందిరమ్మ ప్రభుత్వ లక్ష్యం అని మంత్రి అన్నారు. ఇప్పటికే చేపట్టిన సీసీ రోడ్లు, అంతర్గత రోడ్ల నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేయడంతో పాటు, మిగిలిన ప్రాంతాల్లో అవసరమైన రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసి పనులను చేపట్టాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూ, ప్రజల మౌళిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ప్రజలకు రవాణా సౌకర్యాలు మెరుగుపడేలా సీసీ రోడ్ల నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, హౌజింగ్ పిడి భూక్యా శ్రీనివాస్, ఖమ్మం అర్బన్ మండల తహసీల్దార్ జయచంద్ర, ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో క్రీడాకారులను తీర్చిదిద్దడమే లక్ష్యం

మొదటి పేజీ తరువాయి...

ఆ సందర్భంగా చర్చలు జరిగాయని, ఇప్పుడు అవి ఎంవోయూ రూపంలో కార్యరూపం దాల్చాయని వెల్లడించారు.

**32 పతకాల్లో 16 కేఎన్ఎస్‌యూకే..**

ప్రపంచ క్రీడా రంగంలో కేఎన్ఎస్‌యూకు ఉన్న ప్రాధాన్యాన్ని పారిస్ ఒలింపిక్స్ ఫలితాలు చాటి చెబుతున్నాయని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. పారిస్ ఒలింపిక్స్‌లో దక్షిణ కొరియా సాధించిన 32 పతకాల్లో 16 పతకాలు కేఎన్ఎస్‌యూలో శిక్షణ పొందిన క్రీడాకారులే సాధించారని తెలిపారు. అదే తరహా క్రీడా నైపుణ్యం, అత్యుత్తమ ప్రదర్శన సంస్కృతిని తెలంగాణలోనూ తీసుకురావాలన్నదే తమ లక్ష్యమన్నారు. ఈ కీలక భాగస్వామ్యానికి కృషి చేసిన క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, ఆ శాఖ అధికారులు, యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ప్రతినిధులను ఈ సందర్భంగా సీఎం అభినందించారు. ప్రపంచ క్రీడా ప్రమాణాలను తెలంగాణ యువ క్రీడాకారులకు చేరువ చేసేందుకు ఈ ఒప్పందం కొత్త అవకాశాలను తెరుస్తుందని అభిప్రాయపడ్డారు. భారత్ 2036 ఒలింపిక్స్ వైపు అడుగులు వేస్తున్న నేపథ్యంలో తెలంగాణ కూడా అందుకు సిద్ధమవుతోందని తెలిపారు. ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన క్రీడా ఈవెంట్‌కు ఆతిథ్యమివ్వడమే కాకుండా.. భారత్‌కు గర్వకారణంగా నిలిచే క్రీడాకారులను తయారు చేయడమే లక్ష్యమన్నారు

**క్రీడా విద్య, పరిశోధనలో భాగస్వామ్యం..**

యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీ, కొరియా నేషనల్ స్పోర్ట్స్ యూనివర్సిటీ (కేఎన్ఎస్‌యూ) మధ్య కుదిరిన ఒప్పందం ద్వారా.. ఇరు విశ్వవిద్యాలయాలు క్రీడా విద్య, స్పోర్ట్స్ సైన్స్, పరిశోధన, సాంకేతిక ఆవిష్కరణలు, అధ్యాపకుల అభివృద్ధి, విద్యార్థుల మార్పిడి, అత్యున్నత స్థాయి క్రీడాకారుల శిక్షణ, పనితీరు మెరుగుదల వంటి అంశాల్లో పరస్పరం సహకరించుకోనున్నాయి. ఒప్పందంలో భాగంగా అకడమిక్ కార్యక్రమాలు, పాఠ్య ప్రణాళికల అభివృద్ధి, నాణ్యతా ప్రమాణాల మెరుగుదల వంటి అంశాల్లో ఇరు సంస్థలు కలిసి పనిచేయనున్నాయి. అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు, ప్రొఫెషనల్ సిబ్బంది పరస్పర మార్పిడి ద్వారా అంతర్జాతీయ అనుభవాన్ని పంచుకునే అవకాశం కలుగుతుంది.

**స్పోర్ట్స్ సైన్స్‌కు ప్రాధాన్యం..**

అత్యున్నత స్థాయి క్రీడాకారుల పనితీరును మెరుగుపరచడంలో స్పోర్ట్స్ సైన్స్ కీలకంగా మారుతున్న నేపథ్యంలో ఈ శిక్షణకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంది.

స్పోర్ట్స్ సైన్స్, కోచింగ్, అథ్లెట్ డెవలప్‌మెంట్, పనితీరు మెరుగుదల వంటి అంశాల్లో ఇరు విశ్వవిద్యాలయాలు తమ అనుభవం, నైపుణ్యాలను పరస్పరం పంచుకోనున్నాయి. కాన్ఫరెన్సులు, సెమినార్లు, శిక్షణా కార్యక్రమాలు, నిపుణుల పరస్పర సందర్శనలు, ఉత్తమ అంతర్జాతీయ విధానాల మార్పిడి ద్వారా సంస్థాగత సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేయాలని ఒప్పందంలో ఉద్దేశించారు. ఈ సహకారంలో హైదరాబాద్‌లోని రిపబ్లిక్ ఆఫ్ కొరియా కాన్సుల్ జనరల్ సమన్వయ సంస్థగా వ్యవహరించనున్నారు. ఇరు విశ్వవిద్యాలయాల మధ్య కమ్యూనికేషన్, సంస్థాగత సమన్వయానికి సహకరించడం మాత్రమే వారి పాత్ర. కాన్సులేట్‌పై ఎలాంటి చట్టపరమైన, ఆర్థిక, అకడమిక్ లేదా పరిపాలనా బాధ్యతలు ఉండవు. ఈ ఒప్పందం ఐదేళ్లపాటు అమల్లో ఉంటుంది. పరస్పర అంగీకారంతో దీనిని పునరుద్ధరించుకోవచ్చు లేదా సవరించుకోవచ్చు. ఏదైనా ఒక సంస్థ ఒప్పందాన్ని ముగించాలనుకుంటే ఆరు నెలల ముందస్తు లిఖితపూర్వక నోటీసు ఇవ్వాల్సి ఉంటుంది. కాగా, తెలంగాణలో క్రీడా విద్య, శిక్షణ, పరిశోధనకు అంతర్జాతీయ ప్రమాణాలను అనుసంధానించడంలో ఈ భాగస్వామ్యం కీలక అడుగుగా నిలిచే అవకాశం ఉంది. ముఖ్యంగా దక్షిణ కొరియా క్రీడా విద్య, శిక్షణ, స్పోర్ట్స్ సైన్స్ రంగాల్లో సాధించిన అనుభవాన్ని తెలంగాణలోని క్రీడా విద్యార్థులు, కోచ్‌లు, పరిశోధకులు, క్రీడాకారులు అందిపుచ్చుకునేందుకు ఈ సహకారం ఉపయోగపడనుంది.

**క్రీడా విద్య, పరిశోధనలో భాగస్వామ్యం..**

యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీ, కొరియా నేషనల్ స్పోర్ట్స్ యూనివర్సిటీ ( కేఎన్ఎస్‌యూ) మధ్య కుదిరిన ఒప్పందం ద్వారా.. ఇరు విశ్వవిద్యాలయాలు క్రీడా విద్య, స్పోర్ట్స్ సైన్స్, పరిశోధన, సాంకేతిక ఆవిష్కరణలు, అధ్యాపకుల అభివృద్ధి, విద్యార్థుల మార్పిడి, అత్యున్నత స్థాయి క్రీడాకారుల శిక్షణ, పనితీరు మెరుగుదల వంటి అంశాల్లో పరస్పరం సహకరించుకోనున్నాయి. ఒప్పందంలో భాగంగా అకడమిక్ కార్యక్రమాలు, పాఠ్య ప్రణాళికల అభివృద్ధి, నాణ్యతా ప్రమాణాల మెరుగుదల వంటి అంశాల్లో ఇరు సంస్థలు కలిసి పనిచేయనున్నాయి.

అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు, ప్రొఫెషనల్ సిబ్బంది పరస్పర మార్పిడి ద్వారా అంతర్జాతీయ అనుభవాన్ని పంచుకునే అవకాశం కలుగుతుంది.

# కాంగ్రెస్ పార్టీని వీడేది లేదు

మొదటి పేజీ తరువాయి...



ఆసక్తిగా మారింది. వీరిద్దరూ భట్టితో దాదాపు 45 నిమిషాల వరకు సమావేశమయ్యారు. ఈ భేటీలో భట్టితోపాటు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఉన్నారు. ఈ భేటీలో కాంగ్రెస్ పార్టీలో తాజా పరిణామాలపై చర్చించినట్లు సమాచారం. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపైన సుస్మిత చేసిన వ్యాఖ్యలతో పార్టీకి, ప్రభుత్వానికి తీవ్ర నష్టం జరిగిందనే విషయాన్ని కొండా మురళితో భట్టి విక్రమార్క అన్నట్లుగా తెలిసింది. ఎంత పెద్ద నాయకుడైనా పార్టీ జెండా కిందనే పనిచేయాల్సి ఉంటుందని, వ్యక్తిగత విమర్శలు చేసి వివాదాలకు తావు ఇవ్వడం సరికాదనే అభిప్రాయాన్ని భట్టి వ్యక్తం చేశారని సమాచారం. పార్టీలో అంతర్గత విషయాలు ఎన్నో ఉంటాయని, వాటన్నింటిపైనా బహిరంగంగా మాట్లాడటం వల్ల ప్రతిపక్షాలకు ఒక అస్త్రాన్ని ఇచ్చినట్లుగా అవుతుందన్నారు. ఈ విషయంలో మురళి కూడా కొంత ఆలోచనలో పడినట్లుగా పార్టీ వర్గాలు పేర్కొన్నాయి.

**సయోధ్య కుదురుతుందా..?**

అయితే మంత్రి కొండా సురేఖ కాంగ్రెస్ పార్టీ నియమావళిని ఉల్లంఘించడం ఇది మూడోసారని, అలాగే చిన్నారెడ్డి సైతం లైన్ దాటి మాట్లాడారని ఇక వీరిని ఉపేక్షిస్తే పార్టీకి తీవ్రనష్టం వాటిల్లుతుందని కాంగ్రెస్ రాష్ట్ర క్రమశిక్షణ వ్యవ హారాల కమిటీ (డీఏసీ) పీసీసీ చీఫ్‌కు నివేదిక సమర్పించింది. ఈ నేపథ్యంలో కొండాపై వేటు తప్పదనే చర్చ జరుగు తున్న వేళ కొండా మురళి భట్టీతో భేటీ కావడం ఆసక్తిగా మారింది. పార్టీ కఠిన నిర్ణయం తీసుకోకుండా ఉండేందుకు, సయోధ్య కుదిర్చే దిశగా రాజగోపాల్‌రెడ్డి మధ్యవర్తిత్వం వహించినట్లు తెలుస్తోంది. రాయబారం ఫలించి ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలో చోటు చేసుకన్న ఈ పరిణామాలు వివాదాన్ని సద్దుమణిగేలా చేస్తాయా..? లేక పార్టీలో కొత్త రాజకీయ సమీకరణాలకు దారితీస్తాయా..? అనేది వేచి చూడాలి. అయితే డిప్యూటీ సీఎం భట్టితో రాజగోపాల్‌రెడ్డి భేటీ కావడంపై మరో చర్చ జరుగుతోంది. కొండా సురేఖ, చిన్నారెడ్డిపై వేటు వేస్తే అది తనపై కూడా చర్యలు తప్పవనే రాజగోపాల్‌రెడ్డి అప్రమత్తమయ్యారనే టాక్ రాజకీయవర్గాల్లో వినిపిస్తోంది. ఈ నేపథ్యంలోనే వేటు నుంచి తప్పించుకునేందుకు ముందస్తుగా భట్టి విక్రమార్కతో రాజగోపాల్‌రెడ్డి భేటీ అయ్యారా..? అనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి.

**కూతురు వేరు.. రాజకీయం వేరు**

డిప్యూటీ సీఎం భటి విక్రమార్కతో భేటీ అనంతరం ప్రజాభవన్ వద్ద కొండా మురళి మీడియాతో మాట్లాడారు. 'సుష్మిత మా బిడ్డనే.. అమెకు 37 ఏళ్లు.. ఆమె బిడ్డకు 15 ఏళ్లు ఉన్నాయి.. కూతురు వేరు.. రాజకీయం వేరు.. ఆమె వ్యాఖ్యల తో మాకు సంబంధం లేదు' అని కొండా మురళి తెలిపారు. కవిత బీఆర్ఎస్ నుంచి బయటికి వెళ్లిన విషయాన్ని కూడా ఆయన గుర్తు చేశారు. సుష్మితకు ఆమె మనోభావాలు, అభిప్రాయాలు చెప్పుకునే స్వేచ్ఛ ఆమెకు ఉంటుందన్నారు. 'ఆమె మా బిడ్డ అయినప్పటికీ ఆమెను ప్రశ్నించే హక్కు మాకు లేదు' అని అన్నారు. సుష్మిత ప్లాన్ 'ఏ' ప్రకారం వ్యాఖ్య లు చేసిందని, సుష్మిత ప్లాన్ బీ ఏమిటో తనకు తెలియదని కొండా మురళి తెలిపారు. సుస్మిత చేసిన వ్యాఖ్యలు ఆమె వ్యక్తిగతమన్నారు. పీసీసీ క్రమశిక్షణ కమిటీ నిర్ణయం వెలువడే వరకు తాను ఏమీ మాట్లాడనని కొండా మురళి తెలిపారు. అధికారిక పనుల్లో భాగంగానే బిల్లుల విషయంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను మర్యాదపూర్వకంగానే కలిసి, యోగక్షేమాలు మాట్లాడుకున్నట్లుగా ఆయన చెప్పారు.

# వాహన ప్రమాద బీమా పరిహారాల్లో అక్రమాలు



ఏర్పాటు చేసి.. ఈ వ్యవహారంపై లోతుగా దర్యాప్తు చేయించాలని ఆదేశించింది. ఇకపై అనుమానిత బీమా క్లెయిములపై ఆ సిట్‌లతో దర్యాప్తు చేయించాలని స్పష్టం చేసింది. ఒకే వాహనం అనేక ప్రమాదాలకు కారణమైనట్టు చూపిస్తూ, బీమా సొమ్మును పొందుతుండం వ్యవస్థీకృతంగా సాగుతున్నట్టు సంకేతాలు ఉన్నాయని పేర్కొంది. ఒడిశాలో జరిగిన ఒక ఘటనకు సంబంధించిన పూర్వాపరాలు, ఓరియంటల్ ఇన్సూరెన్స్ సంస్థ దాఖలు చేసిన పిటిషన్‌ను పరిశీలించి ఈ తీర్పు వెలువరించింది. 2017 అక్టోబరులో ఒడిశాలో ఒక రోడ్డు ప్రమాదం జరిగింది.

అందులో గాయపడిన తునీపతి, మరికొందరు వ్యక్తులకు ఓరియంటల్ ఇన్సూరెన్స్ సంస్థ బీమా పరిహారం చెల్లించేందుకు నిరాకరించింది. ప్రమాదానికి కారణమైన వాహనంపై సందేహం వ్యక్తం చేసింది. ఈ అంశం సుప్రీంకోర్టు వరకు వచ్చింది. ప్రమాదం జరిగింది నిజమే అయినా.. పరిహారం పొందడానికి బీమా చెల్లుబాటు ఉన్న మరో వాహనం నంబరును ఉపయోగించారని బీమా సంస్థ తన పిటిషన్‌లో పేర్కొంది. దీనిపై గత ఏడాది ఫిబ్రవరిలో విచారణ జరిపిన సుప్రీంకోర్టు.. అసలు ఆ వాహనం ఇంతకు ముందు ఏదైనా ప్రమాదాలకు కారణమైందా తేల్చాలని ఒడిశా అధికారులను ఆదేశించింది. విచారణ చేపట్టిన అధికారులు.. ఈ బీమా క్లెయిమ్‌లో పేర్కొన్న వాహనం నంబరు మరో నాలుగు ప్రమాద కేసుల్లోనూ కనిపించిందంటూ ఒడిశా అధికారులు సుప్రీంకోర్టుకు ఈ ఏడాది మార్చిలో నివేదిక ఇచ్చారు. దీన్ని పరిశీలించిన ధర్మాసనం.. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లోనూ ఈ తరహాలో వ్యవస్థీకృతంగా మోసాలు జరిగేందుకు ఆస్కారం ఉందని పేర్కొంది. ఈ కేసులో కోర్టుకు సహాయకారిగా వ్యవహరిస్తున్న సీనియర్ న్యాయవాది జగదీశ్ చంద్ర సోలంకి ధర్మాసనానికి పలు ప్రతిపాదనలు చేశారు. వివిధ బీమా కంపెనీల క్లెయిములకు సంబంధించిన సమాచారాన్ని ఒకే పోర్టల్‌లో ఉంచితే.. ఒకే వాహనం, ఒకే సంస్థ, ఒకే వ్యక్త పదేపదే బీమా క్లెయిములు చేస్తుంటే గుర్తించవచ్చని పేర్కొన్నారు.

## మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రిలోనీ

# సమస్యలను వెంటనే పరిష్కరించాలి

### - బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘునాథ్ వేరబెల్లి...



మంచిర్యాల టౌన్ , ఆగస్టు 26 (ప్రజాకలం ప్రతినిధి) మంచిర్యాల జిల్లా కేంద్రం లోని ప్రభుత్వ ఆసుపత్రిని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి బీజేపీ శ్రేణులతో కలిసి బుధవారం సందర్శించారు. శిధిలావస్థలో ఉన్న వివిధ వార్డులను పరిశీలించి, ఆసుప్రతిలో అందిస్తున్న సదుపాయాలను రోగులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎప్పుడు ఏ వైపున స్లాబ్ కూలి ప్రమాదం జరుగుతుందో అనే భయంతో వైద్యులు,సిబ్బంది,రోగులు ఉన్నారని,ఆసుపత్రికి మరమత్తులు చేసి మౌలిక సదుపాయాలు కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ప్రతి వార్డులో కూడా స్లాబ్ పెచ్చులు ఊడి పడుతున్న కనీసం మరమత్తులు కూడా చేయలేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. డయాలసిస్ వార్డులో స్లాబ్ కు మెష్ కట్టి వైద్యం కల్పించడం మరి దారుణంగా ఉందని అన్నారు.సరిపడా వైద్యులు , సిబ్బంది లేక ఇక్కడ శస్త్ర చికిత్సలు చేయలేని పరిస్థితి ఏర్పడి పేద ప్రజలు ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లి చికిత్స చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు.రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి కాలేజ్ రోడ్ లో నిర్మాణం పూర్తి చేస్తున్న భవనంలోకి ఆసుప్రతినీ త్వరగా మార్చి అన్ని రకాల వైద్య సదుపాయాలు మరియు మౌలిక వసతులు ప్రజలకు కల్పించాలని డిమాండ్ చేశారు.

## ఈ నెల 27న గ్రామసభలు, వార్డుసభలు

### - ప్రతి ఒక్కరి ఓటు హక్కు మన ప్రజాస్వామ్యానికి పునాది - జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్



జగిత్యాల ప్రతినిధి ఆగస్టు 27 (ప్రజాకలం) ఈ నెల 27వ తేదీ గురువారం జగిత్యాల జిల్లాలోని అన్ని గ్రామీణ ప్రాంతాల్లో గ్రామసభలు, పట్టణ ప్రాంతాల్లో వార్డుసభలు నిర్వహించను న్నట్లు జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ వెల్లడించారు. గ్రామీణ ప్రాంతాల్లోని పంచాయతీ భవనాల్లో, పట్టణ ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాల్లో ఈ సభలు జరుగుతాయని,ఈ సభల్లో బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓలు) ముసాయిదా ఓటరు జాబితాను ప్రజల సమక్షంలో చదివి వినిపిస్తారన్నారు.ప్రతి ఓటరూ తప్పనిసరిగా సభకు హాజరై ఓటరు జాబితాలో తమ పేరు ఉందో లేదో తనిఖీ చేసుకోవాలన్నారు. పేరు,ఇతర వివరాల్లో ఏమైనాతప్పులుఉంటే సంబంధిత అధికారులదృష్టికి తీసుకురావాలని,మీ పేరు ఓటరు జాబితాలో ఉందో లేదో తెలుసుకోండి...మీ ఓటు హక్కును కాపాడుకోండన్నారు. ప్రజాస్వామ్యంలో మీ భాగస్వామ్యాన్ని చాటుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బి. సత్య ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు.

## వైభవంగా మిలాద్ ఉన్ నబీ ర్యాలీ

### – జ్యూస్ పంపిణీ చేసి మతసామరస్యం చాటిన హిందూ సోదరులు



పెద్దపల్లి,ఆగస్టు 26:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) పట్టణంలో మైనార్టీ సోదరులు బుధవారం ఘనంగా నిర్వహించిన జష్నే ఈ మిలాద్ ఉన్ నబీ ర్యాలీ సందర్భంగా మతసామరస్యం పరిఢవిల్లింది.ఈ వేడుకల్లో భాగంగా కొలిపాక శ్రీనివాస్ ఆధ్వర్యంలో ర్యాలీలో పాల్గొన్న వారికి జ్యూస్ బాటిళ్లను పంపిణీ చేయగా,ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన 18వ వార్డు కౌన్సిలర్ కొలిపాక సంపత్ మాట్లాడుతూ పెద్దపల్లి పట్టణం మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తోందని,హిందూ–ముస్లిం సోదరులు అన్నదమ్ముల్లా కలిసిమెలిసి జీవిస్తున్న ఈ ఐకమత్యం ఇలాగే కొనసాగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఏఐఎఫ్‌బీ పట్టణ కన్వీనర్ కుక్క శ్రావణ్‌కుమార్,మెహరాజ్,కొలిపాక కృష్ణ,షఫీ,కుక్క అశోక్,నూనె వెంకటేష్,వేల్పుల సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## బీడీ కార్మికుల జాతీయ మహాసభల్లో తెలంగాణకు కీలక బాధ్యత

### జగిత్యాల జిల్లా కోరుట్ల వాస్తవ్యుడు ఎం.డి. ముక్రమ్ జాతీయ సహాయ కార్యదర్శిగా ఏకగ్రీవ ఎన్నిక



మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి, ఆగస్టు 26(ప్రజా కలం): బీహార్ రాష్ట్రంలోని సమస్తీపూర్ జిల్లా దర్శన్ సారాయి పట్టణంలో ఆగస్టు 23, 24 తేదీల్లో జరిగిన ఆలిండియా బీడీ వర్కర్స్ ఫెడరేషన్ 13వ జాతీయ మహాసభలు విజయవంతంగా ముగిశాయి. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి బీడీ కార్మికుల ప్రతినిధులు హాజరై కార్మికుల సమస్యలు, హక్కులు, సంక్షేమం, ఉపాధి భద్రత తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ మహాసభల్లో తెలంగాణ రాష్ట్రానికి చెందిన బి. గోవర్ధన్ జాతీయ ఉపాధ్యక్షుడిగా, కె. శాంత, ఎ. లక్ష్మణ్, కె. అనసూర్య జాతీయ మండలి సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అదే విధంగా జగిత్యాల జిల్లా కోరుట్ల వాస్తవ్యుడైన ఎం.డి. ముక్రమ్ జాతీయ సహాయ కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఎం.డి. ముక్రమ్ మాట్లాడుతూ తెలంగాణ బీడీ కార్మికుల సమస్యలను జాతీయ స్థాయిలో బలంగా వినిపించేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. తనను జాతీయ సహాయ కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్న సమాఖ్య నాయకత్వానికి, దేశవ్యాప్తంగా మహాసభల్లో పాల్గొన్న బీడీ కార్మికుల ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. ఎం.డి. ముక్రమ్‌కుజాతీయ స్థాయిలో కీలక బాధ్యత దక్కడం పట్ల తెలంగాణ బీడీ కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

# అంబేద్కర్ అభయ హస్తం హామీలు అమలు చేయాలి

### - హామీలను విస్మరిస్తే కాంగ్రెస్ నాయకులను గ్రామాల్లో తిరుగనివ్వం

### - దళిత,గిరిజన,ఆదివాసి జేఏసీ హెచ్చరిక



పెద్దపల్లి,ఆగస్టు26:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన అంబేద్కర్ అభయ హస్తం హామీలను వెంటనే అమలు చేయాలని,లేనిపక్షంలో రాష్ట్రంలో కాంగ్రెస్ నాయకులను గ్రామాల్లో తిరుగనివ్వమని దళిత,గిరిజన,ఆదివాసి జేఏసీ నాయకులు బొంకూరి సురేందర్ సన్ని,కండెల వెంకటేశ్వర్లు హెచ్చరించారు.కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తొలి కేబినెట్ సమావేశంలోనే వీటిని అమలు చేస్తామని హామీ ఇచ్చి,నేటికి మూడేండ్లు గడుస్తున్నా ఆచరణకు నోచుకోకపోవడంపై జేఏసీ తీవ్ర నిరసన వ్యక్తం చేసింది.ఈ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా బుధవారం చేవెళ్లలోని అదే కేవీఆర్ గ్రౌండ్‌లో చాయ్ పే చర్చ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం సమర్పించారు.ప్రభుత్వ వైఖరిని ఎండగడుతూ సంప్రదాయబద్ధంగా ఎరుకల నాంచారమ్మను సోది అడగడం విశేషంగా నిలిచింది.ఈ సందర్భంగా దళిత,గిరిజన,ఆదివాసి జేఏసీ నాయకులు బొంకూరి సురేందర్ సన్ని,కండెల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆగస్టు 26–2023న చేవెళ్లలోని కేవీఆర్ గ్రౌండ్‌లో నిర్వహించిన భారీ బహిరంగ సభలో దళిత,గిరిజన, ఆదివాసి ప్రజల అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీ పలు హామీలు గుప్పించిందని,ప్రతి ఎస్సీ,ఎస్టీ కుటుంబానికి రూ.12 లక్షల ఆర్థిక సాయం అందిస్తామని, మూడు ఎస్సీమూడు ఎస్టీ కార్పొరేషన్లు ఏర్పాటు చేస్తామని మొత్తం 12 అంశాలతో కూడిన డిక్లరేషన్‌ను ఆ సభలో మల్లికార్జున ఖర్గే,రేవంత్ రెడ్డి, దామోదర రాజనర్సింహ,మల్లు భట్టి విక్రమార్క,సంపత్ కుమార్,బెల్లయ్య నాయక్,నాగరిగారి ప్రీతంలు ప్రకటించారని గుర్తు చేశారు.ఇచ్చిన మాట ప్రకారం ఈ డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.లేనిపక్షంలో కాంగ్రెస్ నాయకులను గ్రామాల్లో తిరుగనివ్వమని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బొంగు వెంకటేష్ గౌడ్,కండెల పెద్ద వెంకటేష్,మద్దెల భవాని,కల్లేపల్లి రవి,వనం గంగయ్య,మిట్టపెల్లి రాధిక,వనం పుల్లయ్య,మిక్కిలి సుంకయ్య,జగన్నాథం మహేష్,జగన్నాథం శేఖర్,మ్యారడి అంజయ్య,వనం కావేరి,వనం లలిత,వనం పద్మ,మద్దెల ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతిభకు పదును పెట్టేలా ఎస్ఎన్ఆర్ స్పోర్ట్స్ అకాడమీ

### – ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే విజయరమణారావు



సుల్తానాబాద్,ఆగస్టు 26:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించేలా ప్రోత్సహించాలని ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు.పట్టణంలోని గాంధీనగర్‌లో కోచ్ బొల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎస్ఎన్ఆర్ టేబుల్ టెన్నిస్, చెస్ స్పోర్ట్స్ అకాడమీని బుధవారం మున్సిపల్ చైర్‌పర్సన్ బిరుదు కృష్ణ,జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంతటి అన్నయ్యగౌడ్ తో కలిసి అకాడమీని ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఏకాగ్రత, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని తెలిపారు.చిన్ననాటి నుంచే క్రీడలపై ఆసక్తి పెంచి,ప్రతిభను గుర్తించి సరైన శిక్షణ అందిస్తే రాష్ట్ర,జాతీయ స్థాయిలో రాణించే అవకాశం ఉంటుందన్నారు. సుల్తానాబాద్ లో టేబుల్ టెన్నిస్,చెస్ క్రీడకు ప్రత్యేకంగా అకాడమీ ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు.ఎస్ఎన్ఆర్ స్పోర్ట్స్ అకాడమీ ద్వారా స్థానిక విద్యార్థులు,యువ క్రీడాకారులకు మెరుగైన శిక్షణ లభించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బిరుదు కృష్ణ,జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంతటి అన్నయ్యగౌడ్ మాట్లాడుతూ క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు అకాడమీలు ఎంతో దోహదపడతాయని అన్నారు.క్రీడలతోపాటు విద్యలోనూ రాణించేలా విద్యార్థులు కృషి చేయాలని సూచించారు.అకాడమీని సద్వినియోగం చేసుకుని జిల్లా,రాష్ట్ర స్థాయిలో సత్తా చాటాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ అంతటి పుష్పలత, స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు ముస్త్యాల రవీందర్,ఇండియన్ పబ్లిక్ పాఠశాల చైర్మన్ సంజీవ్ కుమార్,ప్రిన్సిపల్ కృష్ణప్రియ,టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కోడం అజయ్,మున్సిపల్ కౌన్సిలర్లు వర ప్రదీప్,కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అబ్బాయి గౌడ్,గరిగే శ్రీనివాస్ నీరుకుళ్ల సర్పంచ్ సతీష్,ఎలిగేడు సర్పంచ్ కప్పల ప్రవీణ్,స్పోర్ట్స్ క్లబ్ కార్యదర్శి అమీర్‌శెట్టి తిరుపతి,పీఈటీ కార్యదర్శి దాసరి రమేష్,కుమార్,కిషోర్,జగిత్యాల టేబుల్ టెన్నిస్ కోచ్ శ్రీకాంత్,కరీంనగర్ టేబుల్ టెన్నిస్ కోచ్ గౌతమ్‌రెడ్డి,పెద్దపల్లి జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ ఇక్బాల్, కోశాధికారి గోపీకృష్ణ, వ్యాయామ ఉపాధ్యాయులు నరేష్, వెంకటేష్,శేఖర్, విద్యార్థులు, క్రీడాకారులు,తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ విద్యకు ఏడాది పూర్తి

### – గణనీయంగా పెరిగిన విద్యార్థుల ప్రతిభ



వరంగల్,ఆగస్టు 26 ప్రజా కలం ప్రతినిధి

వరంగల్ లో గణితం,సైన్స్ విద్యను డిజిటల్ వనరులతో మరింత బలోపేతం చేసే దిశగా పాఠశాల విద్యాశాఖ,ఖాన్ అకాడమీ ఇండియా చేపట్టిన రాష్ట్రవ్యాప్త కార్యక్రమం తొలి ఏడాదిలోనే కీలక మైలురాయిని చేరుకుంది.2025–26 విద్యా సంవత్సరంలో 6 నుంచి 12వ తరగతి వరకు చదువుతున్న 9 లక్షల మందికి పైగా విద్యార్థులకు ఉచిత డిజిటల్ అభ్యసన వనరులు అందుబాటులోకి వచ్చాయి.తెలంగాణ ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి ఎ.రేవంత్‌రెడ్డి నాయకత్వంలో చేపట్టిన ఈ కార్యక్రమం జూన్ 2025లో ప్రారంభమైంది.ఇప్పటివరకు రాష్ట్రంలోని దాదాపు 6 వేల పాఠశాలల్లో సుమారు 20 వేల మంది ఉపాధ్యాయులకు శిక్షణ అందించారు.కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు (KGBV), మోడల్ స్కూళ్లు,రెసిడెన్షియల్ విద్యాసంస్థలు,సొసైటీ పాఠశాలలు, ప్రభుత్వ,స్థానిక సంస్థల పాఠశాలలు ఈ కార్యక్రమంలో భాగమయ్యాయి. రాష్ట్రంలోని మొత్తం పాఠశాలల్లో దాదాపు 75 శాతం వరకు కార్యక్రమం విస్తరించింది.విద్యార్థులు గణితం, సైన్స్‌లో క్రమం తప్పకుండా సాధన చేసేలా పాఠశాల విద్యాశాఖ వారపు ఆన్‌లైన్ అభ్యసన మార్గదర్శకాలను అమలు చేసింది.ఖాన్ అకాడమీ ఇండియా అందించిన కార్యక్రమ సమాచారం,డేటా ఆధారిత అంతర్దృష్టులు,కార్యాచరణ సూచనలు కార్యక్రమ పురోగతిని పర్యవేక్షించడంతోపాటు తదుపరి నిర్ణయాలకు ఉపయోగపడ్డాయి.

“తొలి ఏడాదిలోనే 9 లక్షల మందికి పైగా విద్యార్థులకు చేరువ కావడం తెలంగాణలో నాణ్యమైన అభ్యసన అవకాశాలను విస్తరించడంలో ముఖ్యమైన ముందడుగు” అని విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డాక్టర్ యోగితా రాణా,ఐఏఎస్ తెలిపారు. డిజిటల్ గణితం,సైన్స్ అభ్యసనను విద్యార్థుల రోజువారీ విద్యలో స్థిరమైన భాగంగా మార్చడమే తదుపరి లక్ష్యమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా SCERT, ఖాన్ అకాడమీ ఇండియాతో కలిసి 200 మంది మాస్టర్ ట్రైనర్లను సిద్ధం చేసింది. వారు మండల వనరుల వ్యక్తులకు శిక్షణ ఇవ్వగా, వారు మండల స్థాయిలో గణితం, సైన్స్ ఉపాధ్యాయులకు శిక్షణ అందించారు. ఈ క్యాస్కేడ్ శిక్షణ విధానం ద్వారా కార్యక్రమాన్ని పాఠశాల స్థాయికి విస్తరించారు. KGBVల్లోనూ కార్యక్రమానికి మంచి స్పందన లభించింది.లక్ష మందికి పైగా విద్యార్థులు ఇందులో నమోదు కాగా, ఇది ఆయా పాఠశాలల విద్యార్థుల సంఖ్యలో దాదాపు 84 శాతంగా ఉంది. ముఖ్యంగా సైన్స్ అభ్యసనంపై విద్యార్థులు ఆసక్తి చూపడం గమనార్హం.ఖాన్ అకాడమీ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ స్వాతి వాసుదేవన్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వ నాయకత్వం,SCERT సహకారం, జిల్లా అధికారులు,పాఠశాలల నాయకులు,ఉపాధ్యాయుల కృషి వల్ల ఈ విజయాన్ని సాధించామని తెలిపారు.ప్రస్తుత విద్యా సంవత్సరంలో కార్యక్రమాన్ని మరింత విస్తరించడంతోపాటు విద్యార్థుల అభ్యసన నాణ్యత,క్రమబద్ధమైన వినియోగంపై దృష్టి సారించనున్నారు.జిల్లా నోడల్ అధికారులు వారపు పర్యవేక్షణ ద్వారా పాఠశాలలకు అవసరమైన సహకారం అందించనున్నారు.

# ఉద్యోగుల జేఏసీ ధర్నా ను విజయవంతం చేయాలి

### - టీపిసిప రాష్ట్ర కార్యదర్శి హరి అశోక్ కుమార్



మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి ఆగస్టు 26(ప్రజా కలం) తెలంగాణ ఉద్యోగుల జేఏసీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో కలెక్టరెట్ వద్ద గురువారం చేపట్టే ధర్నాను అధిక సంఖ్య లో పాల్గొని విజయవంతం చేయాలని తెలంగాణ పెన్షనర్స్ సెంట్రల్ అసోసియేషన్ తరపున రాష్ట్ర కార్యదర్శి హరి అశోక్ కుమార్ పిలుపు నిచ్చారు. బుధవారం కోరుట్ల డివిజన్ కేంద్రం లోని సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ సమావేశ మందిరం లో ఉద్యమ కార్యాచరణకు మద్దతుగా పెన్షనర్ల కోరుట్ల డివిజన్ స్థాయి సమావేశం అధ్యక్షులు పబ్బా శివానందం ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సమావేశంలో హరి అశోక్ కుమార్ మాట్లాడుతూ పీ ఆర్ సీ అమలు, పెండింగ్ లో ఉన్న 6 డీ ఏల విడుదల, సీ పి ఎస్ ను రద్దు చేసి ఓ పి ఎస్ పునరుద్ధరణ, ఉద్యోగులకు మెరుగైన ఆరోగ్య భద్రత కల్పించాలన్నారు.ఉద్యమం లో భాగంగా ఆగస్టు27 గురువారం జగిత్యాల కలెక్టరెట్ ఎదుట ధర్నా, సెప్టెంబర్ 1 న పెన్షన్ విద్రోహ దినం నిరసన, సెప్టెంబర్ 10న హైదరాబాద్ లో మహా ధర్నా కార్యక్రమాలను విజయవంతం చేయాలని పెన్షనర్లకు పిలుపు నిచ్చారు. పెన్షనర్లు ప్రభుత్వం కు వ్యతిరేకం కాదని, తమకు రావాల్సిన హక్కుల కోసం మాత్రమే ఉద్యమబాట పడుతున్నామన్నారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పుప్పాల హన్మంత్ రెడ్డి,కోరుట్ల డివిజన్ అధ్యక్షులు పబ్బా శివానందం,సహాయ అధ్యక్షులు చిలుక గంగారాం ఉపాధ్యక్షులు ఎం.డీ. సైఫోద్దీన్,కోశాధికారి ఏన్.లక్ష్మి నారాయణ,సాబితలీ,మల్కయ్య, సాంబమూర్తి కోరుట్ల, మేడిపల్లి, కథ లాపూర్ మండలాల పెన్షనర్లు పాల్గొన్నారు.

# గ్రామస్థాయి నుంచే యువజన కాంగ్రెస్ బలోపేతం

### - రాష్ట్ర ఉపాధ్యక్షుడు మిట్టపల్లి వెంకటేష్




పెద్దపల్లి,ఆగస్టు 26:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) యువజన కాంగ్రెస్‌ను గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేసే దిశగా అసెంబ్లీ,జిల్లా,మండల స్థాయి కమిటీలను పూర్తిస్థాయిలో త్వరితగతిన ఏర్పాటు చేయాలని తెలంగాణ యువజన కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు,పెద్దపల్లి జిల్లా ఇన్‌చార్జి మిట్టపల్లి వెంకటేష్ పిలుపునిచ్చారు. బుధవారం ప్రభుత్వ విప్,పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు క్యాంపు కార్యాలయంలో జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బొంకూరి అవినాష్ అధ్యక్షతన అత్యవసర సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో జిల్లావ్యాప్తంగా పార్టీ చేపట్టిన నూతన కార్యక్రమాలు,సంస్థాగత పటిష్టతపై విస్తృతంగా చర్చించారు.ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలోకి విస్తృతంగా తీసుకెళ్లి ప్రతి అర్హుడికి అందేలా యువజన కాంగ్రెస్ శ్రేణులు సైనికులా పనిచేయాలని, ప్రజల ఎదుర్కొంటున్న ప్రజా సమస్యల పరిష్కారంలో ఎప్పుడూ ముందుండి పోరాడాలని దిశానిర్దేశం చేశారు.ఈ కార్యక్రమంలో మంథని అసెంబ్లీ అధ్యక్షుడు చీమల సందీప్,పెద్దపల్లి అసెంబ్లీ అధ్యక్షుడు ముత్యాల నరేష్ ముదిరాజ్,రాష్ట్ర కార్యదర్శి మధుకర్ యాదవ్‌తో పాటు జిల్లా ప్రధాన కార్యదర్శులు,అసెంబ్లీ,పట్టణ, మండలాల అధ్యక్షులు,పలువురు యువజన కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో యువకుడు బలవన్మరణం



పెద్దపల్లి,ఆగస్టు26 :(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) పెద్దపల్లి పట్టణం తిలక్ నగర్‌కు చెందిన తిర్రి సామ్రాట్ (39) అనారోగ్య సమస్యలతో పాటు వ్యక్తిగత కారణాల వల్ల తీవ్ర మనోవేదనకు గురై బలవన్మరణానికి పాల్పడినట్లు పట్టణ పోలీసులు తెలిపారు.పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం... కొద్ది సంవత్సరాల క్రితం భార్యతో విడాకులు కావడంతో ఒంటరితనం పెరిగి సామ్రాట్ మద్యానికి బానిసయ్యాడు,దీనివల్ల కాలక్రమేణా అతని ఆరోగ్యం పూర్తిగా క్షీణించగా పరీక్షించిన వైద్యులు లివర్ డ్యామేజ్ అయినట్లు నిర్ధారించారు.తన ప్రాణాంతక వ్యాధి ఎంతకీ నయం కాదనే తీవ్రమైన నిరాశతో జీవితంపై విరక్తి చెందిన అతను,ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని పోలీసులు పేర్కొన్నారు. ఈ దుర్ఘటనపై మృతుని తల్లి తిర్రి లక్ష్మి ఫిర్యాదు మేరకు పెద్దపల్లి టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని,అన్ని కోణాలలోనూ సమగ్రంగా దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

# నేడు మండల వ్యాప్తంగా ఎస్ఐఆర్ పై ప్రత్యేక గ్రామ సభలు

ఎండపల్లి, ఆగస్టు 26 : ( ప్రజా కలం ప్రతినిధి ) మండలం లో నేడు మండల వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణ లో గురువారం రోజున ఉదయం 9 గంటలకు ప్రత్యేక గ్రామసభ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఎస్ ఐ ఆర్ పై ప్రత్యేక గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు అధి కారులు ప్రకటించారు. ఎస్ ఐ ఆర్ ఆధారంగా ఓటర్ జాబితాలో సవరణలు, మార్పులు, చేర్పుల పై గ్రామ సభలో చర్చించి అవసరమైన వివరాలను పరిశీలిస్తున్నారు. ఈ గ్రామ సభలను విజయవంతం చేయడానికి గ్రామ ప్రజలు సహకరించాలని అధి కారులు కోరారు. ఇట్టి కార్యక్రమం లో జిపిఓ, బిఎల్ఓ లు గ్రామం నకు చెందిన ఓటరు లిస్టు యొక్క ముసాయిదా జాబితా, ఏ ఎస్ డి జాబితా అందరికి చదివి వినిపించ డం జరుగుతుంది. 18 సంవత్సరములు నిండిన వారు ఫామ్ 6 మరియు ఏమైనా సవరణలు ఉన్న వారు ఫారం 8 సమర్పించా లని సూచించనైనది. గౌరవ సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు మెంబర్లు, గ్రామ స్థాయి అధికారులు, గ్రామ ప్రజలు అధికారులు అంగన్వాడి కార్యకర్తలు ఆశా కార్యకర్తలు మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు యువకులు గ్రామ ప్రజలు సకాలం లో గ్రామ సభలకు హాజరై తమ సూచనలు, అభిప్రాయాలు తెలియ జేయాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. ఓటరు జాబితాకు సంబంధించిన మార్పులు, చేర్పుల, సవరణల పై ప్రజలు గ్రామ సభను సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు.



ప్రజా కలం

గురువారం, ఆగస్టు 27, 2026

## మోడీ 3.0 ఎందుకింత మెతక వైఖరి

నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం మూడోసారి అధికారం చేపట్టిన తర్వాత కొన్ని సవాళ్లు ఎదురవుతున్నాయి. ఇటీవలి పార్లమెంట్ సమావేశాల్లో ప్రతిపక్ష పార్టీలు గణనీయమైన ఆధిపత్యం ప్రదర్శించాయి. వీధి ఉద్యమాలపై ప్రభుత్వం అనుసరిస్తున్న మెతక వైఖరి, దాని నిర్ణయాల దృఢత్వంపై సందేహాలు తలెత్తిస్తోంది.. తాజాగా ఢిల్లీలోని పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్ వద్ద రాహుల్ గాంధీ చేసిన ధర్నా చర్చనీయాంశమైంది. పెల్లెట్ గాయాలపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ రాహుల్ గాంధీ ఐదున్నర గంటలపాటు రోడ్డుపై కూర్చుని ధర్నా చేశారు. అయితే లలితా కుమారి కేసులో సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం ఎఫ్ఐఆర్‌కు ముందు లోతైన దర్యాప్తు, చర్చలు అవసరం. ఆరు వారాల సమయం ఉన్నప్పటికీ, ధర్నా తర్వాతనే ఎఫ్ఐఆర్ నమోదు కావడం అనుమానాలకు తావిస్తోంది. ఢిల్లీ కేంద్రపాలిత ప్రాంతం కావడంతో లెఫ్టినెంట్ గవర్నర్, హోం శాఖ అధికారుల అనుమతి అవసరం. అయినా ఈ ప్రక్రియకు ఐదున్నర గంటలు పట్టడం, లేదా ఉద్దేశపూర్వకంగా ప్రచార అవకాశం కల్పించడమా అనే ప్రశ్నలు బీజేపీ అనుచరుల్లోనూ వినిపిస్తున్నాయి. ముందే నమోదు చేసి ఉంటే ఈ మీడియా దృష్టి తప్పేది.రైతు ఉద్యమాల తర్వాత మోదీ ప్రభుత్వం వెనక్కి తగ్గిన సందర్భాలు ఉన్నాయి. దీన్ని హింస నివారణకు తీసుకున్న నిర్ణయంగా చాలామంది అభివర్ణించారు. అయితే ప్రతిపక్షాలు వీధి ఆందోళనల ద్వారా ప్రభుత్వాన్ని ఒత్తిడి చేయవచ్చని గ్రహించినట్లు కనిపిస్తోంది. నోయిడాలో కార్మికుల ఆందోళన వెనుక అర్బన్ నక్సల్ ప్రభావం ఉందని చెప్పబడుతున్నా, అది సాధారణ ప్రజలకు అంతగా తెలియలేదు. అభిజిత్ దీప్కే నేతృత్వంలోని నీట్ లీకేజీ వ్యతిరేక నిరసనలు, సోనమ్ వాంగ్‌చుక్ దీక్ష వంటి సందర్భాల్లో ప్రభుత్వం సమయానుకూలంగా నియంత్రించలేకపోయింది. పార్లమెంటు సమీపంలో హింసాత్మక పరిస్థితులకు అవకాశం ఏర్పడటం ప్రభుత్వ నిర్ణయాల్లో స్పష్టత లోపాన్ని సూచిస్తోంది. నక్సలైట్ సమస్య, ఈశాన్య రాష్ట్రాలు, మణిపూర్, నాగాలాండ్‌లోని అల్లర్లను కేంద్ర ప్రభుత్వం సమర్థవంతంగా అదుపులో ఉంచింది. కానీ ఢిల్లీ విషయంలో మెతక వైఖరి కనిపిస్తోంది. అభిజిత్ దీప్కే పాఠశాలలను సందర్శించడం లాంటి చర్యలు అధికారం లేకుండానే జరుగుతున్నాయి. ఇది ఉపాధ్యాయుల కార్యకలాపాలకు ఆటంకం కలిగించినా, ప్రభుత్వం స్పష్టమైన చర్యలు తీసుకోవడం లేదు. జెన్‌జీ ఉద్యమాలు ఉధృతం కాకుండా ఉండాలని కోరుకున్నా, అతి మెతక వైఖరి వల్ల వ్యతిరేక ప్రభావం పడుతుందని విమర్శలు వస్తున్నాయి.సుప్రీంకోర్టు ఏర్పాటు చేసిన కమిటీ ఇప్పటికే పెల్లెట్ ఘటనలు, దాడులపై విచారణ జరుపుతోంది. ఈ నేపథ్యంలో అదనపు ఎఫ్ఐఆర్‌లు, ధర్నాలు అవసరమా అనే ప్రశ్న ఉంది. ప్రభుత్వం గతంలో చూపిన దృఢత్వాన్ని ఢిల్లీ వంటి కీలక ప్రాంతాల్లోనూ కొనసాగిస్తేనే దాని నిర్ణయాలపై నమ్మకం నిలుస్తుంది. లేనిపక్షంలో వీధి ఆందోళనలు మరింత బలపడి, పాలనా సామర్థ్యంపై ప్రశ్నలు తీవ్రమయ్యే అవకాశం ఉంది..2014లో 'అచ్ఛే దిన్' నినాదంతో అధికారంలోకి వచ్చిన మోదీ, 2019లో పుల్వామా నేపథ్యంలో స్థిరమైన ప్రభుత్వ అవసరాన్ని నొక్కి చెప్పి 303 సీట్లు సాధించారు. 2024లో 'అబ్‌కీ బార్ చార్‌సౌ' పిలుపు ఉన్నప్పటికీ బీజేపీ 240 సీట్లకు పరిమితమైంది. కాంగ్రెస్ 99 సీట్లతో మెరుగైన ప్రదర్శన ఇచ్చింది. రాహుల్ గాంధీ రెండు స్థానాల్లో విజయం సాధించారు. ఈ దశలో విపక్షాలు బలపడినట్లు కనిపించింది. అయితే తర్వాతి అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ మహారాష్ట్ర, హర్యానా, పశ్చిమ బెంగాల్‌లో సత్తా చాటింది. ప్రభుత్వం లేని రాష్ట్రాల్లో కూడా ఓట్లు, సీట్లు పెరిగాయి. 2025 చివరి నుంచి కాంగ్రెస్ విమర్శలు పదునెక్కినప్పటికీ, మోదీ వద్ద స్పష్టమైన ఇష్యూ లేకపోవడం గమనార్హం. ఇలాంటి సమయంలోనే ఆయన రెండు మాస్టర్ స్ట్రోక్స్ ప్రదర్శించారు.స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో మోదీ వాడిన 'దిమాగీ నక్సల్స్' పదం చర్చనీయాంశమైంది. దీనిని దేశ వ్యతిరేక శక్తులు, అభివృద్ధికి అడ్డుగా నిలిచేవారు అనే అర్థంలో వాడినట్లు అర్థం చేసుకోవచ్చు. ఆసక్తికరంగా, మావోయిస్టు పార్టీలు, వామపక్షాలు, ఎస్పీ, ఆర్జేడీ, టీఎంసీ, డీఎంకే వంటి పార్టీలు స్పందించలేదు. కానీ కాంగ్రెస్ నేత చిదంబరం తొలుత స్పందించి, ఆ తర్వాత పార్టీ, దాని అనుబంధ సంస్థలు ఈ పదాన్ని తమకు అన్వయించుకున్నాయి. మోదీ ఒక్కసారి చెప్పిన పదాన్ని కాంగ్రెస్ తరచూ వాడుతూ, తమను తాము ఆ వర్గంలోకి చేర్చుకున్నట్లు చిత్రం ఏర్పడింది. ఇది విపక్షాల మధ్య విభేదాలను బయటపెట్టింది. ఇతర పార్టీలు దూరం ఉండగా, కాంగ్రెస్ మాత్రం దానిని ఓన్ చేసుకోవడం రాజకీయంగా నష్టకరం.ఇక రెండో అంశం వందేమాతరం పూర్తిగా పాడాలనే చట్టం. ముస్లిం పార్టీలు కూడా దీన్ని వ్యతిరేకించలేదు. అన్ని పార్టీల నాయకులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు ఆగస్టు 15న పాడకపోయినా లేచి నిలబడ్డారు. కమ్యూనిస్టులు, ఇతర విపక్షాలు స్పందించలేదు. కానీ కాంగ్రెస్ వైపు నుంచి సోనియా గాంధీ వందేమాతరం పాడుతుంటే ఆపే ప్రయత్నం చేసిన వీడియో వైరల్ అయి విమర్శలకు తావిచ్చింది. అంతేకాదు 1950లో నెహ్రూ తీర్మానం ప్రకారం వందేమాతరం పాడతామని కాంగ్రెస్ తీర్మానం చేసింది. దీంతో నెహ్రూ జిన్నా కోసం రెండు చరణాలకు పరిమితం చేసిన చరిత్ర ఉంది. పూర్తి పాట రాకపోయినా, పాట వచ్చినప్పుడు లేచి నిలబడి గౌరవించడం సాధారణం. ఇందులో కూడా కాంగ్రెస్ నేతలు ఇష్టపడకపోవడం, పాకిస్తాన్ ముస్లిం లీగ్‌కు అనుకూలం అనే ముద్రను బలపరిచింది. ముస్లిం ఓట్లకు మద్దతు ఇస్తున్న కాంగ్రెస్, అస్సాం, బెంగాల్, జమ్మూ కాశ్మీర్ వంటి రాష్ట్రాల్లో అధికారంలో లేకపోవడం మరో వైరుధ్యం.ఈ రెండు అంశాలు కాంగ్రెస్‌ను సెల్ఫ్ గోల్స్ కొట్టుకునేలా చేశాయి. మోదీ ప్రస్తావించినప్పుడు ఇతర పార్టీలు నిశ్శబ్దంగా ఉండగా, కాంగ్రెస్ మాత్రం ప్రతిస్పందించి, తన స్థానాన్ని బలహీనపరిచుకుంది. జాతీయవాదం, దేశభక్తి అంశాల్లో విపక్షాల మధ్య సమన్వయం లేకపోవడం స్పష్టమైంది. రాబోయే రోజుల్లో ఈ రెండు అంశాలు కాంగ్రెస్‌ను నిరంతరం ఇబ్బంది పెట్టే అవకాశం ఉంది. పైచేయి సాధించిన దశలో వ్యూహాత్మకంగా వ్యవహరించకపోవడం, మోదీ వలను గుర్తించలేకపోవడం ప్రధాన కారణం.

# విద్యుత్ శాఖలో "మధుసుదను"డు..

## విధి నిర్వహణలో స్ఫూర్తి ప్రదాత -ఎక్కడ విధులు నిర్వహించినా మంచి గుర్తింపు

### ప్రజలకు, సిబ్బందికి అందుబాటులో ఉండే అధికారి - విద్యుత్ శాఖలో మచ్చలేని సేవలు - ఉత్తమ సేవలకు పలుమార్లు ప్రశంసలు

మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి ఆగస్టు 27 (ప్రజా కలం)

విధి నిర్వహణలో అంకితభావం, నిజాయితీ, క్రమశిక్షణకు ప్రతీకగా నిలిచిన విద్యుత్ శాఖ డివిజనల్ ఇంజనీర్ గౌతమ్ మధుసూదన్ తన సేవలతో ప్రత్యేక గుర్తింపు పొందుతున్నారు. ప్రజల సమస్యల పరిష్కారంతో పాటు శాఖాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తూ సహోద్యోగులకు సైతం స్ఫూర్తిగా నిలుస్తున్నారు. విద్యుత్ శాఖలో రైతులకు వినియోదారులకు అందుబాటులో ఉంటూ వేలాది మందికీ సేవలందిస్తు.ఇబ్బందికి ఎప్పటికప్పుడు సలహాలు సూచనలు అందిస్తూ సమర్ధవంతమైన పాలనను విద్యుత్ శాఖలో అందిస్తున్న గౌతమ మధుసున్ కథనం...





వేములకుర్తి లో అదనపు ఫ్రిడర్ ప్రారంభోత్సవం లో డిఈ మధుసుధన్



డిఈ ని సత్కరిస్తున్న సిబ్బంది

**నాన్న రాజమల్లయ్య స్ఫూర్తితో...**

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మంచిర్యాల పట్టణానికి చెందిన గౌతమ్ రాజమల్లయ్య - శంకరమ్మ దంపతుల కుమారుడు మధుసూదన్. విద్యుత్ శాఖలో 1969 నుంచి 2005 వరకు సేవలందించి జేఏఓగా పదవీ విరమణ పొందిన తన తండ్రి రాజమల్లయ్యను ఆదర్శంగా తీసుకుని మధుసూదన్ ఉన్నత విద్యను అభ్యసించారు. వరంగల్‌లో డిప్లొమా పూర్తి చేసి, హైదరాబాద్ జేఎన్‌టీయూలో బీటెక్ పట్టా సాధించారు. విద్యుత్ శాఖలో ఉద్యోగావకాశాల కోసం నిర్వహించిన పోటీ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి 1992లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జైపూర్ మండలంలో సబ్ ఇంజనీర్‌గా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించారు. అనంతరం 1997లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా జూలపల్లి మండలంలో అసిస్టెంట్ ఇంజనీర్‌గా బాధ్యతలు చేపట్టారు. శాఖాపరమైన పరీక్షల్లో ప్రతిభ కనబరుస్తూ 2002లో ఏడీఈగా పదోన్నతి పొందారు.సుల్తానాబాద్, కరీంనగర్, హన్మకొండ ప్రాంతాల్లో ఎడిఈ గా సేవలందించిన ఆయన తన సమర్థతతో ఉన్నతాధికారుల ప్రశంసలు అందుకున్నారు. అనంతరం డివిజనల్ ఇంజనీర్‌గా 2017 లో పదోన్నతి పొంది. నిర్మల్ జిల్లా కేంద్రంలో పనిచేశారు. బదిలీ పైన మహబూబాబాద్ జిల్లాకు బదిలీ పైన వెళ్ళారు. 2025 లో మెట్‌పల్లి డివిజన్ మళ్ళీ బదిలీ పైన వచ్చి సమర్థవంతమైన పరిపాలన అందిస్తున్నారు.

**ఉత్తమ సేవలకు రాష్ట్రస్థాయి గుర్తింపు...**

విద్యుత్ శాఖలో బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తూ సంస్థ అభివృద్ధికి విశేష కృషి చేస్తున్న మధుసూదన్‌కు పలుమార్లు ప్రశంసలు లభించాయి. కింది స్థాయి ఉద్యోగుల పని తీరును సమన్వయం చేస్తూ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడంలో ఆయన ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. 2025 సంవత్సరంలో తెలంగాణ రాష్ట్ర విద్యుత్ శాఖలో వివిధ విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన అధికారులకు అందించే అభినందన పురస్కారాన్ని కార్పొరేట్ కార్యాలయంలో చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి చేతుల మీదుగా అందుకున్నారు. జనవరి 26 గణతంత్ర దినోత్సవం సందర్భంగా మెట్‌పల్లి డివిజన్ రాష్ట్రవ్యాప్తంగా నాల్గవ స్థానంలో నిలవడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. ఇటీవల ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా తెలంగాణ రాష్ట్ర మంత్రి మహమ్మద్ అజారుద్దీన్, జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్, అదనపు కలెక్టర్ లత తదితర ఉన్నతాధికారుల సమక్షంలో ఉత్తమ అధికారిగా మరోసారి ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు.

**వినియోగదారుల సేవే లక్ష్యం....**

ఉద్యోగ జీవిత ప్రారంభం నుంచి నేటి వరకు ప్రజాసేవకు ప్రాధాన్యత ఇస్తూ ముందుకు సాగుతున్న మధుసూదన్, వినియోగదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించడంలో ప్రత్యేక గుర్తింపు పొందారు. సిబ్బందితో స్నేహపూర్వకంగా మెలుగుతూ, ప్రజలకు అందుబాటులో ఉంటూ శాఖ ప్రతిష్టను పెంచుతున్నారు. నిజాయితీ, క్రమశిక్షణ, సేవాభావంతో పనిచేస్తున్న మధుసూదన్ యువ ఉద్యోగులకు ఆదర్శంగా నిలుస్తున్నారు.

**విద్యుత్ సమస్యలపై సత్వర పరిష్కారం క్షణాల్లో ఫైళ్లపై సంతకాలు..**

విద్యుత్ సమస్యల పరిష్కారంలో అధికారులు వేగంగాస్పందిస్తుండటంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లిన వెంటనే సంబంధిత సిబ్బందికి ఆదేశాలు జారీ చేయడంతో పాటు అవసరమైన ఫైళ్లపై సంతకాలను సైతం సత్వరమే పూర్తి చేస్తున్నారని,మెట్‌పల్లి విద్యుత్ శాఖ డివిజన్ ఇంజనీర్ (డీఈ) మధుసూదన్ ప్రజల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తూ, పెండింగ్ పనులను వేగంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నారని గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా, కొత్త కనెక్షన్లు, స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు తదితర సమస్యలపై వచ్చిన వినతులను పరిశీలించి త్వరితగతిన పరిష్కారం చూపుతున్నారు.

**సమస్య చెప్పగానే స్పందన....**

విద్యుత్ సమస్యల పరిష్కారానికి కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి లేకుండా, సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లగానే స్పందన లభిస్తుండటంపై ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అవసరమైన అనుమతులు, ఫైళ్లపై సంతకాలు ఆలస్యం కాకుండా చర్యలు తీసుకోవడం వల్ల పనులు వేగంగా జరుగుతున్నాయని పేర్కొన్నారు.

**ప్రజల మన్ననలు....**విద్యుత్ సమస్యల పరిష్కారంలో చొరవ చూపుతున్న డీఈ మధుసూదన్ పనితీరుపై ప్రజలు ప్రశంసలు కురిపిస్తున్నారు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలను సత్వరమే పరిష్కరిస్తే ప్రభుత్వ శాఖలపై ప్రజల్లో మరింత విశ్వాసం పెరుగుతుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు.



విధి నిర్వహణలో సిబ్బందిని అప్రమత్తం చేస్తున్న డిఈ మధుసూదన్

**బాధ్యతాయుతంగా పనిచేస్తే గుర్తింపు ...**
**గౌతమ మధుసూదన్ - విధ్యుత్ శాఖ డిఈ మెట్ పల్లి**

నిబద్ధతతో, నిజాయితీగా, బాధ్యతాయుతంగా పనిచేస్తే గుర్తింపు అనేది సహజంగానే వస్తుంది. విద్యుత్ శాఖలో వేలాది మంది రైతులు, వినియోగదారులతో మమేకమై పనిచేయడం ఎంతో ఆనందాన్ని కలిగిస్తోంది. ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే మా లక్ష్యం. ప్రతి ఉద్యోగి విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తూ సేవా దృక్పథంతో ముందుకు సాగాలి. సమస్యల పరిష్కారంలో వేగం, పనిలో పారదర్శకత, ప్రజల పట్ల బాధ్యత ఉంటే సంస్థకు మంచి పేరు వస్తుంది. భవిష్యత్తులో కూడా వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించేందుకు కృషి చేస్తాం.




సంస్థ చైర్మన్ తో ప్రశంసలు పోందుతున్న డిఈ మధుసుధన్



మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ చేతుల మీదుగా ప్రశంసా పత్రం పొందుతున్న డి ఈ మధుసూదన్

### పాలమూరు మహేందర్ పై దాడి చేసిన

# పోలీసులపై చర్య తీసుకోవాలి

**- తిమ్మాజిపేట ఎస్సై, ఇద్దరు కానిస్టేబుళ్లను విధుల నుంచి తొలగించాలి**

**- బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పృథ్వీరాజ్ డిమాండ్**



నాగర్‌కర్నూల్ జిల్లా ఆగస్టు 26 (ప్రజా కలం ): తిమ్మాజిపేట పోలీస్‌స్టేషన్‌లో పాలమూరు మహేందర్‌పై పోలీసులు దాడి చేశారన్న ఆరోపణలపై బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) తీవ్రంగా స్పందించారు బుధవారం నాడు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మహేందర్‌ను బీఎస్పీ నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పృథ్వీరాజ్ మాట్లాడుతూ విచారణ కోసం పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి మహేందర్‌ను తిమ్మాజిపేట ఎస్సై తీవ్రంగా కొట్టారన్న ఆరోపణలు ఆందోళన కలిగిస్తున్నాయని అన్నారు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం విధుల్లో ఉన్న ఓ కానిస్టేబుల్ తన మెడపై కాలు పెట్టగా ఎస్సై తనపై మూత్ర విసర్జన చేశారని ఆరోపించారని పృథ్వీరాజ్ తెలిపారు. ఈ ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపి బాధ్యులైన తిమ్మాజిపేట ఎస్సైతో పాటు ఇద్దరు కానిస్టేబుళ్లను తక్షణమే విధుల నుంచి తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు. బాధిత మహేందర్ కుటుంబానికి పూర్తి రక్షణ కల్పించి పోలీసు రక్షణ సమక్షంలో వైద్యం అందించాలని కోరారు. మహేందర్ ఆరోగ్యం కుదుటపడిన అనంతరం ఈ విషయాన్ని జిల్లా ఎస్పీ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. అప్పటివరకు స్వేచ్ఛాయుత నిష్పక్షపాత విచారణ జరగాలని డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని నాగర్‌కర్నూల్ ఎమ్మెల్సీ దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు బాధిత కుటుంబ సభ్యులు తెలిపారని, ఎమ్మెల్సీ స్పందించి కుటుంబానికి అండగా నిలవాలని కోరారు అన్నారు మహేందర్‌తో పాటు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లిన వారిని మాజీ సర్పంచ్ వర్గానికి చెందిన కొందరు పోలీస్‌స్టేషన్ ఆవరణలో బెదిరించి గొంతు పట్టుకున్నారన్న ఆరోపణలపై కూడా పృథ్వీరాజ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీస్ స్టేషన్లో ఆవరణంలో ఇలాంటి ఘటనలు పునరావతం కాకుండా జిల్లా అధికార చర్యలు తీసుకోవాలని కోరారు ఈ కార్యక్రమంలో బీఎస్పీ పార్టీ పార్లమెంట్ ఇన్చార్జి సి కళ్యాణ్ జిల్లా ఈసీ సభ్యుడు బాలస్వామి మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి హర్ష ముదిరాజ్ అసెంబ్లీ అధ్యక్షుడు పరశురాం అసెంబ్లీ కమిటీ సభ్యుడు మధు తిమ్మాజిపేట మండల అధ్యక్షుడు శంకర్ తాడూరు మండల అధ్యక్షుడు ఆంజనేయులు సెక్టార్ అధ్యక్షులు అర్జున్ రాముడు తదితరులు పాల్గొన్నారు

# ఆపదలో 108 అండ

### ఆళ్లపల్లి ప్రజలు సద్వినియోగం చేసుకోండి

### 108 తనిఖీలో పీఎం నజీరుద్దీన్, కోఆర్డినేటర్ సతీష్

ఆళ్లపల్లి, ఆగస్టు 26,(ప్రజాకలం)



ఆపద సమయంలో ఒక్క నిమిషం ఆలస్యం కూడా ప్రాణాలకు ముప్పుగా మారే అవకాశం ఉన్నందున, అత్యవసర వైద్య సేవల కోసం 108 అంబులెన్స్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మడి ఖమ్మం జిల్లా 108 ప్రోగ్రాం మేనేజర్ నజీరుద్దీన్ సూచించారు. ఆళ్లపల్లి మండల కేంద్రంలో అందుబాటులో ఉన్న 108 అంబులెన్స్‌ను ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రోగ్రాం మేనేజర్ నజీరుద్దీన్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కోఆర్డినేటర్ సతీష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అంబులెన్స్‌లోని అత్యవసర వైద్య పరికరాలు, మందులు, ఆక్సిజన్ సిలిండర్ పనితీరును పరిశీలించారు. అలాగే వాహన లాగ్‌బుక్, కేస్‌షీట్లు తదితర రికార్డులను తనిఖీ చేశారు.విధుల్లో ఉన్న ఈఎంటీ భాగ్యమ్మ, పైలెట్ శ్రీహర్షలకు అత్యవసర కేసులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, సమాచారం అందిన వెంటనే సంఘటనా స్థలానికి చేరుకునేలా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అంబులెన్స్‌లోని అన్ని పరికరాలు నిరంతరం పనిచేసే స్థితిలో ఉండేలా చూసుకోవాలని, ప్రజలకు వేగవంతమైన వైద్య సహాయం అందించేందుకు వాహనాన్ని ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు.

అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు భయాందోళనలకు గురికాకుండా వెంటనే 108కు సమాచారం అందించాలని నజీరుద్దీన్ కోరారు. ప్రమాదాలు, అనారోగ్య అత్యవసర పరిస్థితులు, ఇతర ప్రాణాపాయ సందర్భాల్లో 108 సేవలు ప్రజలకు అండగా నిలుస్తాయని తెలిపారు. ఆపదలో ఆలస్యం చేయకుండా 108కు సమాచారం ఇవ్వండి.. ప్రాణాలను కాపాడే అత్యవసర సేవలను సద్వినియోగం చేసుకోండి అని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు

## నిర్మల్ పట్టణంలో ఘనంగా మహమ్మద్ ప్రవక్త జన్మదిన వేడుకలు




నిర్మల్,ఆగస్టు 26(ప్రజా కలం జిల్లా ప్రతినిధి) :

గౌస్ ఏ ఆజాం మీలాద్ కమిటీ ఆధ్వర్యంలో నిర్మల్ పట్టణంలో బుధవారం మొహమ్మద్ ప్రవక్త జన్మదిన వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మహమ్మద్ ప్రవక్త చూపిన మార్గదర్శకాలు ప్రతి ఒక్కరికి ఆదర్శం అన్నారు. ఆయన బాటలో ప్రతి ఒక్కరు నడవాలన్నారు. సమాజ సేవలో కూడా యువకులు తమ పాత్ర పోషించాలని పేర్కొన్నారు. అనంతరం మహమ్మద్ ప్రవక్తను స్మరించుకుంటూ ఆయన నిజ జీవితంలో పాటించిన సూత్రాలు ఆచరణాలపై శ్లోకాలు, గీతాలు ఆలపిస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరము అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. మౌలాన అన్వర్ పాషా ఖాద్రి, కౌన్సిలర్ షేక్ ఫెరోజ్, మాజీ కౌన్సిలర్ అన్వర్ భాయ్, గౌస్ ఏ ఆజాం మీలాద్ కమిటీ అధ్యక్షులు సయ్యద్ అశ్రార్ ఖాద్రి, ఉపాధ్యక్షులు మొహమ్మద్ లతీఫ్, ప్రధాన కార్యదర్శి ఇసాక్ అలీ ఖాద్రి, సహాయ కార్యదర్శి షేక్ రహ్మత్, కోశాధికారి ఇర్ఫాన్ ఉద్దీన్, జావీద్, మిస్బ రజా, ఆజాం రజా, గౌస్, ముషర్రాఫ్, అవైస్, అయాన్, అక్బర్, సల్మాన్, మిన్హాజ్, సలీం, శారీక్, ఇంతియాజ్, ముజ్తబ, ముబాషీర్, అమిన్ బాబా, తదితరులు పాల్గొన్నారు.

## ఒక్కరి స్పందన... ఒక ప్రాణానికి అండగా నిలిచిన మానవత్వం

### సేవాస్ఫూర్తికి నిదర్శనం - రెడ్ క్రాస్ స్టేట్ మేనేజ్మెంట్ కమిటీ సభ్యుడు సి రమేష్ రెడ్డి అభినందనలు

నాగర్‌కర్నూల్ జిల్లా ఆగస్టు 26 (ప్రజా కలం ): అత్యవసర సమయంలో రక్తదానం చేసి ఓ చెంచు బాలుడి ప్రాణరక్షకు అండగా నిలిచిన రక్తదాతలు మానవత్వాన్ని చాటుకున్నారు. నాగర్ కర్నూల్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న 16 ఏళ్ల చెంచు బాలుడు గణేష్‌కు అత్యవసరంగా ప్లేట్‌లెట్స్ కావడం ఈ విషయం తెలుసుకున్న యూత్ రెడ్ క్రాస్ జిల్లా కన్వీనర్ దామగల్ల కుమార్ రాత్రి 11 గంటల సమయంలో రక్తదాతల కోసం అత్యవసరపిలుపునిచ్చారు.ఆయన పిలుపుకు వెంటనే స్పందించిన గట్టు నెల్లికుదురు డిప్యూటీ సర్పంచ్ బాలస్వామి అదేవిధంగా వైద్య ఆరోగ్య శాఖలో లెప్రసీ అధికారిగా పనిచేస్తున్న సుకుమార్ సైతం స్పందించి రక్తదానం చేశారు.అర్ధరాత్రి వేళలోనూ ఓ బాలుడి ప్రాణరక్షణ కోసం స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేసిన బాలస్వామి, సుకుమార్ సేవా స్ఫూర్తిని యూత్ రెడ్ క్రాస్ స్టేట్ మేనేజింగ్ కమిటీ సభ్యులు సి.రమేష్ రెడ్డి అభినందించారు. అత్యవసర సమయంలో స్పందించి మానవత్వాన్ని చాటిన రక్తదాతలకు యూత్ రెడ్ క్రాస్ సొసైటీ నాగర్‌కర్నూల్ తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు కూడా తెలియజేశారు రక్తదానం చేయడం ద్వారా ఆపదలో ఉన్న వారికి అండగా నిలవాలని, అత్యవసర పరిస్థితుల్లో రక్తదాతలు ముందుకు రావాలని యూత్ రెడ్ క్రాస్ ప్రతినిధులు కోరారు. ఒక్కరి స్పందన ఒక ప్రాణానికి అండగా నిలుస్తుందని ఈ ఘటన మరోసారి ఋజువైందన్నారు



## నిర్మల్ జిల్లాలో ప్రశాంతంగా ముగిసిన మిలాద్-ఉన్-నబీ వేడుకలు: ఎస్పీ డా. జి. జానకి షర్మిల



నిర్మల్, ఆగస్టు 26(ప్రజా కలం జిల్లా ప్రతినిధి): జిల్లావ్యాప్తంగా మిలాద్-ఉన్-నబీ వేడుకలు ప్రశాంత వాతావరణంలో, ఘనంగా ముగిశాయని జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల తెలిపారు భైంసా, నిర్మల్, ముధోల్, ఖానాపూర్, తానూర్ సహా జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు పేర్కొన్నారు, ప్రార్థనా మందిరాలు, ప్రధాన కూడళ్లు, సున్నితమైన ప్రాంతాలు మరియు ఊరేగింపు మార్గాల్లో నిరంతర పర్యవేక్షణ ముమ్మరం చేశారు, సీసీ కెమెరాలు, మొబైల్ పెట్రోలింగ్, రూట్ మొబైల్ బృందాల ద్వారా పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించారు, ప్రజలకు, వాహనదారులకు ఇబ్బంది కలగకుండా ప్రత్యేక ట్రాఫిక్ మళ్లింపులు, క్రమబద్ధీకరణ చర్యలు చేపట్టారు,వేడుకలను మత సామరస్యంతో, శాంతియుతంగా జరుపుకోవడానికి సహకరించిన మత పెద్దలు, ప్రజాప్రతినిధులు, యువజన సంఘాలు, ఉత్సవ నిర్వాహకులు మరియు ప్రజలకు ఈ సందర్భంగా ఎస్పీ కృతజ్ఞతలు తెలిపారు, భవిష్యత్తులోనూ అన్ని పండుగలను ఇదే సోదరభావంతో జరుపుకొని జిల్లా ప్రశాంతతకు సహకరించాలని కోరారు.




## పేద విద్యార్థినికి ఉన్నత విద్యాభ్యాసానికి సహాయం

### - బి.పీ.ఎడ్ మొదటి సంవత్సరం ఫీజు కోసం చెక్కు అందజేత
### - కోర్సు పూర్తయ్యే వరకు సహకరిస్తానని మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి హామీ

నాగర్‌కర్నూల్ ఆగస్టు 26 (ప్రజా కలం ): పేద విద్యార్థుల ఉన్నత విద్యకు ఆర్థిక సహాయం అందజేసిన మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి మరోసారి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. నాగర్‌కర్నూల్ మున్సిపాలిటీ పరిధిలోని ఎండబెట్ల గ్రామానికి చెందిన కొంగరి గౌరమ్మ, బాలస్వామి దంపతుల కుమార్తె రేవతి బి.పీ.ఎడ్ కోర్సులో సీటు సాధించి కుటుంబ ఆర్థిక పరిస్థితులు అనుకూలంగా లేక కళాశాల ఫీజు చెల్లించడం కష్టంగా మారిన విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి స్పందించారు. రేవతి బి.పీ.ఎడ్ మొదటి సంవత్సరం ఫీజు కోసం తన సొంత నిధుల నుంచి రూ.32,000 విలువైన చెక్కును అందజేశారు. అంతేకాకుండా రేవతి తన కోర్సును విజయవంతంగా పూర్తి చేసే వరకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తానని పూర్తి గా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మర్రి జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ పేదరికంలో ఉన్న ఏ విద్యార్థి కలలకు అడ్డంకిగా మారకూడదని అన్నారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఏ ఒక్కరి చదువు ఆగిపోకూడదన్నదే తన ఆకాంక్ష అని తెలిపారు.




చదువుకోవాలనే తపన ఉన్న ప్రతి పేద విద్యార్థికి తన వంతు సహాయం అందిస్తానని తెలిపారు రేవతి కోర్సును విజయవంతంగా పూర్తి చేసి మంచి భవిష్యత్తును నిర్మించుకునే వరకు అండగా ఉంటానని పేర్కొన్నారు. పేద విద్యార్థుల విద్యాభ్యాసానికి ఆర్థిక సహాయం అందించి భరోసాగా నిలిచిన మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డికి విద్యార్థిని రేవతి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

## రక్తదానం మహాదానం

### - ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి




మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి ఆగస్టు 26:

"రక్తదానం మహాదానం. రక్తానికి మతంతో సంబంధం లేదు.. ఆపదలో ఉన్న ప్రాణాలను కాపాడటం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత" అని ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే శ్రీ యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఈద్ మిలాద్–ఉన్–నబీ సందర్భంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో మహబూబ్‌నగర్ టీమ్ సోషల్ వర్కర్స్ & వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో అల్మాస్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రక్తదానం ద్వారా ఆపదలో ఉన్న ఎంతోమంది ప్రాణాలను కాపాడవచ్చని తెలిపారు. రక్తానికి మతం, కులం, ప్రాంతం వంటి భేదాలు ఉండవని, మానవత్వమే అందరికీ ప్రధానమని అన్నారు. ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

"ఐక్యత, మానవత్వం, సామాజిక సేవ" అనే స్ఫూర్తితో నిర్వహించిన ఈ రక్తదాన శిబిరం సమాజంలో మతసామరస్యం, ఐక్యతను చాటిచెప్పే కార్యక్రమం అని అన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. అలాగే రక్తదానం చేసిన దాతలను ఎమ్మెల్యే అభినందించి, ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ శ్రీమతి గుమ్మాల మమత శ్రీనివాస్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, యూత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అవేజ్, హాస్పిటల్ డెవలప్మెంట్ కమిటీ సభ్యులు సాదుల్లా, నాయకులు అజ్మత్ అలి, మైత్రి యాదయ్య, సల్మాన్, అబ్దుల్ హక్, ఖాజా పాషా, రియాజుద్దీన్, మహ్మద్ అలీ, ఇమ్రాన్, మహబూబ్‌నగర్ టీమ్ సోషల్ వర్కర్స్ & వెల్ఫేర్ సొసైటీ, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధులు లయన్ నటరాజ్, సభ్యులు, రక్తదాతలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంత వాతావరణంలో గణేష్ ఉత్సవాలను నిర్వహించాలి

### - జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్
### - గణేష్ నిమజ్జనం సందర్భంగా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలి
### - వినాయక విగ్రహాల తరలింపు సమయంలో విద్యుత్ ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలి
### - నిమజ్జనం పాయింట్ల వద్ద గజ ఈతగాళ్లు, ఎస్డీఆర్ఎఫ్ బృందాలను అందుబాటులో ఉంచాలి
### - కాల్వొడ్డు మున్నేరు, ప్రకాష్‌నగర్, తీర్థాల వద్ద గణేష్ నిమజ్జన ప్రాంతాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్





ఖమ్మం, ఆగస్టు 26( ప్రజా కలం న్యూస్)

ప్రశాంతమైన వాతావరణంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకునేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పటిష్టమైన ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్ అన్నారు. ప్రజలకు, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని సజావుగా నిర్వహించేందుకు ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలని సూచించారు. ఖమ్మం రూరల్ మండలం తీర్థాల వద్ద ఆకేరు నది పరిసరాల్లో వినాయక విగ్రహాల నిమజ్జనానికి అనువైన ప్రదేశం, నీటి మట్టం, రహదారి మార్గాలు, వాహనాల రాకపోకలకు సంబంధించిన ఏర్పాట్లను బుధవారం కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, పోలీసు అధికారులు, స్థానిక ఉత్సవ కమిటీ సభ్యులతో కలిసి ఖమ్మం నగరంలోని కాల్వొడ్డు మున్నేరు, ప్రకాష్‌నగర్ వద్ద నీటి మట్టాన్ని, గణేష్ నిమజ్జనానికి ఉన్న అవకాశాలను పరిశీలించారు. భక్తుల మనోభావాలకు అనుగుణంగా అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, నిమజ్జన ప్రదేశాలను సమగ్రంగా పర్యవేక్షించి ప్రజలకు అనువుగా తుది నిర్ణయాలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూ, వినాయక చవితి నుంచి నిమజ్జనం వరకు ఉత్సవాలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంతంగా జరిగేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. నిమజ్జనం పాయింట్ల వద్ద అన్ని సౌకర్యాలు కల్పించాలి గణేష్ నిమజ్జనం జరిగే ప్రాంతాల్లో పబ్లిక్ అడ్రస్ సిస్టమ్, తగినంత లైటింగ్, బ్యారికేడ్లు, తాగునీటి సరఫరా, మొబైల్ టాయిలెట్లు తదితర సౌకర్యాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. నిమజ్జనం సమయంలో ఎలాంటి ప్రమాదాలు చోటుచేసుకోకుండా అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలని అన్నారు.నిమజ్జనం పాయింట్ల వద్ద గజ ఈతగాళ్లను, ఎస్డీఆర్ఎఫ్ బృందాలను ముందుగానే అందుబాటులో ఉంచాలని, అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు అవసరమైన రక్షణ పరికరాలు, సిబ్బందిని సిద్ధంగా ఉంచాలని సూచించారు. నిమజ్జనం జరిగే ప్రాంతాల్లో నీటి లోతు, ప్రవాహ పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు.నిమజ్జనం సందర్భంగా ట్రాఫిక్ రద్దీ ఏర్పడకుండా వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించాలని, ప్రధాన మార్గాల్లో పోలీసు సిబ్బందిని అందుబాటులో ఉంచాలని అన్నారు. భక్తులు, ఉత్సవ కమిటీ సభ్యులు, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.ప్రజలు, ఉత్సవ కమిటీలు సహకరించి, ప్రశాంత వాతావరణంలో గణేష్ నిమజ్జనం నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ స్వీయ నియంత్రణ, సంయమనం పాటించాలని కలెక్టర్ కోరారు. ఉత్సవ కమిటీ సభ్యులు పోలీసు, రెవెన్యూ, మున్సిపల్, ఇరిగేషన్, విద్యుత్ తదితర శాఖల అధికారులతో పూర్తి స్థాయిలో సమన్వయంతో సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట అడిషనల్ ఎస్పీ అద్నాన్ రామాంజనేయులు, ఇరిగేషన్ ఎస్ఈ వసంతి, ఎస్ఈ ఎం. వెంకటేశ్వర్లు, ఏసిపి లు రమణమూర్తి, తిరుపతిరెడ్డి, ఏదులాపురం మున్సిపల్ కమిషనర్ ఏ. శ్రీనివాస రెడ్డి, ఖమ్మం అర్బన్ మండల తహసీల్దార్ జయచందర్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మిలాద్-ఉన్-నబీ సందర్భంగా రక్తదాన శిబిరం

### - మహబూబ్‌నగర్‌లో రక్తదాన శిబిరానికి హాజరైన స్థానిక సంస్థల అదనపు కలెక్టర్



మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి ఆగస్టు 26:మిలాద్–ఉన్–నబీ సందర్భంగా 'టీమ్ సోషల్ వర్కర్స్' , మహబూబ్ నగర్ ఆధ్వర్యంలో అల్మాస్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరానికి అదనపు కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, రక్తదాన శిబిరాన్ని నిర్వహించినందుకు , సమాజ సేవలో అంకితభావంతో కృషి చేస్తున్నందుకు 'టీమ్ సోషల్ వర్కర్స్' సభ్యులను, స్వచ్ఛంద కార్యకర్తలను అభినందించారు. స్వచ్ఛంద రక్తదానం యొక్క ప్రాముఖ్యతను వివరిస్తూ, రక్తదానం అనేది విలువైన ప్రాణాలను కాపాడగలిగే ఒక గొప్ప కార్యమని ఆయన పేర్కొన్నారు. రక్తదాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి క్రమం తప్పకుండా రక్తదాన కార్యక్రమాల్లో పాల్గొనాలని ఆయన ప్రోత్సహించారు. రక్తదాతల విలువైన సహకారాన్ని అభినందించడంతో పాటు, ప్రజలలో రక్తదానంపై అవగాహన కల్పిస్తున్న నిర్వాహకుల కృషిని కూడా ఆయన ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో 'టీమ్ సోషల్ వర్కర్స్' సభ్యులు, స్వచ్ఛంద కార్యకర్తలు, రక్తదాతలు మరియు ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

## జిల్లా స్థాయి యోగాలో తానూర్ విద్యార్థుల ప్రతిభ.. రాష్ట్రస్థాయికి ఎంపిక!



తానూర్, ఆగస్టు 26(ప్రజా కలం): భైంసాలో నిర్వహించిన జిల్లా స్థాయి ఒలింపియాడ్ యోగా పోటీల్లో తానూర్ మండల కేంద్రానికి చెందిన జెడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు, ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి పి. అమృత్, 8వ తరగతి విద్యార్థి ఎస్. గోవింద్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు, జిల్లా స్థాయిలో ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు తాలోడ్ సాయిబాబా, ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందించారు.

## విద్యుత్ షాక్‌తో 6వ తరగతి విద్యార్థిని మృతి



తానూర్, ఆగస్టు 26 (ప్రజా కలం): తానూర్ మండలంలోని కోలూర్ గ్రామానికి చెందిన 6వ తరగతి విద్యార్థిని స్నేహ రెడ్డి (13) విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందింది, బుధవారం ఉదయం ఇంట్లోని బోరు వద్ద నీరు పట్టుకున్న అనంతరం బోరు మోటార్‌ను ఆఫ్ చేసేందుకు ప్రయత్నిస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురైంది, స్టార్ట్ బాక్స్ వద్ద స్విచ్ ఆఫ్ చేస్తుండగా విద్యుత్ వైర్లు తగలడంతో స్నేహ రెడ్డి కేకలు వేసింది, వెంటనే కుటుంబ సభ్యులు, స్థానికులు ఆమెను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు,అయితే వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు, చిన్నారి మృతితో కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు,కోలూర్ గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి, స్నేహ రెడ్డి కోలూర్ ప్రభుత్వ పాఠశాలలో 6వ తరగతి చదువుతోంది,చదువులో ఎంతో ప్రతిభ కనబరుస్తు ఉపాధ్యాయుల ప్రశంసలు అందుకునేదని తెలిపారు, పాఠ్యాంశాలను చురుగ్గా నేర్చుకోవడంతో పాటు పాఠశాలలో నిర్వహించే వివిధ కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొనేదని ఉపాధ్యాయులు గుర్తుచేశారు,మంచి భవిష్యత్తు ఉన్న విద్యార్థినిగా గుర్తింపు పొందిన స్నేహ రెడ్డి అకాల మరణం ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులను తీవ్రంగా కలచివేసింది,మృతురాలి తండ్రి రమేష్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తానూర్ పోలీసులు తెలిపారు.

## ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులుగా గుండెపంగు మల్లేష్ ఎన్నిక

పాలేరు ఆగస్టు 26(ప్రజా కలం న్యూస్ )

ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఏఐటీయూసీ) జిల్లా ఉపాధ్యక్షులుగా కూసుమంచి మండల పరిధిలోని, గైగోళ్ళపల్లి గ్రామానికి చెందిన గుండెపంగు మల్లేష్ ఎన్నికయ్యారు. ఈనెల 23, 24వ తేదీలలో సత్తుపల్లి పట్టణంలోని లక్ష్మీప్రసన్న గార్డెన్స్ లో రెండు రోజులపాటు జరిగిన ఏఐటీయూసీ జిల్లా 17వ మహాసభలలో ఈ ఎన్నిక జరిగినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన మల్లేష్ మాట్లాడుతూ.. ఏఐటీయుసి ద్వారానే కార్మికులకు, కార్మికుల చట్టాలకు రక్షణ ఉంటుందని, భారతదేశానికి సంపూర్ణ స్వాతంత్రం కావాలని పోరాడింది ఏఐటీయూసీ మాత్రమే అని అన్నారు. రాబోయే రోజులలో కార్మికుల హక్కులు, వారి పరిరక్షణ కోసం ఐక్య ఉద్యమాలు చేపడతామని తెలిపారు. తనపై నమ్మకం ఉంచి ఎన్నుకున్నందుకు జిల్లాలో ఏఐటీయుసిని బలోపేతానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని అన్నారు. మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న కార్మికుల పొట్ట గొట్టే సెంట్రలైజ్ కిచెన్ విధానాన్ని రద్దు చేయాలని అన్నారు.




ఈ ఎన్నికకు సహకరించిన ఏఐటీయుసి రాష్ట్ర, జిల్లా నాయకత్వానికి, సీపీఐ జిల్లా నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కాగా సీపీఐ సీనియర్ నాయకులు అమరజీవి కామ్రేడ్ సంగబత్తుల వెంకటరెడ్డి స్ఫూర్తితో మల్లేష్ 2010లో ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘం ద్వారా ప్రస్థానం మొదలుపెట్టి సంఘంలో మండల, డివిజన్, జిల్లా బాధ్యతలు నిర్వర్తించి, అప్పటి సీపీఐ జిల్లా కార్యదర్శి భాగం హేమంతరావు సూచనల మేరకు పార్టీ సీపీఐ కూసుమంచి మండల కార్యదర్శిగా రెండు దఫాలుగా సేవలు అందించి, ప్రస్తుతం సీపీఐ జిల్లా సమితి సభ్యులుగా కొనసాగుతూ.. తెలంగాణ రాష్ట్ర మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) జిల్లా ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్నారు. ప్రత్యేక తెలంగాణ సాధనలో అనేక పోరాటాలు నిర్వహించారు. ఈ ఎన్నికతో మండలంలోని సీపీఐ, ప్రజా సంఘాల, కార్మిక సంఘాల నాయకులు మల్లేష్ కు శుభాకాంక్షలు తెలిపారు.

## తిరుమలలో వెంకటేశ్వర స్వామిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్న టీపీసీసీ రాష్ట్ర వైస్ చైర్మన్ నారపోగు వెంకటేశ్వర్లు..



తల్లాడ ఆగస్టు 26 (ప్రజా కలం న్యూస్ ): తిరుమల తిరుపతిలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన వెంకటేశ్వర స్వామిని బుధవారం టీపీసీసీ ఎస్సీ విభాగం రాష్ట్ర వైస్ చైర్మన్ నారపోగు వెంకటేశ్వర్లు దర్శించుకున్నారు. తన స్నేహితుడు ఐఆర్ ఎస్ జాయింట్ కమిషనర్ కే. నాగరాజుతో కలిసి ఆయన స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అక్కడ ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పదవి వచ్చిన సందర్భంగా స్వామివారిని దర్శించుకున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో ప్రజలందరూ పాడిపంటలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని మొక్కుకున్నట్లు వెంకటేశ్వర్లు తెలిపారు.

## ప్రజలు తాగునీటి అవస్థలు పడకుండా ముమ్మర పనులు..

**- తల్లాడ సర్పంచ్ పెరిక నాగేశ్వరరావు..**



తల్లాడ ఆగస్టు 26 ప్రజా కలం న్యూస్ తల్లాడ మేజర్ గ్రామపంచాయతీ ప్రజలు తాగునీటి కోసం అవస్థలు పడుతున్నారని, వాటిని దృష్టిలో ఉంచుకొని దగ్గరుండి ముమ్మరంగా పనులు చేస్తున్నట్లు తల్లాడ సర్పంచ్ పెరిక నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం స్థానిక రింగ్ రోడ్డు సెంటర్లో తాగునీటి పైప్ లైన్ లకు ఆయన దగ్గరుండి సిబ్బందితో మరమ్మతు పనులు చేయిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారని వాటిని గుర్తించి వేగంగా పనులు చేపడుతున్నట్లు తెలిపారు. పంచాయతీలో ఇప్పటికే పారిశుధ్య కార్యక్రమాలు మెరుగుపరుస్తున్నట్లు వివరించారు. బ్లీచింగ్ చల్లటంతో పాటు మురికి నీరు నిల్వ ఉండకుండా సౌకర్యాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తాననీ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో షేక్. చాంద్, కంతి వెంకటేశ్వర్లు, గుండ్ల రామకృష్ణ ఉన్నారు.

## కేఎల్ఐ కాలువలో గుర్తుతెలియని మృతదేహం

నాగర్‌కర్నూల్ ఆగస్టు 26 ప్రజా కలం (ప్రతినిధి ): బిజినపల్లి మండలం



మహాదేవునిపేట శివారులోని కేఎల్ఐ కాలువలో గుర్తుతెలియని మృతదేహం కొట్టుకొచ్చిన ఘటన బుధవారం వెలుగుచూసింది. కాలువలో మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని కాలువ నుంచి వెలికితీశారు. మృతదేహం శానాయపల్లికి చెందిన వ్యక్తిదిగా ప్రాథమికంగా గుర్తించినట్లు తెలుస్తోంది. అయితే మృతుడి పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. మృతికి గల కారణాలు కూడా స్పష్టంగా తెలియరాలేదు. పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి వివరాలు సేకరిస్తూ, ఘటనపై దర్యాప్తు కొనసాగిస్తున్నారు. పూర్తి వివరాలు విచారణ అనంతరం వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు

## బిజ్వారంలో జిన్ను కృష్ణారెడ్డి ఇంట్లో చోరీ

**కుటుంబం హైదరాబాద్‌కు వెళ్లిన సమయంలో ఘటన..**

**డాగ్ స్క్వాడ్‌తో పోలీసుల దర్యాప్తు**





గద్వాల ప్రతినిధి, ఆగస్టు 26, ప్రజా కలం: జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం బిజ్వారం గ్రామంలో మాజీ ఎంపీపీ వై. రాజారెడ్డి సోదరుడు జిన్ను కృష్ణారెడ్డి ఇంట్లో చోరీ జరిగింది. కుటుంబ సభ్యులు హైదరాబాద్‌కు వెళ్లిన సమయంలో ఈ ఘటన చోటుచేసుకున్నట్లు మాజీ ఎంపీపీ రాజారెడ్డి తెలిపారు.

బుధవారం ఉదయం 8 గంటల సమయంలో ఇంట్లో పనిచేసే మహిళ ఇంటి తాళం తెరిచి ఉండటాన్ని గమనించి వెంటనే మాజీ ఎంపీపీ రాజారెడ్డికి సమాచారం అందించారు. దీంతో ఆయన మల్దకల్ ఎస్సై కొండ శ్రీహరికి సమాచారం ఇచ్చారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని ఇంటిని పరిశీలించారు. అనంతరం గద్వాల సీఐ టంగుటూరి శ్రీను కూడా ఘటనాస్థలాన్ని పరిశీలించి వివరాలను సేకరించారు. పోలీసు సిబ్బంది డాగ్ స్క్వాడ్‌తో ఇంటి పరిసరాలను పరిశీలించి, చోరీకి సంబంధించిన ఆధారాలను సేకరించారు.

చోరీకి గురైన వస్తువులు, ఇతర వివరాలను పోలీసులు కుటుంబ సభ్యుల నుంచి సేకరిస్తున్నారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టి, చోరీకి పాల్పడిన వ్యక్తుల ఆచూకీ కోసం వివిధ కోణాల్లో విచారణ కొనసాగిస్తున్నారు.

# ఖమ్మం గడ్డపై ఎన్సీపీ పార్టీ జెండా ఎగరాల్సిందే

**స్థానిక పోరుకు ఎన్సీపీ పార్టీ సిద్ధం : మద్దిశెట్టి సామేలు**



ఉమ్మడి ఖమ్మం జిల్లా: ఆగస్టు 26: (ప్రజా కలం న్యూస్):

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ ఎన్సీపీ పార్టీ బూత్ స్థాయి నుంచి బలోపేతం చేసే దిశగా పార్టీ అధిష్టానం కసరత్తు ముమ్మరం చేసింది. ఎన్డీఏ మహాకూటమిలో భాగస్వామిగా ఉన్న ఎన్సీపీ పార్టీ జిల్లా కమిటీల పనితీరు,రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యులు, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్, ఒడిశా, తమిళనాడు రాష్ట్రాల ఇన్‌చార్జి మద్దిశెట్టి సామేలు ఖమ్మం జిల్లా నాయకత్వంతో విస్తృత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు.ఖమ్మం జిల్లా కేంద్రంలో జరిగిన ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు, అసెంబ్లీ నియోజకవర్గాల ఇంచార్జ్,మీడియా సెల్, యూత్ విభాగం,మండల స్థాయి అధ్యక్షులు పాల్గొన్నారు. సుమారు రెండు గంటల పాటు జరిగిన ఈ సమావేశంలో జిల్లాలో పార్టీ ప్రస్తుత పరిస్థితి, కార్యకర్తల నియామకం, ప్రజల్లోకి పార్టీ విధానాలను తీసుకెళ్లడంపై సుదీర్ఘంగా చర్చించారు.ఈ సందర్భంగా మద్దిశెట్టి సామేలు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోఎన్సీపీ పార్టీ ఎంతో కీలకం కానుంది.ఎన్డీఏ మహాకూటమి బలంగా ముందుకు వెళ్తున్న తరుణంలో, ఖమ్మం జిల్లాలో ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేయాలి. బూత్ స్థాయి నుంచి పార్టీ నిర్మాణం జరగాలి. యువతను, మహిళలను పెద్ద ఎత్తున పార్టీలోకి ఆహ్వానించాలి అని పిలుపునిచ్చారు.రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలే మన లక్ష్యం. ప్రతి మండలంలో, ప్రతి గ్రామంలో ఎన్సీపీ జెండా ఎగరాలి. కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను, ఎన్సీపీ పోరాటాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి. గెలుపే లక్ష్యంగా పనిచేయాలి దిశానిర్దేశం చేశారు.జిల్లాలో పార్టీ క్రియాశీలతను పెంచడం, నూతన సభ్యత్వ నమోదు, సోషల్ మీడియా ద్వారా పార్టీ కార్యక్రమాలను విస్తృతంగా ప్రచారం చేయడంపై నాయకులకు సూచనలు చేశారు.ఈ సమావేశంలో ఖమ్మం జిల్లా అధ్యక్షులు పుట్టపర్తి హరిబాబు, జిల్లా వర్కింగ్ కమిటీ అధ్యక్షులు ఈదుల రవి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పలగాని శ్రీనివాస్ గౌడ్, సీనియర్ నాయకులు గరిడేపల్లి రవి, వివిధ మండలాల అధ్యక్షులు, అసెంబ్లీ ఇన్‌చార్జిలు, యూత్ విభాగం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మతం మారిన కులం మారదు

**- న్యాయవాది పల్లా రాజశేఖర్**

**- తెలంగాణ క్రిస్టియన్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా పై సదస్సు - ముఖ్యఅతిథిగా ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ వి. నతానియల్**



ఖమ్మం ఆగస్టు 26 ( ప్రజా కలం న్యూస్)

ఖమ్మం నగరంలోనే బుధవారంతెలంగాణ క్రిస్టియన్ జాయింట్ యాక్షన్ కమిటీ, ఖమ్మం పట్టణ ప్రముఖ నాయకులు న్యాయవాది పల్లా రాజశేఖర్ ఆధ్వర్యంలో ఖమ్మం నగరంలో సీఎస్ఐ చర్చి కాంపౌండ్ కమ్యూనిటీ హాల్ లో ఏర్పాటు చేసిన దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదాపై సదస్సు ఏర్పాటు చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ వి. నతానియల్ పాల్గొని ప్రసంగిస్తూ దళితులు క్రైస్తవ మతం స్వీకరించిన కులం మారదు ఆ కులంలో భారత రాజ్యాంగంలోని ఆర్టికల్14 ప్రతి మనిషికి స్వేచ్ఛ సమానత్వం, ఆర్టికల్ 25 మత స్వాతంత్రపు హక్కు1950 ప్రెసిడెన్షియల్ ఆర్డర్ ప్రకారం ఈ రెండు చట్టాలు ప్రకారం కులమే ఆధారం కాబట్టి దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు రాబోయే రోజుల్లో తెలంగాణ క్రిస్టియన్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర మొత్తం ఒక జాయింట్ యాక్షన్ కమిటీగా ఏర్పడి రానున్న రోజుల్లో ప్రభుత్వానికి దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించే వరకు తెలంగాణ క్రిస్టియన్ జాయింట్ యాక్షన్ కమిటీ పని చేస్తుందని ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ వి. నతానియల్ సందేశం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా డాక్టర్ రాజేశ్వర్ సోలోమాన్, డాక్టర్ సోలోమోను సుందర్ రాజ్, హైకోర్టు న్యాయవాది పల్ళ రాజశేఖర్, డాక్టర్ డి. విజయ్ కుమార్, తెలంగాణ దళిత ఉద్యమ నాయకులు ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ విజిలెన్స్ కమిటీ మెంబర్ గుంతెటి వీరభద్రయ్య ముఖ్య అతిథులుగా పాల్గొని దళిత క్రైస్తవులు క్రైస్తవ మతం స్వీకరించిన కూడా కులం మారదు కాబట్టి దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని ఈ సభలో వక్తలు సందేశం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బిషప్ బాలస్వామి, పాస్టర్ ఇమ్మడి ధర్మరాజు, పాస్టర్ ప్రకాశం, వివిధ సంఘాల దళిత క్రైస్తవ సేవకులు, దళిత క్రైస్తవ విశ్వాసులు, సంఘ సభ్యులు, ఖమ్మం జిల్లా దళిత క్రైస్తవ నాయకులు పాగ యోనా తదితరులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## మానవత్వం చాటిన బిఆర్ఎస్ సర్పంచుల బృందం

**- మృతుడు సర్పంచ్ ఉప్పల సోమన్న కుటుంబానికి 51,000 ఆర్థిక సాయం**

మరిపెడ ప్రజా కలం న్యూస్ ఆగస్టు 26

మహబూబాద్ జిల్లా మరిపెడ మండలం,వెంకంపహాడ్ గ్రామ సర్పంచ్ ఉప్పల సోమన్న(32) ఇటీవల రోడ్ యాక్సిడెంట్లో మృతి చెందిన విషయం తెలిసింది అయితే దశదిన కర్మ రోజున ఆయన కుటుంబాన్ని మండల బీఆర్ఎస్ సర్పంచుల బృందం పరామర్శించి అండగా నిలిచింది. సోమన్న మృతి పట్ల సర్పంచులు తీవ్ర దిగ్భ్రాంతి, సంతాపం వ్యక్తం చేశారు.కుటుంబ సభ్యులను కలిసి వారి దుఃఖంలో పాలుపంచుకున్నారు. కుటుంబ పరిస్థితిని తెలుసుకుని, తమ వంతు బాధ్యతగా 51,000 రూపాయల ఆర్థిక సహాయాన్నిలి అందజేసి కుటుంబానికి అండగా నిలిచారు ఈ కార్యక్రమం లో మండల బీఆర్ఎస్ సర్పంచులు. బాల్య తండ సర్పంచ్ కాలు నాయక్ ఎల్లంపేట సర్పంచ్ గండి రాధమ్మ పరమేశ్వర్ గుండెపుడి సర్పంచ్ లకావత్ రవి కుమార్ బీచ్ రాజ్ పల్లి సర్పంచ్ జర్పుల పద్మ బద్రు నాయక్ బావోజి గూడెం సర్పంచ్ భుక్య శంకర్ గాలివారిగూడెం సర్పంచ్ నారెడ్డి కవిత సుదర్శన్ రెడ్డి స్టేజి తండ సర్పంచ్ బానోత్ అమ్మి భీమా నాయక్



తండా ధర్మారం సర్పంచ్ గుగులోత్ బాబు నాయక్ సోమ్ల తండ సర్పంచ్ భూక్య బూయి రాజేందర్ ఎల్లారిగూడెం సర్పంచ్ బానోత్ శాంతి మల్సూర్ నాయక్ కోట్య తండా సర్పంచ్ తేజావత్ బాలాజీ నాయక్ వీరారం సర్పంచ్ గుండె రాములు ఉల్లెపల్లి సర్పంచ్ నవిలె కళమ్మ వెంకన్న భూక్య తండా సర్పంచ్ బోడ మంగణి శంకర్ స్థానిక నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# రాఖీ బంధం.. జన్మజన్మల అనుబంధం!

**అన్నాచెల్లెళ్ల ప్రేమకు రాఖీనే ప్రతీక.. జీవితాంతం అండగా ఉంటాననే భరోసాకు పవిత్ర సంకేతం**

గద్వాల ప్రతినిధి, ఆగస్టు 26, ప్రజా కలం:అన్నాచెల్లెళ్ల అనుబంధం మాటలకు అందనిది.. చిన్ననాటి అల్లరి నుంచి జీవితంలోని ప్రతి అడుగులోనూ ఒకరికి ఒకరు తోడుగా నిలిచే బంధం. ఆ ప్రేమకు, ఆప్యాయతకు, ఆత్మీయతకు ప్రతీకగా నిలిచే పవిత్రమైన పండుగే రాఖీ పౌర్ణమి.రాఖీ పండుగ రోజున సోదరి తన అన్న చేతికి రాఖీ కట్టి "నా జీవితంలో ఎప్పటికీ నువ్వు నాకు



అండగా ఉండాలి" అనే ప్రేమను వ్యక్తం చేస్తుంది. అన్న కూడా తన చెల్లెలి సంతోషం, భద్రత, భవిష్యత్తు కోసం ఎల్లప్పుడూ తోడుగా ఉంటానని భరోసా ఇస్తాడు.చిన్ననాటి అల్లరి నుంచి జీవితాంతం అండగా..అన్నాచెల్లెళ్ల మధ్య అప్పుడప్పుడు చిన్న చిన్న గొడవలు వచ్చినా.. ఆ బంధంలో దాగి ఉన్న ప్రేమ మాత్రం ఎప్పటికీ తగ్గదు. చెల్లెలి కళ్లలో కన్నీరు వస్తే అన్న మనసు తల్లడిల్లుతుంది. అన్నకు కష్టం వస్తే చెల్లెలి హృదయం బాధపడుతుంది. అదే అన్నాచెల్లెళ్ల అనుబంధంలోని గొప్పతనం.కాలం మారినా.. దూరాలు పెరిగినా.. పెళ్లిళ్లు, ఉద్యోగాలు, బాధ్యతలతో వేర్వేరు ప్రాంతాల్లో ఉన్నా.. రాఖీ పండుగ వచ్చినప్పుడు చిన్ననాటి జ్ఞాపకాలు మళ్లీ కళ్లముందు కదలాడుతాయి. ఒక రాఖీ.. ఎన్నో జ్ఞాపకాలను, మరెన్నో అనుభూతులను ముడిపెడుతుంది.రాఖీ అంటే కేవలం చేతికి కట్టే దారం కాదు.. అది ప్రేమకు ముడి, నమ్మకానికి గుర్తు, అనుబంధానికి చిరునామా. అన్నాచెల్లెళ్ల మధ్య జీవితాంతం నిలిచే ఆత్మీయతకు ప్రతీక. అందుకే రాఖీ పండుగ ప్రతి ఇంటిలో ప్రేమను పంచుతూ.. అన్నాచెల్లెళ్ల బంధాన్ని మరింత బలపరుస్తూ.. కుటుంబాల్లో ఆనందాన్ని నింపే పవిత్ర పండుగగా నిలుస్తోంది.

## కులగణన చేపట్టకుంటే బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దింపుతాం

**- బీసీ పొలిటికల్ జేఏసీ జిల్లా అధ్యక్షులు దన్నోజ్ అరవింద్ చారి**



నాగర్‌కర్నూల్, ఆగస్టు 26 (ప్రజా కలం ) : బీసీ కులగణన చేపట్టకుండా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తే దేశవ్యాప్తంగా బీసీలను ఏకం చేసి బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దింపుతామని బీసీ పొలిటికల్ జేఏసీ నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు దన్నోజు అరవింద్ చారి హెచ్చరించారు. బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో బీసీ పొలిటికల్ జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టే జనగణనలో బీసీల కుల వివరాలను స్పష్టంగా నమోదు చేయాలని, ప్రతి కులానికి ప్రత్యేక కోడ్ ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మండల్ కమిషన్ సిఫార్సులను పూర్తిస్థాయిలో అమలు చేయాలని కోరారు. తెలంగాణ అసెంబ్లీ ఆమోదించిన 42 శాతం బీసీ రిజర్వేషన్ల బిల్లుకు పార్లమెంట్ ఆమోదం లభించేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని అన్నారు. బీసీల జనాభా లెక్కలు వెల్లడైతే రిజర్వేషన్లు పెంచాల్సి వస్తుందనే భయంతోనే కేంద్ర ప్రభుత్వం కులగణన విషయంలో వెనుకడుగు వేస్తోందని అరవింద్ చారి ఆరోపించారు. వెంటనే బీసీ కులగణన చేపట్టాలని, లేకపోతే దేశవ్యాప్తంగా బీసీల ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో బీసీ పొలిటికల్ జేఏసీ నాయకులు శివ, హనుమంతు, సత్య, నారాయణ, శేఖర్, రమేష్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

## చందుబట్ల గేట్ వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

నాగర్‌కర్నూలు ఆగస్టు 26( ప్రజా కలం ): నగర్ కర్నూల్ మండల పరిధిలోని చందుబట్ల గేట్ సమీపంలో బుధవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. తెల్లవారుజామున సుమారు 3 గంటల సమయంలో గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో ఎన్మనబెట్లకు చెందిన పుట్ట విష్ణు (32) తీవ్రంగా గాయపడి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.ప్రమాద ఘటనపై మృతుడి భార్య చంద్రకళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికి కారణమైన వాహనం, డ్రైవర్‌ను గుర్తించే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు. కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఎస్సై వెంకట్ రెడ్డి తెలిపారు.

## బిజ్వారంలో పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇంటి కానుక

**ముఖ్య అతిథిగా హాజరై నూతన గృహాన్ని ప్రారంభించిన సాయి సాకేత్ రెడ్డి**



గద్వాల ప్రతినిధి, ఆగస్టు 26, ప్రజా కలం: జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం బిజ్వారం గ్రామంలో ఉప్పర్ నరేష్‌కు మంజూరైన ఇందిరమ్మ ఇంటి నిర్మాణం పూర్తికావడంతో బుధవారం నూతన గృహ ప్రారంభోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి కుమారుడు సాయి సాకేత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై తన చేతుల మీదుగా నూతన గృహాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సాయి సాకేత్ రెడ్డి గృహ యజమాని ఉప్పర్ నరేష్ కుటుంబ సభ్యులను అభినందించి, నూతన ఇంటి నిర్మాణం పూర్తయిన సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. పేద, అర్హులైన కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను అందిస్తోందని నాయకులు పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి అందేలా కృషి చేస్తామని వారు తెలిపారు. ఇందిరమ్మ ఇల్లు మంజూరై నిర్మాణం పూర్తికావడంతో నరేష్ కుటుంబంలో ఆనందం నెలకొంది. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వై. రాజారెడ్డి, పెద్దపల్లి అజయ్, నరసింహారెడ్డి, మాజీ ఎంపీటీసీ ఎలుక వెంకటన్న, బ్రహ్మయ్య, ఆశన్న, చిన్నగోవిందు తదితరులు పాల్గొన్నారు.

## జవులా (బి)లో మత సామరస్యానికి ప్రతీకగా ఘనంగా ఈద్ మిలాదున్ నబీ జులూస్

తానూర్, ఆగస్టు 26(ప్రజా కలం):: తానూర్ మండలంలోని జవులా (బి) గ్రామంలో ఈద్ మిలాదున్ నబీ పర్వదినాన్ని పురస్కరించుకుని నిర్వహించిన 'జష్నే ఈద్ మిలాదున్ నబీ' జులూస్ అత్యంత వైభవంగా, ప్రశాంత వాతావరణంలో ముగిసింది, మత సామరస్యం, శాంతి, సోదరభావాలను చాటుతూ గ్రామ ముస్లిం సోదరులు, స్థానిక ప్రజలు భారీ సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు, స్థానిక మసీదు నుంచి ప్రారంభమైనఈ జులూస్ గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ఉత్సాహభరితంగా సాగింది,ఈ కార్యక్రమంలో సీఐ ప్రవీణ్ కుమార్, ఎస్ఐ షేక్ జుబేర్, మసీదు కమిటీ అధ్యక్షుడు షేక్ అన్వర్, ఉపాధ్యక్షుడు ఆరిఫ్, కోశాధికారి షేక్ ఖదీర్, మాజీ ఎంపీటీసీ లఖే నాగరావులతో పాటు ప్రజాప్రతినిధులు షేక్ సాజిద్, షేక్ శాదుల్, గ్రామ పంచాయతీ సభ్యులు లోకండే నాగరావు, షేక్ బషీర్, మన్నె సాబ్, షేక్ రఫీక్, అంబేద్కర్, విఠల్ లోకండే, మాధవరావు, షేక్ అమిర్ సాబ్, మౌలా మియా, షేక్ అన్వర్ కమల్ సాబ్, మాధవరావు పాటిల్, షేక్ యాకూబ్ తదితర నాయకులు, గ్రామస్తులు విశేషంగా పాల్గొన్నారు, ఐక్యతను చాటుతూ ఈ వేడుకను విజయవంతం చేసిన అందరికీ నిర్వాహకులు ధన్యవాదాలు తెలిపారు.



## తక్కశిలలో బీసన్నకు ఇందిరమ్మ ఇంటి వరం

### - ఎంపీ మల్లు రవి చేతుల మీదుగా నూతన గృహ ప్రారంభం

గద్వాల ప్రతినిధి, ఆగస్టు 26, ప్రజా కలం: జోగులాంబ గద్వాల జిల్లా ఉండవెల్లి మండలం తక్కశిల గ్రామంలో బీసన్నకు మంజూరైన ఇందిరమ్మ ఇంటి నిర్మాణం పూర్తికావడంతో బుధవారం నూతన గృహ ప్రారంభోత్సవం నిర్వహించారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు మల్లు రవి ముఖ్య అతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి నూతన గృహాన్ని ప్రారంభించారు.



ఈ సందర్భంగా ఎంపీ మల్లు రవి బీసన్న కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. పేద, అర్హులైన కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేయడమే ఇందిరమ్మ ఇళ్ల పథకం లక్ష్యమని నాయకులు పేర్కొన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో అలంపూర్ మాజీ ఎమ్మెల్యే, ఏఐసీసీ కార్యదర్శి డాక్టర్ ఎస్.ఏ. సంపత్ కుమార్, తెలంగాణ రాష్ట్ర గొర్రెలు మరియు మేకల అభివృద్ధి శాఖ కార్పొరేషన్ చైర్మన్ సరిత తిరుపతయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ దొడ్డప్ప, వైస్ చైర్మన్ కుమార్, కిసాన్ సెల్ నాయకుడు నాగరాజు, ఉండవెల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకటేష్, మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### సురవరం వర్ధంతి వేళ కంచుపాడుకు

## రూ.4.15 కోట్ల వరాలు

### అభివృద్ధి పనులకు శ్రీకారం.. బీటీ రోడ్డు, పాఠశాల భవనానికి శంకుస్థాపన



గద్వాల ప్రతినిధి, ఆగస్టు 26, ప్రజా కలం:

జోగులాంబ గద్వాల జిల్లా ఉండవెల్లి మండలం కంచుపాడు గ్రామంలో సీపీఐ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీ కీర్తిశేషులు సురవరం సుధాకర్ రెడ్డి వర్ధంతి కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో రూ.4.15 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. కంచుపాడు నుంచి 44వ జాతీయ రహదారి వరకు రూ.3.15 కోట్లతో నిర్మించనున్న బీటీ రోడ్డుకు, రూ.1 కోటి వ్యయంతో చేపట్టనున్న నూతన పాఠశాల భవనానికి శంకుస్థాపన చేశారు. 'సురవరం సుధాకర్ రెడ్డి గ్రంథాలయం', క్రీడా ప్రాంగణాన్ని ప్రారంభించారు. ఐదు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ పాలమూరు ప్రాంత అభివృద్ధి, కరువు, నిరుద్యోగం, వలసల నివారణ కోసం సురవరం సుధాకర్ రెడ్డి చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. కార్యక్రమంలో నాగర్‌కర్నూల్‌ఎంపీ మల్లు రవి, అలంపూర్ మాజీ ఎమ్మెల్యే, ఏఐసీసీ కార్యదర్శి డాక్టర్ ఎస్.ఏ. సంపత్ కుమార్, సరిత తిరుపతయ్య, సీపీఐ నాయకులు, ప్రజాప్రతినిధులు, సురవరం కుటుంబ సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## వాస్సర్ ల్యాబ్స్ బృందం ద్వారా పంటల పరిశీలన

రుద్రవరం : రుద్రవరం మండలం లోని ఎర్రగుడిదిన్నె, చిలకలూరు, పేరూరు గ్రామాల మధ్య లో విజయవాడ కు చెందిన వాస్సర్ ల్యాబ్స్ సాంకేతిక నిపుణుల బృందం మండల వ్యవసాయాధికారి జి.సుమతి ఆధ్వర్యంలో క్షేత్ర స్థాయి పంటలు పరిశీలించారు . ఏపీ ఏఐ ఎంఎస్ యాప్ ద్వారా రైతులకు అందిస్తున్న వాతావరణ సూచనలు తుఫాను మరియు కరువు హెచ్చరికలు యాప్ పనితీరును సాంకేతిక సిబ్బంది సాయిచరణ్, తిరుపతి సమన్ బృందం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పంట సాగు విస్తీర్ణం పంట ఆరోగ్య పరిస్థితి మరియు యాజమాన్య పద్ధతులపై సమాచారము రైతులకు యాప్ ద్వారా పొందవచ్చని వారు తెలిపారు. ఈ ఖరీఫ్ సీజన్లో రైతులు సాగు చేసిన పంట పొలాల యొక్క ఆరోగ్య స్థితిని యాప్ లో అప్రమత్తంగా వచ్చిన పొలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు .వ్యవసాయ శాఖ ద్వారా వస్తున్న వాతావరణ సందేశాలు పంట స్థితిగతులు రైతులకు అవగాహన కల్పించి వెంటనే చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులను పంపుతున్నామని వారు తెలిపారు .యాప్ ద్వారా క్షేత్రస్థాయిలో తీసుకున్న వాస్తవాలను అభిప్రాయాలను ప్రభుత్వానికి చేరవేస్తామని వారు తెలిపారు.

## ఆపద మిత్ర నోడల్ అధికారిగా మురళీ నాయక్

రాయచోటి : అన్నమయ్య జిల్లాలో యువ ఆపద మిత్ర -స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా స్థాయి నోడల్ అధికారిగా అడ్వాన్స్‌డ్ స్కౌట్ మాస్టర్ మూడే మురళీ నాయక్ నియమితులయ్యారు. మురళీ నాయక్‌ను జిల్లా స్థాయి నోడల్ అధికారిగా నియమిస్తూ స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా చీఫ్ కమిషనర్ డాక్టర్ కే. సుబ్రహ్మణ్యం జారీ చేసిన నియామక పత్రాన్ని మంగళవారం మధ్యాహ్నం రాయచోటిలోని స్కౌట్ కార్యాలయంలో జిల్లా సెక్రటరీ మడితాటి నరసింహారెడ్డి ఆయనకు అందజేశారు. జిల్లాలో విపత్తుల సమయంలో సేవలందించేందుకు 18 సంవత్సరాలు నిండిన స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులకు విపత్తు నిర్వహణ, అత్యవసర సహాయక చర్యలు, ప్రథమ చికిత్స, రక్షణ చర్యలపై త్వరలో నిర్వహించనున్న శిక్షణ కార్యక్రమాలను సమన్వయం చేసేందుకు మురళీ నాయక్‌ను నోడల్ అధికారిగా నియమించినట్లు జిల్లా సెక్రటరీ మడితాటి నరసింహారెడ్డి తెలిపారు. యువతలో విపత్తులపై అవగాహన పెంపొందించడంతో పాటు, అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు తక్షణ సహాయం అందించేలా యువ ఆపద మిత్ర కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేస్తామని మురళీ నాయక్ తెలిపారు. యువ ఆపద మిత్ర కార్యక్రమం ద్వారా శిక్షణ పొందిన స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులను విపత్తు నిర్వహణలో సమర్థవంతమైన వాలంటీర్లుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం ఆయన ఏపీ మోడల్ స్కూల్, సంబేపల్లిలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా ట్రెజరర్ మార్ల ఓబుల్ రెడ్డి, రేంజర్ లీడర్ నిర్మల తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

కమాన్ పూర్ : ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని పేరా పల్లి సర్పంచ్ బొంగొని సదయ్య గౌడ్ అన్నారు. పేరా పల్లి పాఠశాలలోని విద్యార్థులకు ప్రభుత్వపరంగా వచ్చిన యూనిఫామ్ లను గ్రామ సర్పంచ్ బొంగోనిసదయ్య చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తో పాటు ఉప సర్పంచ్ ఎరుకలపల్లవి, ఉపాధ్యాయురాలు స్వరూప రాణి, వార్డు సభ్యులు భోగె,రవితేజ, పొల్దాసరి రజిత, గుర్రాల కృష్ణస్వామి, సిసి మల్లేశం, సీఏ శివలీల, వాలుక.రమణ తదితరులు పాల్గొన్నారు..

# ఆరోగ్యకరమైన పోటీతోనే వృద్ధి

బెంగళూరు : చంద్రబాబు నాయుడును అరెస్ట్ చేసిన సమయంలో బళ్ళారి తెలుగు ప్రజలు ప్రదర్శించిన ధైర్యసాహసాలను జీవితాంతం గుర్తుంచుకుంటానని ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. క్లిష్ట పరిస్థితుల్లో తమ కుటుంబానికి వెన్నుదన్నుగా నిలిచిన బళ్ళారి తెలుగు వారి రుణం తీర్చుకుంటానని ఆయన ఉద్ఘాటించారు. బళ్ళారి జిల్లా కుడితినిలో పర్యటించిన లోకేశ్ కు స్థానిక తెలుగు ప్రజలు, యువత, టీడీపీ శ్రేణులు బ్రహ్మరథం పట్టారు. భారీ గజమాలతో ఆయనను సత్కరించి, బాణసంచా కాలుస్తూ తమ అభిమానాన్ని చాటుకున్నారు. బళ్లారిలో తెలుగు ప్రజలనుద్దేశించి ఆయన ప్రసంగిస్తూ, 2023 సెప్టెంబర్‌లో చంద్రబాబును అన్యాయంగా అరెస్ట్ చేసిన సమయంలో తమ కుటుంబం తీవ్ర ఆవేదనకు గురైందని లోకేశ్ గుర్తుచేసుకున్నారు. "ఆ క్లిష్ట పరిస్థితుల్లో బళ్ళారి గడ్డపై మీరు చేపట్టిన నిరసన కార్యక్రమాలు మాకు కొండంత ధైర్యాన్ని ఇచ్చాయి. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు వారిలో నూతనోత్తేజాన్ని నింపాయి. ఆ పోరాట స్ఫూర్తిని ఎప్పటికీ మరువలేను, జీవితాంతం మీకు అండగా నిలుస్తాను" అని ఆయన భావోద్వేగంగా పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు వారి సంక్షేమమే ధ్యేయంగా స్వర్గీయ నందమూరి తారకరామారావు తెలుగుదేశం పార్టీని స్థాపించారని, గతంలో ఉత్తరాఖండ్ విపత్తులో చిక్కుకున్న వారిని చంద్రబాబు స్వయంగా చొరవ తీసుకుని కాపాడిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలు అన్నదమ్ముల్లా కలిసి మెలిసి ఉంటూ దక్షిణ భారతదేశ అభివృద్ధికి కృషి చేయాలని లోకేశ్ పిలుపునిచ్చారు. గతంలో చంద్రబాబు, ఎస్.ఎం. కృష్ణల మధ్య ఉన్న ఆరోగ్యకరమైన పోటీతత్వమే హైదరాబాద్, బెంగళూరు నగరాల శరవేగ అభివృద్ధికి మూలకారణమైందని ఆయన అన్నారు. ఇటీవలి ముఖ్యమంత్రుల సమావేశంలో కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్, ఏపీ సీఎం చంద్రబాబు ఇరు రాష్ట్రాల మధ్య సహకారం, నదుల అనుసంధానం ఆవశ్యకతపై చర్చించారని తెలిపారు. దీనికి కేంద్ర హోంమంత్రి అమిత్ షా కూడా సానుకూలంగా స్పందించారని వివరించారు. బళ్ళారిలో తెలుగు ప్రజలు తమ సొంత నిధులతో 'అన్న క్యాంటీన్' నిర్వహించడం, ఎన్టీఆర్ సర్కిల్ కోసం జీవో సాధించడం పట్ల లోకేశ్ ప్రత్యేక అభినందనలు తెలిపారు. త్వరలోనే ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటుకు పూర్తి సహకారం అందిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఏపీ ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ బళ్ళారి తెలుగు ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటారని, వారంతా ఆంధ్రప్రదేశ్ పునర్నిర్మాణంలో భాగస్వాములు కావాలని ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటప్రసాద్, స్థానిక టీడీపీ నాయకులు రాము, అనూప్ కుమార్, పార్టీ కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఎస్ఎల్‌బీసీ పనుల్లో కదలిక

కర్నూలు : శ్రీశైలం ఎడమ గట్టు కాలువ (ఎస్ఎల్‌బీసీ) సొరంగం ప్రాజెక్టు నిర్మాణంలో కీలక ముందడుగు పడింది. గతేడాది ఎనిమిది మంది కార్మికుల మృతికి కారణమైన అత్యంత ప్రమాదకరమైన షీర్ జోన్‌ను ఇంజినీర్లు విజయవంతంగా అధిగమించారు. దీంతో ఏడాదికి పైగా నిలిచిపోయిన పనులు ఇకపై వేగంగా ముందుకు సాగుతాయని అధికారులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. నల్లమల కొండల్లోని బలహీనమైన రాతి పొరలతో కూడిన ఈ షీర్ జోన్‌లోనే 2025 ఫిబ్రవరిలో సొరంగం కూలి టన్నెల్ బోరింగ్ మెషీన్ (టీబీఎం) కూడా శిథిలాల కింద చిక్కుకుపోయింది. అప్పటి నుంచి పనులు నిలిచిపోయాయి. ఈ సవాలును అధిగమించేందుకు నిపుణులు అసలు మార్గాన్ని పక్కనపెట్టి, దానికి ఎడమవైపుగా కొత్త అలైన్‌మెంట్‌లో పనులు ప్రారంభించారు. టీబీఎంకు బదులుగా సురక్షితమైన డ్రిల్ అండ్ బ్లాస్ట్ పద్ధతిని ఎంచుకున్నారు. దీంతో ప్రమాదకర షీర్ జోన్ వెడల్పు 50 మీటర్ల నుంచి 10-14 మీటర్లకు తగ్గింది. ఈ చిన్న భాగాన్ని దాటేందుకు సుమారు నెల రోజుల పాటు నిపుణులు అత్యంత జాగ్రత్తలు తీసుకున్నారు. షీర్ జోన్‌లోకి ప్రవేశించే ముందు రాతి పొరల్లోకి స్టీల్ పైపులు పంపి గ్రౌటింగ్ చేసి పైకప్పు, గోడలను బలోపేతం చేశారు. చిన్న చిన్న భాగాలుగా పేలుళ్లు జరుపుతూ, వెంటనే రాక్ బోల్టులు, స్టీల్ గిర్డర్లతో పటిష్ఠం చేస్తూ ముందుకు సాగారు. కొత్త మార్గంలో ఇప్పటివరకు దాదాపు 150 మీటర్ల తవ్వకం పూర్తయింది. ప్రమాదకరమైన షీర్ జోన్‌ను దాటిన తర్వాత మాలో నమ్మకం పెరిగింది. ఇక నుంచి పనులు వేగంగా సాగుతాయి" అని బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ నుంచి డిప్యుటేషన్‌పై వచ్చిన టన్నెలింగ్ నిపుణుడు కల్నల్ పరీక్షిత్ మెహ్రా తెలిపారు. జైప్రకాష్ అసోసియేట్స్ వైస్ ప్రెసిడెంట్ కృష్ణకుమార్ సతి మాట్లాడుతూ, "గతంలో భయం, ఆందోళన ఉండేవి. ఇప్పుడు ఆ భయం తొలగిపోయి పూర్తి నమ్మకం వచ్చింది" అన్నారు. ఈ కీలక అడ్డంకిని దాటడంతో, దక్షిణ తెలంగాణలోని కరవు, ఫ్లోరైడ్ పీడిత ప్రాంతాలకు సాగు, తాగునీరు అందించే ఈ ప్రాజెక్టు పనులు ఇక వేగవంతం అవుతాయని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. త్వరలోనే ఈ కొత్త మార్గాన్ని పాత అలైన్‌మెంట్‌కు అనుసంధానించి పనులు కొనసాగిస్తారు.

# రామ్ మాధవ్ రీ ఎంట్రీ



హైదరాబాద్ : దేశంలో రాజకీయ పరిణామాల నేపథ్యంలో బీజేపీలోకి ఆర్ఎస్ఎస్ నేపథ్యం ఉన్న రామ్ మాధవ్ ఎంట్రీ ఇచ్చారు. పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా ఆయన స్కెచ్ వేసేందుకే కొత్త బాధ్యతలను రామ్ మాధవ్ కు అప్పగించినట్లు అర్థమవుతోంది. బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ ఆధ్వర్యంలో పార్టీ కొత్త జాతీయ జట్టులో రామ్ మాధవ్ ను జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా నియమించారు. దాదాపు ఆరేళ్ల తర్వాత పార్టీ ప్రధాన జట్టులోకి ఎంట్రీ ఇవ్వడం ప్రాధాన్యత సంతరించుకుంది. రామ్ మాధవ్ ఆర్ఎస్ఎఎస్ నేపథ్యం ఉన్న వ్యక్తి కావడం, ఇటీవల జెన్ జీ ఆందోళనలు, బీహార్ ఉప ఎన్నికల్లో ఓటమి తర్వాత ఆయన పార్టీలో ప్రవేశం కూడా రాజకీయంగా చర్చనీయాంశమైంది. జాతీయ రామ్‌మాధవ్‌కు మళ్లీ కీలక స్థానం దక్కడం, ఆర్ఎస్ఎస్ నేపథ్యం ఉన్న పలువురు నేతలు తమ పదవుల్లో కొనసాగడం ఈ జట్టు ప్రత్యేకత అని మరొకటిగా చెప్పుకోవాలి. రామ్‌మాధవ్ కు దేశంలోని అన్ని ప్రాంతాలపై లోతైన అవగాహన ఉంది. ప్రస్తుత దేశ రాజకీయ పరిస్థితుల్లో రామ్ మాధవ్ ను బీజేపీలోకి తీసుకోవడం ఆ పార్టీని బలోపేతం చేయడమే కాకుండా ఒకరకంగా రానున్న ఐదు రాష్ట్రాల ఎన్నికలలో విజయం సాధించడంతో పాటు వచ్చే లోక్ సభ ఎన్నికలకు పార్టీని సమాయత్తం చేయడం కూడా రామ్‌మాధవ్ పై బాధ్యతను పెట్టినట్లు సమాచారం. ఆర్ఎస్ఎస్ ప్రచారక్‌గా ప్రారంభించిన రామ్‌మాధవ్ ఆర్ఎస్ఎస్ జాతీయ అధికార ప్రతినిధిగా, అఖిల భారత సహ ప్రచార ప్రముఖ్‌గా పనిచేశారు. 2014 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ గెలిచిన తర్వాత పార్టీ సంస్థాగత వ్యవహారాల కోసం ఆర్ఎస్ఎస్ ఆయనను బీజేపీకి పంపింది. ఆ సమయంలో ఆయనను జాతీయ ప్రధాన కార్యదర్శిగా నియమించారు. ఆ ఎన్నికల్లో బీజేపీని దేశంలో అధికారంలోకి తేవడంలో రామ్‌మాధవ్ కీలక భూమిక పోషించారు విషయ పరిజ్ఞానం... రామ్ మాధవ్ తూర్పుగోదావరి జిల్లా లో జన్మించారు. కాకినాడలో చదివారు. అమలాపురంలో ప్రాథమిక విద్యను మొత్తం పూర్తి చేశారు. తర్వాత కాకినాడలో పాలిటెక్నిక్ పూర్తి చేశారు. అనంతరం ఇంజినీరింగ్ ను కూడా పూర్తి చేశారు. అంతేకాదు పొలిటికల్ సైన్స్ లోనూ పట్టాను పొందారు. సమగ్రమైన అవగాహన ప్రతి అంశంపై ఉంది. జాతీయ, అంతర్జాతీయ విషయాలు, పరిణామాలపై అవగాహన ఎప్పటికప్పుడు ఏర్పరచుకుంటూ మంచి పట్టు సాధించారన్న పేరుంది. విషయ పరిజ్ఞానంతో పాటు ఆత్మవిశ్వాసంతో ఆయన ఏ విషయంపైనా మాట్లాడతారు. గతంలో ఈశాన్య రాష్ట్రాలు, జమ్మూకశ్మీర్‌లో బీజేపీ విస్తరణలో రామ్‌మాధవ్ కీలక పాత్ర పోషించారు. అసోం, త్రిపుర, నాగాలాండ్‌లో బీజేపీ ప్రభుత్వాల ఏర్పాటు, పార్టీ బలోపేతంలో రామ్ మాధవ్ భాగస్వామ్యమయ్యారు. గత లోక్ సభ ఎన్నికల్లోనే బీజేపీకి సొంతంగా సీట్లు తగ్గాయి.

## బీసీలకు జనాభా ప్రాతిపదికన వాటా కల్పించాలి

### విద్య, ఉద్యోగాల్లో 27% రిజర్వేషన్లు అమలు చేయాలి

### పాలిటెక్నిక్ విద్యను నిర్వీర్యం చేసే జీవో 97ను వెంటనే రద్దు చేయాలి

### బీసీ సమాజ్ రాష్ట్ర కార్యదర్శి నరెడ్ల శ్రీనివాస్

మంచిర్యాల: బీసీ సమాజ్ ఆధ్వర్యంలో మంచిర్యాల పట్టణంలోని ఐబీ చౌరస్తాలో బీపీ మండల్ 108వ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీపీ మండల్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో బీసీ సమాజ్ రాష్ట్ర కార్యదర్శి నరెడ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ బీపీ మండల్ బీసీల సామాజిక, విద్యా, ఆర్థిక అభివృద్ధి కోసం చేసిన సిఫారసులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమర్థవంతంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీపీ మండల్ కమిషన్ సిఫారసుల మేరకు విద్య, ఉద్యోగాల్లో బీసీలకు 27 శాతం రిజర్వేషన్లు కల్పించాల్సి ఉన్నప్పటికీ, వాటిని పూర్తి స్థాయిలో అమలు చేయకుండా బీసీ విద్యార్థులు, యువత, నిరుద్యోగులు, ఉద్యోగులకు అన్యాయం జరుగుతోందని నరెడ్ల శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. "మా జనాభా ఎంత ఉంటే మా వాటా అంత ఇవ్వాలి" అనే సూత్రం ఆధారంగా విద్య, ఉద్యోగాలు, రాజకీయాలు, ఆర్థిక రంగాల్లో బీసీలకు సముచిత ప్రాతినిధ్యం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. బీసీలకు న్యాయమైన వాటా కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తే బీసీ సమాజ్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా బీసీ ప్రజా చైతన్య ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ప్రభుత్వాలను హెచ్చరించారు. జీవో 97ను వెంటనే రద్దు చేయాలిఇటీవల రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నంబర్ 97ను వెంటనే రద్దు చేయాలని నరెడ్ల శ్రీనివాస్ డిమాండ్ చేశారు.

ఈ జీవో పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని ఆయన అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పాలిటెక్నిక్ విద్యను నిర్వీర్యం చేసే విధంగా వ్యవహరి స్తోందని ఆయన ఆరోపించారు. స్కిల్ ఇండియా, ప్రైవేట్ యూనివర్సిటీలతో అనుసంధానం చేసే "శక్తి" పాలసీలో పాలిటెక్నిక్ విద్యను విలీనం చేసే ప్రయత్నాలు విద్యార్థుల భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మారుస్తాయని పేర్కొన్నారు.

## జిల్లెడ గ్రామపంచాయతీలో త్రాగునీటి బోర్ పంపు పనులను ప్రారంభించిన సర్పంచ్ అయిలా శ్రీనివాస్

బెల్లంపల్లి: బెల్లంపల్లినియోజకవర్గం వేమనపల్లి మండలంలోని జిల్లెడ బీసీ కాలనిలో త్రాగు నీటి బోర్ పంపు పనులను సర్పంచ్ అయిలా శ్రీనివాస్ కొబ్బరి కాయకొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా అయిన మాట్లాడుతూ బెల్లంపల్లి ఎమ్మెల్యేగా గడ్డం వినోద్ వెంకటస్వామి గెలిచిన 33 నెలల్లో మాజీ జడ్పిటిసి సభ్యులు ఆర్.సంతోష్ కుమార్ సహకారంతో జిల్లెడ గ్రామపంచాయితికి 15లక్షల రూపాయలు నిధులతో 6 త్రాగు నీటి బోర్ పంపు మోటర్లు మంజూరు అయ్యాయన్నారు. జిల్లెడ గ్రామపంచాయతీ ప్రజలకు నీటి సౌకర్యం కల్పించేందుకు సహకరించిన మాజీ జడ్పీటీసీ రుద్రభట్ల సంతోష్ కుమార్ కు గ్రామ ప్రజలు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వేమనపల్లి మండల యూత్ అధ్యక్షుడు ముల్కల సత్యనారాయణ, మాజీ వైస్ ఎంపీపీ ఆత్రం గణపతి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు అన్నారపు శంకర్, మస్కు చంద్రశేఖర్, మస్కు రాజన్న, పోలంపల్లి సత్తయ్య,చల్ల రాజిరెడ్డి, ఆయిళ్ల రాజిరెడ్డి , 4వవార్డ్ మెంబర్ పందిళ్ళ సునీత, మస్కు లావణ్య, పోలంపల్లి శ్యామల తదితరులు పాల్గొన్నారు.

## మహిళల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

### - మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

వెల్గటూర్ : మహిళల అభివృద్ధికి ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తుందని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. జగిత్యాల జిల్లా, ధర్మపురి మండలంలోని, నాగారం గ్రామంలో రూ.10 లక్షల నిధులతో నిర్మించతలపెట్టిన మహిళా సంఘ భవన నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో గల మహిళా సంఘాలకు ప్రత్యేక నిధులను కేటా యిస్తూ, వాటి బలోపేతానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలల్లో గల మహిళలకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించడం ద్వారా వారి సామాజిక, ఆర్థిక అభివృద్ధికి తోడ్పాటు లభించనుందని పేర్కొన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించిందని గుర్తు చేశారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసే విధంగా ప్రభుత్వం ముందుకు వెళ్తుందని తెలిపారు. మహిళా సంఘ భవన నిర్మాణం పూర్తయిన తర్వాత ఇక్కడ స్థానిక మహిళా సంఘాల కార్యకలాపాలకు ఇది ఎంతగానో ఉపయోగప డుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజాప్రతినిధులు, జిల్లా, మండల అధికారులు, మహిళా సంఘాల నాయకులు,సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## తిమ్మాపూర్ వృద్ధురాలి మృతి కేసును ఛేదించిన పోలీసులు

### - ప్రమాద మరణంగా తేలిన అనుమానాస్పద మృతి..

### - మద్యం మత్తులో బైక్‌తో ఢీకొట్టిన నిందితుడు

### - 24 గంటల్లోనే నిందితుడి గుర్తింపు.. పల్సర్ బైక్ స్వాధీనం

జగిత్యాల :తిమ్మాపూర్ గ్రామంలో వృద్ధురాలి అనుమానాస్పద మృతి కేసును జగిత్యాల రూరల్ పోలీసులు ఛేదించారు. దర్యాప్తులో ఆమె ప్రమాదవశాత్తు మృతి చెందినట్లు పోలీసులు నిర్ధారించారు. మద్యం మత్తులో బైక్ నడుపుతూ వృద్ధురాలిని ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు కేవలం 24 గంటల్లోనే నిందితుడిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. ఇస్లాంపూర్‌కు చెందిన మొహమ్మద్ సమీ ఉద్దీన్‌ను అరెస్ట్ చేసినట్లు పోలీసులు వెల్లడించారు. ప్రమాదానికి ఉపయోగించిన పల్సర్‌బైక్‌ను పోలీసులుస్వాధీనం చేసుకున్నారు. కేసుకు సంబంధించిన పూర్తి వివరాలపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు స్టీల్ ప్లేట్లు బహుకరణ

### -విద్యార్థులకు 170 స్టీల్ ప్లేట్లను అందజేసిన జైన రాజమౌళి-అరుణ దంపతులు

ధర్మారం: మండల కేంద్రం లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు స్టీల్ పెట్లు బహుకరణ ధర్మారం వాస్తవ్యులు జైన రాజమౌళి -అరుణ దంపతులు ఆధ్వర్యం లో ధర్మారం ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న 170 మంది విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం చేయడానికి అవసరమైన స్టీల్ ప్లేట్లు అందజేయడం జరిగింది. ఇలానే వారు ఇంతకు ముందు స్కూల్ డే కు కూడా ఆర్థిక సహాయం చేయడం జరిగింది. రాజమౌళి దంపతులకు పాఠశాల తరపున ప్రత్యేక ధన్యవాదములు తెలియ జేయడమైనది. అదే విదంగా ఇంకా ఇలాంటి సంఘాసేవ సహాయ కార్యక్రమాలు చేయాలనీ కోరనైనది. ముఖ్య అతిథిగా ధర్మారం మండల విద్యాధికారి పోతు ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ కార్య క్రమం లో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్ మల్లారెడ్డి, అరుణ, ఏ జ్యోతి, జి క్రిష్ణ జలీనా, ఈ శ్రీనివాస్, డి రమ్య, బి శైలజ, ఎస్ స్వప్న, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్ మల్లారెడ్డి తెలిపారు.

## పేదల సొంతింటి కల నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యం

వెల్గటూర్ : తెలంగాణలో గల పేదవారి సొంతింటి కల నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. జగిత్యాల జిల్లా, ధర్మపురి మండలం లోని కమలాపూర్ గ్రామం లో ప్రభుత్వం ద్వారా మంజూరై, నిర్మాణం పూర్తి అయిన ఇందిరమ్మ ఇంటి గృహ ప్రవేశ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించేలా బాధ్యత తీసుకుంటానని అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని లబ్ది పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్మికులకు రెయిన్ కోట్లు పంపిణీ

మెట్‌పల్లి : వర్షాకాల సీజన్‌ను దృష్టిలో ఉంచుకొని విధి నిర్వహణలో శానిటేషన్ సిబ్బందికి ఇబ్బందులు కలగకుండా మెట్‌పల్లి పురపాలక సంఘం ఆధ్వర్యంలో రెయిన్ కోట్లను పంపిణీ చేశారు. మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి ముఖ్య అతిథిగా హాజరై కార్మికులకు స్వయంగా రెయిన్ కోట్లను అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ లింబాద్రి మాట్లాడుతూ.. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు శానిటేషన్ సిబ్బంది అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. కార్మికుల ఆరోగ్యం, భద్రతకు మున్సిపాలిటీ ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఓంకార్ నవీన్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ గౌడ్, గౌరవ కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, కార్యాలయ సిబ్బంది, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## మెట్‌పల్లి లో వన మహోత్సవం..

మెట్‌పల్లి : పర్యావరణ పరిరక్షణతో పాటు పట్టణాన్ని హరితమయంగా తీర్చిదిద్దే లక్ష్యంతో వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మెట్‌పల్లి మున్సిపల్ కార్యాలయంలో ఇంటింటికీ మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మైలారపు లింబాద్రి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. పచ్చదనం పెంపొందించడం ద్వారా స్వచ్ఛమైన గాలి,ఆరోగ్యకరమైన వాతావరణం అందుతుందని తెలిపారు. ప్రజల భాగస్వామ్యంతోనే హరిత మెట్‌పల్లి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఓంకార్ నవీన్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ కౌన్సిలర్లు, అధికారులు, సిబ్బంది, మహిళా సంఘాల ప్రతినిధులు, పట్టణ ప్రముఖులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు. ప్రజాప్రతినిధులు, మున్సిపల్ సిబ్బందితో పాటు మహిళలు, పట్టణ పౌరులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కలను స్వీకరించారు.

# నందిగామలో ఆటోను ఢీకొన్న బైక్

## ఇద్దరు ఉపాధ్యాయులకు గాయాలు

ఎన్టీఆర్ జిల్లా, నందిగామ: నందిగామ పట్టణంలోని చందర్లపాడు రోడ్డులో రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఆటోను బైక్ ఢీకొనడంతో ఆటోలో ప్రయాణిస్తున్న ఇద్దరు ప్రభుత్వ ఉపాధ్యాయులకు గాయాలయ్యాయి. నందిగామ నుంచి చందర్లపాడు వైపు ఉపాధ్యాయులు ఆటోలో వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు సమాచారం. ప్రమాదంలో గాయపడిన ఉపాధ్యాయులను పోలీసులు ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు.

# భారీ అయుధాలు స్వాధీనం

రాయ్ పూర్ : ఛత్తీస్గఢ్లో భద్రతా బలగాలు సోమవారం రాత్రి భారీగా నక్సల్స్ ఆయుధాలు, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నాయి. భేజీ పోలీస్ స్టేషన్ పరిధిలోని భండార్పదర్, మునుర్గొండ అటవీ ప్రాంతాల్లో చేపట్టిన తనిఖీల్లో ఎస్ఎల్ఆర్ రైఫిల్, 315 బోర్ తుపాకీ, మస్కెట్ రైఫిల్, బీజీఎల్ లాంచర్, గ్రెనేడ్లు, ఇతర సామగ్రిని గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు భద్రతా బలగాలు వెల్లడించాయి. ఆయుధాల స్వాధీనం నేపథ్యంలో అటవీ ప్రాంతంలో భద్రతా బలగాలు మరింత విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టాయి.

## వంశధార కాల్వలో కారు బోల్తా.. ఇద్దరు మృతి

శ్రీకాకుళం : శ్రీకాకుళం జిల్లా సారవకోట మండలం కిన్నెరవాడ సమీపంలో విషాదం జరిగింది. వంశధార ఏడో కాల్వలో కారు అదుపుతప్పి బోల్తాపడింది. కారు కాల్వలో పూర్తిగా మునిగిపోయింది. కారులో ఉన్న ఇద్దరు మృతి చెందారు. మృతులు సీపాన రాము (50), మెండ విశాల్ కుమార్ (26). వివాహ వేడుకకు హాజరై తిరిగి వెళ్తుండగా ప్రమాదం జరిగింది. కారు డ్రైవర్ గొటివాడ నాగరాజు సురక్షితంగా బయటపడ్డాడు. స్థానికులు డ్రైవర్ను సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు.

### వరుసకు కొడుకు అయిన యువకుడితో

# వివాహేతర సంబంధం..

### - భర్తను హతమార్చిన భార్య

యాదాద్రి భువనగిరి : చౌటుప్పల్ మండలం అంకిరెడ్డిగూడెం గ్రామంలో రాపోలు దానయ్య (36), శారద అనే దంపతులు 15 ఏళ్ల క్రితం పెళ్లి చేసుకుని, ముగ్గురు పిల్లలతో కలిసి నివసిస్తున్నారు. భార్య శారద తన సోదరుడి కొడుకు శివ(19)తో శారద వివాహేతర సంబంధం పెట్టుకుందని తెలిసి దానయ్య వారిని మందలించాడు. ఈ నెల 23వ తేదీన భర్తతో పొలానికి వెళ్లి, మలవిసర్జనకు వెళ్తానని చెప్పి, అప్పటికే అక్కడ పొదల్లో ఉన్న శివ వద్దకు శారద వెళ్లింది. శారద ఎంతకూ తిరిగి రాకపోవడంతో చెట్ల పొదల్లో వెతకగా.. శివ, శారద సన్నిహితంగా ఉండడం చూసి కోపంతో పక్కనే ఉన్న కర్రతో వాళ్లను కొట్టేందుకు దానయ్య ప్రయత్నించాడు. దీంతో ఆ కర్రను శివ లాక్కుని దానయ్య తలపై బలంగా కొట్టాడు. పారిపోతున్న దానయ్యను శివ రాయితో కొట్టడంతో అతను కిందపడిపోగా, శారద అతని కాళ్లను గట్టిగా పట్టుకుంది. వెంటనే పెద్ద బండరాయితో తలపై శివ గట్టిగా కొట్టడంతో దానయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. తరువాత మీ అన్న కనిపించడం లేదని దానయ్య తమ్ముడు శ్రీనుకు శారద ఫోన్ చేసి చెప్పింది. అక్కడికి వచ్చిన శ్రీను విగతజీవిగా ఉన్న దానయ్యను చూసి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. అనుమానంతో శారదను అదుపులోకి తీసుకుని విచారించగా, శివతో కలిసి తానే హత్య చేసినట్లు నిందితురాలు అంగీకరించింది. పోలీసులు కేసు నమోదు చేసి ఇద్దరిని అరెస్టు చేసారు.

# కొండాకు రేవంత్ షాక్



వరంగల్ : మంత్రి కొండా సురేఖకు సంబంధించిన రాష్ట్రంలో పరిణామాలు తీవ్ర ఆసక్తిని రేపుతున్నాయి. కొండా సురేఖకు చెందిన పర్యావరణ, అటవీ శాఖలో డిప్యూటేషన్పై పనిచేస్తున్న అధికారుల డిప్యూటేషన్లను ప్రభుత్వం రద్దు చేసినట్లు తెలుస్తోంది. వారు పీసీసీఎఫ్ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. ఈ నిర్ణయం మంత్రి కొండా సురేఖకు ముందస్తు సమాచారం లేకుండానే జరిగిందన్న ప్రచారం ఇప్పుడు సచివాలయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. దీనిపై అధికారిక ప్రకటన ఇంకా వెలువడలేదు.తెలంగాణ రాజకీయాల్లో మరో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. ఇప్పటికే మంత్రి కొండా సురేఖ వివాదం.. అటు ప్రభుత్వం, కాంగ్రెస్ పార్టీలో తీవ్ర దుమారం రేపుతున్నవేళ.. మరో ఘటన జరిగింది. రాష్ట్ర పర్యావరణ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖకు సంబంధించిన శాఖలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. అటవీ శాఖలో డిప్యూటేషన్పై పనిచేస్తున్న పలువురు అధికారులు, ఉన్నతాధికారుల డిప్యూటేషన్లను రద్దు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలుస్తోంది. అయితే మంత్రి కొండా సురేఖకు ముందస్తు సమాచారం ఇవ్వకుండానే ఈ నిర్ణయం జరిగిందన్న ప్రచారం ఇప్పుడు ప్రభుత్వ వర్గాల్లో చర్చకు దారితీసింది.డిప్యూటేషన్పై పనిచేస్తున్న అధికారులు వెంటనే పీసీసీఎఫ్ (ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్) కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఆ ఉత్తర్వుల్లో ఆదేశించినట్లు సమాచారం. అయితే ఈ నిర్ణయం వెనుక పరిపాలనా కారణాలే ఉన్నాయా లేక ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చోటుచేసుకున్న పరిణామాలతో దీనికి ఏమైనా సంబంధం ఉందా అనే చర్చ ఇప్పుడు రాజకీయ వర్గాల్లో మొదలైంది.అటవీ శాఖలో వివిధ బాధ్యతల్లో డిప్యూటేషన్పై కొనసాగుతున్న పలువురు ఐఎఫ్ఎస్ అధికారులు, ఇతర ఉన్నతాధికారుల డిప్యూటేషన్లను రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసినట్లు తెలుస్తోంది. సాధారణంగా ఆయా శాఖకు సంబంధించిన కీలక పరిపాలనా నిర్ణయాలు సంబంధిత మంత్రి దృష్టికి తీసుకెళ్లడం ఆనవాయితీగా ఉంటుంది. అయితే.. తాజాగా అధికారుల డిప్యూటేషన్ రద్దు వ్యవహారంలో మంత్రి కొండా సురేఖకు ముందుగా సమాచారం ఇవ్వలేదన్న ప్రచారం ఇప్పుడు హాట్టాపిక్గా మారింది. అయితే అటవీ శాఖలో అధికారుల డిప్యూటేషన్లను ఎందుకు రద్దు చేశారు.. ఏయే అధికారులను వెనక్కి పంపిస్తున్నారు.. అటవీ శాఖలో తదుపరి ఎలాంటి మార్పులు ఉండబోతున్నాయి అనే అంశాలపై అధికార వర్గాల్లో ముమ్మరంగా చర్చ జరుగుతోంది. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ఈ నిర్ణయాన్ని పరి పాలనా చర్యల్లో భాగంగానే తీసుకున్నదా అన్నది స్పష్టత రావాల్సి ఉంది. మరో వైపు.. తన విదేశీ పర్యటన తర్వాత తాజాగా మీడియా సమావేశం నిర్వహించిన సీఎం రేవంత్ రెడ్డి.. మంత్రి కొండా సురేఖ, ఆమె కుమార్తె కొండా సుస్మితకు సంబంధించిన వివాదంపై స్పందించారు. ఈ వ్యవహారం కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణ కమిటీ పరిధిలో ఉందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. పార్టీ అంతర్గత అంశాలపై తాను బహిరంగంగా మాట్లాడబోనని పేర్కొన్నారు. అధిష్ఠానం లేదా క్రమశిక్షణ కమిటీ తీసుకునే నిర్ణయాలకు పార్టీ నాయకులు, కార్యకర్తలు అందరూ కట్టుబడి ఉండాల్సిందేనని రేవంత్రెడ్డి స్పష్టం చేశారు.ఒకవైపు కొండా సురేఖ వ్యవహారంపై పార్టీ క్రమశిక్షణ కమిటీ పరిశీలన కొనసాగుతుండగా..మరోవైపు ఆమె నిర్వహిస్తున్న అటవీ శాఖలో డిప్యూటేషన్లు రద్దు కావడం రాజకీయంగా తీవ్ర ఆసక్తిని పెంచింది. ఈ రెండు పరిణామాలు ఒకే సమయంలో చోటు చేసుకోవడంతో తెలంగాణ కాంగ్రెస్లో దీనిపై విస్తృత చర్చ జరుగుతోంది. అయితే డిప్యూటేషన్ల రద్దు నిర్ణయాన్ని కొండా సురేఖ వ్యవహారంతో ముడిపెట్టడానికి అధికారికంగా ఎలాంటి ఆధారాలు కనిపించడం లేదు. పరిపాలనా అవసరాల నేపథ్యంలోనే రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుని ఉండొచ్చన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

## నాలుగు దేశాల జీడీపీ కంటే ఇండియన్ బిజినెస్ మ్యాన్ ఆదాయమే ఎక్కువ

ముంబై : భారత్లోని అత్యంత ధనిక కుటుంబాల జాబితా వెలువడింది. 2026 బార్క్లేస్ ప్రైవేట్ క్లయింట్స్ హురున్ ఇండియా మోస్ట్ వాల్యూయబుల్ ఫ్యామిలీ బిజినెస్లో భారత కుబేరుల జాబితా విడుదలైంది. ఈ లిస్టులో మొదటి స్థానంలో అంబానీ కుటుంబం, రెండో స్థానంలో అదానీ కుటుంబం ఉన్నాయి.ఈ జాబితా ప్రకారం, భారత్2లోని టాప్ 10 ధనిక వ్యాపార కుటుంబాల మొత్తం సంపదను కలిపితే 70.5 లక్షల కోట్లు అవుతుంది. లిస్టులోని టాప్ 300 కుటుంబాల మొత్తం సంపద విలువ 138 లక్షల కోట్ల రూపాయలు. ఇందులో ఒక్క అంబానీ కుటుంబం వద్దే 25.8 లక్షల కోట్ల రూపాయల ఆస్తి ఉంది. రెండో స్థానంలో గౌతమ్ అదానీ ఉన్నారు. వారి సంపద విలువ 19.6 లక్షల కోట్ల రూపాయలు. 138 లక్షల కోట్ల మొత్తాన్ని ఒక దేశ జీడీపీగా పరిగణిస్తే, అది ప్రపంచంలో 18వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ అవుతుంది. ఈ సంపద సౌదీ అరేబియా, స్విట్జర్లాండ్, పోలాండ్, నెదర్లాండ్స్ వంటి అభివృద్ధి చెందిన దేశాల మొత్తం జీడీపీ కంటే ఎక్కువ. 2025-26 ఆర్థిక సంవత్సరానికి భారతదేశ నామమాత్ర జీడీపీ 3.92 ట్రిలియన్ అమెరికన్ డాలర్లు (సుమారు 328 లక్షల కోట్లు)గా ఉంది. అంతర్జాతీయ ద్రవ్య నిధి ఏప్రిల్ 2026 'వరల్డ్ ఎకనామిక్ అవుట్లుక్' నివేదిక ఆధారంగా ప్రభుత్వం 2026 ఆగస్టులో ఈ సమాచారం ఇచ్చింది. ఈ విలువతో భారత్ ప్రస్తుతం ప్రపంచంలో ఆరో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉంది. 138 లక్షల కోట్ల రూపాయల మొత్తం ద్వారా అనేక పెద్ద మైలురాళ్లను సాధించవచ్చు. ఈ భారీ మొత్తంతో ఒక్కో నగరానికి 30 వేల కోట్ల రూపాయల చొప్పున 100 కొత్త స్మార్ట్ సిటీస్ నిర్మించవచ్చు. వీటిలో 100 శాతం అండర్గ్రౌండ్ విద్యుత్- వాటర్ పైప్ లైన్లు, ఎఐ పవర్డ్ ట్రాఫిక్ కంట్రోల్, మోడ్రన్ డ్రైనేజ్ సిస్టమ్ ఉంటాయి. ఒక్కో ఆసుపత్రికి రూ. 500 కోట్ల ఖర్చుతో ఢిల్లీ ఎయిమ్స్ తరహాలో అత్యాధునిక సౌకర్యాలతో 5000 భారీ ప్రభుత్వ ఆసుపత్రులను నిర్మించవచ్చు. ఒక్కో స్కూలుకు 20 కోట్ల రూపాయల ఖర్చుతో 50000 హైటెక్ పాఠశాలలు నిర్మించవచ్చు.

అందులో అత్యుత్తమ అంతర్జాతీయ స్థాయి సైన్స్, రోబోటిక్స్ ల్యాబ్స్, డిజిటల్ స్మార్ట్ క్లాస్రూమ్స్, పెద్ద ప్లేగ్రౌండ్లు వంటి అనేక సౌకర్యాలు కల్పించవచ్చు. 38 లక్షల కోట్ల రూపాయలతో ఢిల్లీ-ముంబై ఎక్స్ప్రెస్వే తరహాలో 25000 కిలోమీటర్ల ఎక్స్ప్రెస్వేలు వేయవచ్చు. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు, గుజరాత్ నుంచి అరుణాచల్ ప్రదేశ్ వరకు దేశంలోని ప్రతి ప్రధాన ఆర్థిక కేంద్రాన్ని కలుపుతుంది. దీని వల్ల లాజిస్టిక్స్ రెండింతల వేగంతో జరుగుతుంది. ఈ మొత్తాన్ని భారత మొత్తం జనాభాలో (సుమారు 140 కోట్ల మంది) సమానంగా పంచితే, దేశంలో ప్రతి వ్యక్తి బ్యాంక్ ఖాతాలో 1 లక్ష రూపాయలు ఉంటాయి. ముకేష్ అంబానీ ఇల్లు యాంటిలియా ప్రపంచంలో అత్యంత ఖరీదైన ఇళ్లలో ఒకటి. ఈ డబ్బుతో యాంటిలియా వంటి 10000 లగ్జరీ ఇళ్లు నిర్మించవచ్చు. ఈ భారీ మొత్తంతో 7000 రఫేల్ జెట్లు కొనుగోలు చేయవచ్చు.

# మాయ ప్రేమ గుణపాఠం

మెదక్ : వయసు వేడిలో చాలామంది యువత తప్పుదారులు పడుతున్నారు. దారుణమైన నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఘోరమైన పనులకు పాల్పడుతున్నారు. చివరికి వారిలో పశ్చాత్తాపం కలిగినప్పటికీ అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోతుంది. ఈమె జీవితం కూడా అలాంటిదే. చేసిన తప్పు మామూలుది కాదు. సభ్య సమాజం ఈమె చేసిన దారుణాన్ని చూసి తలదించుకుంది. చివరికి ఏమైందో తెలియదు.. ఆమెలో ఎటువంటి బాధ ఆవహించిందో అర్థం కాలేదు. కానీ కఠినమైన నిర్ణయం తీసుకుంది.సంగారెడ్డిలో నర్సిగా పనిచేస్తూ ఉండేది సురేఖ అనే యువతి. ఈమెకు 25 సంవత్సరాలు. కుటుంబం పరంగా ఆర్థిక సమస్యలు లేవు. ఈమెకు ఒక సోదరుడు ఉన్నారు. ఈ క్రమంలో సురేఖ ఓ యువకుడితో ప్రేమ వ్యవహారం కొనసాగించడం మొదలుపెట్టింది. అతడితోనే వివాహం జరిపించాలని కోరింది. దానికి ఆమె తల్లిదండ్రులు ఒప్పుకోలేదు. కొద్దిరోజులు వారితో సురేఖ మాట్లాడలేదు. ఆ తర్వాత తన ప్రియుడి గురించి వారితో చర్చించడం మొదలుపెట్టింది. అయినప్పటికీ అతడితో పెళ్లికి వారు ఒప్పుకోలేదు. దీంతో సురేఖ వారి మీద ఆగ్రహం పెంచుకుంది. ప్రతిసారి తనను ఇబ్బంది పెడుతున్న నేపథ్యంలో వారిని అంతం చేయాలని భావించింది.సరిగా ఏడు నెలల క్రితం ఇంటికి వెళ్లిన సురేఖ.. తల్లిదండ్రులకు మత్తుమందు ఇచ్చింది. ఆ మత్తులోనే వారిద్దరు చనిపోయారు. ఆ తర్వాత వారిద్దరికీ గుండెపోటు వచ్చిందని కుటుంబ సభ్యులను నమ్మించే ప్రయత్నం చేసింది. మహానటి లెవెల్లో ఫెర్ఫార్మెన్స్ ఇచ్చింది. కానీ.. ఆమె మాట్లాడిన మాటలకు.. చెప్పిన వివరాలకు పొంతన లేకపోవడంతో పోలీసులు లోతుగా దర్యాప్తు చేశారు. ప్రేమికుడితో పెళ్లి జరిపించలేదని ఆగ్రహంతోనే ఆమె ఈ దారుణానికి పాల్పడినట్టు పోలీసులు గుర్తించారు. ఆ తర్వాత ఆమెను అరెస్ట్ చేశారు. గడిచిన ఏడు నెలలుగా ఆమె జైలు శిక్ష అనుభవించింది. ఇటీవల జైలు నుంచి బయటకు వచ్చింది. ఈ నేపథ్యంలో సంగారెడ్డిలో ఆమె ఒక హాస్టల్లో ఉంటోంది.

# దేశవ్యతిరేక శక్తులతో మీకేం పని

హైదరాబాద్ : అమెరికా పర్యటనకు కేంద్ర ప్రభుత్వం అనుమతి నిరాకరించడంపై తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ తీవ్రంగా తప్పుబట్టారు. రేవంత్ రెడ్డి వ్యవహారశైలి రాష్ట్ర శాంతిభద్రతలకే కాకుండా దేశ భద్రతకు కూడా ముప్పుగా మారుతోందని ఆరోపించారు.విదేశీ పర్యటనల్లో రేవంత్ రెడ్డి దేశ వ్యతిరేక శక్తులతో చేతులు కలుపుతున్నారని అర్వింద్ విమర్శించారు. విదేశాల్లో దేశంపై విషం చిమ్మే వారితో మాట్లాడటం ద్వారా రాజకీయ లబ్ధి పొందేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. కేసీఆర్ కంటే రేవంత్ రెడ్డి ప్రమాదకరమైన వ్యక్తి అని తాను గతంలోనే చెప్పానని, ఇకపై ఆయన ప్రతి కదలిక జాతీయ భద్రతా సంస్థల పరిశీలనలో ఉంటుందని వ్యాఖ్యానించారు.మరోవైపు రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలపై కూడా అర్వింద్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. బకాయిలు చెల్లించకపోవడంతో విద్యాసంస్థలు మూతపడే పరిస్థితి ఏర్పడిందని ఆరోపించారు. బకాయిలను క్లియర్ చేస్తామని రాహుల్ గాంధీతో హామీ ఇప్పించినా ఆ హామీ అమలు కాలేదని విమర్శించారు.రాష్ట్రంలోని విద్యాసంస్థలను పట్టించుకోకుండా విదేశాల నుంచి కొత్త విద్యాసంస్థలను తీసుకొస్తామని చెప్పడం ఏంటని అర్వింద్ ప్రశ్నించారు. రేవంత్ రెడ్డికి పరిపాలన చేతకాదని తెలంగాణ ప్రజలు ఇప్పటికే ఒక నిర్ణయానికి వచ్చారని అన్నారు.

# కాంట్రాక్టర్‌గా కాదు..కూలోడిగా పనిచేసింది రైతుల కోసమే...



వనపర్తి : గత ప్రభుత్వ హయాంలో కాంగ్రెస్ పార్టీ నిర్మించిన ప్రధాన కాలువలకు బొక్కలు పెట్టి కేవలం ప్రాజెక్టుల పేరున జీవోలు మంజూరు చేయించి కమిషన్లు దండుకు తిన్నారే తప్ప ఏ ప్రాజెక్టు నువ్వు పూర్తిస్థాయిలో నిర్మించలేదని నేడు కాంగ్రెస్ ప్రభుత్వంలో నిలిచిపోయిన పనులను పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించే స్థాయికి ప్రాజెక్టును తీసుకువచ్చామని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి. తెలిపారు. రాష్ట్ర మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి జూపల్లి కృష్ణారావు, ఎంపీ మల్లు రవి, నాగర్ కర్నూల్ శాసనసభ్యులు రాజేశ్వర్ రెడ్డిలతో కలిసి వనపర్తి శాసనసభ్యులు మేఘారెడ్డి కర్నేతండా లిఫ్ట్ ఇరిగేషన్ పంపులను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుత.రూ.87.53 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన కర్నె తండా లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ ద్వారా వనపర్తి, నాగర్కర్నూల్ జిల్లాల్లోని 18 తండాల పరిధిలో మొత్తం 4,235 ఎకరాలకు సాగు నీరు అందనుందని తెలిపారు. ఇందులో వనపర్తి జిల్లాలో 3,384 ఎకరాలు, నాగర్కర్నూల్ జిల్లాలో 851 ఎకరాల ఆయకట్టు ఉందన్నారు.గత ప్రభుత్వ హయాంలో రూ.87 కోట్లతో జీవో తీసుకువచ్చినా, సుమారు రూ.47 కోట్లు ఖర్చు చేసి పనులను మధ్యలోనే నిలిపివేశారని ఎమ్మెల్యే తెలిపారు.మిగిలిన పనులను ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దశలవారీగా పూర్తి చేస్తూ ఇప్పటివరకు సుమారు రూ.29 కోట్లు ఖర్చు చేసిందన్నారు. మిగిలిన పనులు, భూసేకరణ తదితర అంశాలకు అవసరమైన నిధులు సమకూర్చి ప్రాజెక్టును పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకువచ్చామని వివరించారు."తవ్విన కాలువలకు బొక్కలు పెట్టిన పందికొక్కులు మీరు"కర్నె తండా లిఫ్ట్ ప్రాజెక్టుపై రాజకీయ విమర్శలు చేస్తున్న వారిపై ఘాటుగా స్పందించారు. ప్రధాన కాలువలను నిర్మించింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, కేవలం కాలువలకు బొక్కలు కొట్టి, కమిషన్ల కోసం జీవోలు తీసుకువచ్చినంత మాత్రాన దానిని అభివృద్ధిగా చెప్పుకోలేరని విమర్శించారు. ప్రజల కోసం, రైతుల కోసం కాంట్రాక్టర్గా కాదు.. అవసరమైతే కూలోడిగా కూడా పనిచేశాను. నా నియోజకవర్గ ప్రజలకు నీళ్లు అందించాలన్న లక్ష్యంతో పగలు రాత్రి కష్టపడి కాలువలు తవ్వాం. కానీ మా బిల్లులను దొబ్బుకు తిన్నది మీరు" అంటూ తీవ్రస్థాయిలో విమర్శించారు. రైతులకు నీళ్లు అందుతున్నాయన్న విషయం ప్రజలకు స్పష్టంగా తెలిసిన తర్వాత కూడా, ముందుగానే ప్రెస్మీట్లు పెట్టి "మేం చెబితేనే నీళ్లు వస్తున్నాయి" అన్న భావనను ప్రజల్లో కల్పించేందుకు చేస్తున్న పనికిమాలిన వ్యవహారాలు, ప్రయత్నాలు అందరికీ అర్థమవుతున్నాయని అన్నారు.ప్రాజెక్టు ప్రారంభంతో కర్నె తండా పరిధిలోని రైతుల సాగుభూములకు నీరు అందే పరిస్థితి ఏర్పడిందని ఎమ్మెల్యే మేఘారెడ్డి అన్నారు.వనపర్తి జిల్లాలో అభివృద్ధి పనులకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, జిల్లాలో ఇప్పటివరకు సుమారు రూ.2,100 కోట్ల విలువైన అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు.కర్నె తండా ప్రాజెక్టుతో 4,235 ఎకరాలకు సాగునీరు మంత్రి కోమటిరెడ్డి. కర్నె తండా లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ను ప్రారంభించిన రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్రెడ్డి, ప్రజా ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంతో పాటు అదనంగా అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతోందని తెలిపారు.అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్న మంత్రి, కర్నె తండా లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ ప్రారంభంతో ఈ ప్రాంత రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని అన్నారు.గిరిజనుల ఆకాంక్ష మేరకు ప్రాజెక్టుకు శ్రీ శ్రీ శ్రీ సంత్ సేవాలాల్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పేరు మార్చేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.పేదల కోసం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం, రాష్ట్రవ్యాప్తంగా సన్నబియ్యం పంపిణీ, రోడ్ల అభివృద్ధి వంటి అనేక కార్యక్రమాలను ప్రభుత్వం చేపడుతోందని మంత్రి తెలిపారు.పాలమూరు ప్రాజెక్టును పూర్తి చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి ప్రత్యేకంగా కృషి చేస్తున్నారని చెప్పారు.కార్యక్రమంలో రాష్ట్ర అబ్కారీ, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, నాగర్కర్నూల్ ఎంపి మల్లు రవి, నాగర్కర్నూల్ ఎమ్మెల్యే రాజేష్రెడ్డి, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎస్పీ సంగ్రామ్సింగ్ పాటిల్, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# భారత్-రష్యా వాణిజ్యం ఈ ఏడాది పెరిగిందన్న పుతిన్

న్యూఢిల్లీ : భారత విదేశాంగ శాఖ మంత్రి ఎస్. జైశంకర్ మాస్కోలో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పంపిన 'వ్యక్తిగత సందేశాన్ని' ఆయన పుతిన్కు అందజేశారు. అయితే ఆ 'పర్సనల్ మెసేజ్'లో ఏముందన్నది ఆయన వెల్లడించలేదు. ఈ సమావేశంలో ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలతో పాటు అంతర్జాతీయ పరిణామాలపై ఇరువురు నేతలు లోతుగా చర్చించారు.భారత్-రష్యా మధ్య వాణిజ్యం, ఆర్థిక, శాస్త్ర సాంకేతిక, సాంస్కృతిక సహకారంపై జరిగిన 27వ అంతర్-ప్రభుత్వ కమిషన్ (ఎఖీఎఉఅ-ఇఅ) సమావేశం వివరాలను జైశంకర్, ఈ సందర్భంగా పుతిన్కు వివరించారు. రష్యా ఉప ప్రధాని డెనిస్ మాంటురోవ్తో కలిసి జైశంకర్ ఈ సమావేశానికి సంయుక్తంగా అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా పుతిన్ మాట్లాడుతూ, భారత్-రష్యా మధ్య చిరకాలంగా అత్యంత దృఢమైన సంబంధాలు కొనసాగుతున్నాయని ప్రశంసించారు. గతేడాది స్వల్పంగా తగ్గిన ద్వైపాక్షిక వాణిజ్యం, ఈ ఏడాది తిరిగి వృద్ధి పథంలోకి రావడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ ప్రత్యేక శ్రద్ధ వహించడం వల్లే ఇది సాధ్యమైందని పుతిన్ పేర్కొన్నారు. తన తరపున ప్రధాని మోదీకి ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేయాలని జైశంకర్ను కోరారు.త్వరలో జరగనున్న షాంఘై సహకార సంస్థ (ఎస్సీఓ) సదస్సు సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీతో సమావేశం కావాలని ఆకాంక్షిస్తున్నట్లు పుతిన్ వెల్లడించారు.

### బళ్లారి మండల హాలకుందిలోని

## సుజ్లాన్ యార్డును సందర్శించనున్న లోకేశ్

అనంతపురం : ఏపీ మంత్రి నారా లోకేశ్ కర్ణాటకలోని బళ్లారిలో పర్యటిస్తున్నారు. ఈ ఉదయం బళ్లారిలోని జిందాల్ విజయ్నగర్ ఎయిర్పోర్ట్కు చేరుకున్న ఆయనకు కర్ణాటక మంత్రి నాగేంద్ర, ఏపీ ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, ఎంపీలు బీకే పార్థసారథి, అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యేలు దగ్గుపాటి ప్రసాద్, అమిలినేని సురేంద్రబాబు, పల్లె సింధూర రెడ్డి, ఏపీఐఐసీ డైరెక్టర్ చల్లా లక్ష్మీ ప్రసాద్లతో పాటు టీడీపీ నాయకులు,కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. తన పర్యటన సందర్భంగా బళ్లారి మండలం హాలకుందిలోని సుజ్లాన్ బ్లేడ్ స్టాక్ యార్డును సందర్శించనున్నారు. అనంతరం, అనంతపురం జిల్లా రాయదుర్గం నియోజకవర్గం కణేకల్లు మండలం హులికెర గ్రామంలో సుజ్లాన్ విండ్ పవర్ ప్రాజెక్టులకు ఆయన శంకుస్థాపన చేయనున్నారు. దీంతో పాటు సుజ్లాన్ 'ఎ144 న్యూ బ్లేడ్ ప్రొడక్షన్ లైన్స్'ను అధికారికంగా ప్రారంభిస్తారు.

# మెయినాబాద్‌లో రహస్య భేటీ

హైదరాబాద్ : లండన్ పర్యటన ముగించిన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వచ్చారు. శంషాబాద్ విమానాశ్రయంలో ఆయనకు కాంగ్రెస్ నాయకులు ఘనస్వాగతం పలికారు. సాయంత్రం రేవంత్ రెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించబోతున్నారు. ఈ సమావేశంలో రేవంత్ ఏం మాట్లాడబోతున్నారనేది సర్వత్రా ఆసక్తికరంగా మారింది. సురేఖ వ్యవహారం, అమెరికా వెళ్లడానికి కేంద్ర విదేశాంగ శాఖ మోకాలడ్డటం వంటి పరిణామాలపై రేవంత్ రెడ్డి ఎలా మాట్లాడతరనేది ఆసక్తికరంగా మారింది. రేవంత్ రెడ్డి విలేకరుల సమావేశానికంటే ముందే తెలంగాణ రాజకీయాలలో సంచలన పరిణామాలు చోటు చేసుకుందని వార్తలు వినిపిస్తున్నాయి.గులాబీ పార్టీకి అనుకూలంగా ఉండే కొన్ని సోషల్ మీడియా గ్రూపులు.. ముఖ్యంగా ఎక్స్ హ్యాండిల్స్ లో రకరకాల ప్రచారాలు జరుగుతున్నాయి. అందులో ముఖ్యంగా మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి 20 మంది ఎమ్మెల్యేలతో ప్రచారం జరుగుతోంది. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీలో అంతర్గత రాజకీయాలు జరుగుతున్నాయు.. ఇవి చర్చనీయాశంగా మారిపోయారని.. మొయినాబాదులోని ఒక వ్యవసాయ క్షేత్రంలో రాజగోపాల్ రెడ్డి నాయకత్వంలో సుమారు 20 మంది ఎమ్మెల్యేలు రహస్యంగా సమావేశం అయ్యారని ప్రచారంలో ఉంది. ఈ సమావేశంలో ఆ 20 మంది ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యవహార శైలి మీద.. ముఖ్యంగా కొంతమంది వ్యక్తులు సాగిస్తున్న ఆధిపత్యం మీద తీవ్రస్థాయిలో అసంతృప్తి వ్యక్తం చేసినట్టు ప్రచారం జరుగుతుంది. అవసరమైతే ప్రభుత్వం ఇబ్బందుల్లో పడినప్పటికీ.. తమ ధోరణి మార్చుకునే అవకాశం లేదని వారు చెప్పినట్టు గులాబీ పార్టీ సోషల్ మీడియా గ్రూపులలో ప్రచారం జరుగుతోంది. బీసీ సామాజిక వర్గానికి చెందిన మంత్రి..ముఖ్యమంత్రి సొంత జిల్లా చెందిన ఒక మంత్రి.. రంగారెడ్డి.. నల్గొండ జిల్లాలకు చెందిన కొంతమంది సీనియర్ ఎమ్మెల్యేలు.. ఉమ్మడి పాలమూరు జిల్లా చెందిన కొంతమంది ఎమ్మెల్యేలు ఇందులో పాల్గొన్నట్టు గులాబీ పార్టీ సోషల్ మీడియా గ్రూపులలో ప్రచారం జరుగుతుంది ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి 64 మంది ఎమ్మెల్యేల బలంఉంది.ఒకవేళ ఆ 20 మంది ఎమ్మెల్యేలు తాటి మీదికి వస్తే రాజకీయంగా ప్రభావం చూపించే అవకాశం ఉందని. కెసిఆర్ ను మరోసారి ముఖ్యమంత్రి చేస్తారని గులాబీ పార్టీ సోషల్ మీడియా గ్రూపులో సొంత డబ్బా కొట్టుకుంటున్నాయిఇక ఇటీవల రేవంత్ రెడ్డి ఫారిన్ టూర్ కు సంబంధించిన వ్యవహారాలు కూడా ఆసక్తికరంగా మారాయి.

# జీవవైవిధ్యం అద్భుతం

హైదరాబాద్ : అసోంలోని దెహింగ్ పట్కాయ్ ప్రాంతం అరుదైన జీవవైవిధ్యానికి నిలయంగా మారిందని, ముఖ్యంగా అంతరించిపోతున్న సీతాకోకచిలుకలకు సురక్షిత ఆవాసంగా నిలుస్తోందని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో మొత్తం 165 రకాల సీతాకోకచిలుక జాతులు ఉన్నాయని, వాటిలో 37 అత్యంత అరుదైన జాతులు ఉన్నాయని ఆయన వెల్లడించారు.ఈ అద్భుతమైన జీవవైవిధ్యంపై సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్' ద్వారా ముఖ్యమంత్రి స్పందించారు. 'సీతాకోకచిలుక, ఎగిరిపో...' అంటూ తన పోస్టులో పేర్కొంటూ, ఈ ప్రాంత పర్యావరణ ప్రాముఖ్యతను ఆయన కొనియాడారు. ప్రభుత్వం చేపడుతున్న పటిష్ఠ పరిరక్షణ చర్యల వల్లే అరుదైన జాతులు ఇక్కడ వృద్ధి చెందుతున్నాయని, వాటికి అనువైన, సురక్షితమైన ఆవాసం లభిస్తోందని ఆయన వివరించారు

పర్యావరణ వ్యవస్థ ఆరోగ్యాన్ని సూచించే కీలక జీవులుగా సీతాకోకచిలుకలను పరిగణిస్తారు. వృక్షసంపద, వాతావరణం, సహజ ఆవాసాల స్థితిగతులపైనే వీటి జనాభా ఆధారపడి ఉంటుంది. దెహింగ్ పట్కాయ్లో ఇంత పెద్ద సంఖ్యలో సీతాకోకచిలుకలు మనుగడ సాగించడం అక్కడి పర్యావరణ సమతుల్యతకు నిదర్శనమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.ఇటీవలి కాలంలో అసోం ప్రభుత్వం వన్యప్రాణుల సంరక్షణ, అటవీ భూముల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారించింది. రాష్ట్ర సహజ సంపదను కాపాడే క్రమంలో ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలనిస్తున్నాయని ఈ గణాంకాలు నిరూపిస్తున్నాయి.

# ఘనంగా అయ్యప్ప స్వామి ఆలయంలో శ్రావణమాస పూజలు

## అయ్యప్ప స్వామి అనుగ్రహం అందరిపై ఉండాలి: కౌన్సిలర్ రొట్టెల శ్రీనివాస్

గజ్వేల్:26ఆగస్టు 2026 ( ప్రజా కలం ప్రతినిధి)

గజ్వేల్ పట్టణంలోని శ్రీ హరిహరపుత్ర అయ్యప్ప స్వామి ఆలయంలో శ్రావణమాసం సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు.కౌన్సిలర్ రొట్టెల శ్రీనివాస్,భాగ్యలక్ష్మి దంపతులు, సలిమేట కేదార్‌నాథ్,సరస్వతి దంపతులు,వారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృత అభిషేకం,విశేష పూజలు నిర్వహించారు.అనంతరం భక్తులకు



తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షులు బొగ్గుల సురేష్ గురుస్వామి,మాజీ కౌన్సిలర్ ఉప్పల మెట్టయ్య గురుస్వామి,ఎర్రం శ్రీనివాస్ గురుస్వామి మాట్లాడుతూ శ్రావణమాసం సందర్భంగా గత కొన్ని సంవత్సరాలుగా దంపతుల ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.శ్రావణమాసం నెలరోజుల పాటు ప్రతిరోజూ దంపతులచే స్వామివారికి అభిషేకం,ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు.కౌన్సిలర్ రొట్టెల శ్రీనివాస్ మాట్లాడుతూ అయ్యప్ప స్వామి అనుగ్రహం ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు.భక్తిశ్రద్ధలతో స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించడం ద్వారా ఆధ్యాత్మిక ప్రశాంతత లభిస్తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో నాచారం దేవస్థానం డైరెక్టర్,అయ్యప్ప ఆలయ కమిటీ ఉపాధ్యక్షులు జగ్గయ్యగారి శేఖర్, ప్రధాన కార్యదర్శి అయిత సత్యనారాయణ,కోశాధికారి నారాయణరెడ్డి,కార్యదర్శి గోపి, నాయకులు గందె యాదగిరి,మర్యాల శ్రీనివాస్,లక్ష్మారెడ్డి,గంగిశెట్టి వెంకటేశం, కైలాస ప్రశాంత్,దేవానంద్,డెంటల్ శ్రీనివాస్,అంజయ్య,విక్రాంత్,దీపక్,గందె సంతోష్‌తో పాటు అయ్యప్ప స్వామి భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఓటరు జాబితాలో ప్రతి అర్హుడి పేరు నమోదు కావాలి

## రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు చల్లా నర్సింహారెడ్డి

మహేశ్వరం, ఆగస్టు 26,(ప్రజా కలం)

ఓటు మన ప్రజాస్వామ్య హక్కు అని, ప్రతి అర్హుడి ఓటు తప్పనిసరిగా ఓటరు జాబితాలో ఉండేలా బూత్ లెవెల్ కమిటీ, విలేజ్ లెవెల్ కమిటీ, మండల కమిటీలు బాధ్యతగా పనిచేయాలని రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చల్లా నర్సింహారెడ్డి పిలుపునిచ్చారు.ఆగస్టు 27, 2026న జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాలు, వార్డుల్లో ఓటరు జాబితాపై ప్రత్యేక సభలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని తమ పేరు ఓటరు జాబితాలో ఉందో లేదో తప్పనిసరిగా పరిశీలించుకోవాలని సూచించారు. ఓటరు జాబితాలో పేరు లేకపోతే భయపడాల్సిన అవసరం లేదని, అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేందుకు అక్కడికక్కడే దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. అలాగే జాబితాలో పేరు, వయస్సు, చిరునామా వంటి వివరాల్లో తప్పులు ఉంటే వెంటనే సరిచేసుకోవాలని కోరారు.18 సంవత్సరాలు నిండిన ప్రతి యువతీ యువకుడు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.గ్రామాల్లో గ్రామ పంచాయతీ భవనాల్లో, పట్టణాల్లో సంబంధిత పోలింగ్ కేంద్రాల్లో జరిగే ఈ కార్యక్రమాలకు ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.మీ ఓటు – మీ హక్కు, మీ ఓటు – మీ భవిష్యత్తు. అర్హత ఉన్న ఒక్క ఓటు కూడా మిస్ కాకుండా మనమందరం కలిసి పనిచేద్దాం అని పిలుపునిచ్చారు.



# ఎలాయగూడలో ఇందిరమ్మ ఇంటికి ముగ్గు.. స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

కుకునూరుపల్లి, ఆగస్టు 26( ప్రజా కలం ) కుకునూరుపల్లి మండలం ఎలాయగూడ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇల్లు, స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామానికి చెందిన సావిత్రి వెంకటయ్యకు మంజూరైన ఇందిరమ్మ ఇంటికి కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు కందూరి అయిలయ్య, సర్పంచ్ సున్నం సుదర్శన్‌తో కలిసి ముగ్గు పోశారు.అనంతరం ఎలాయగూడ గ్రామపంచాయతీ ఆవరణలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కందూరి అయిలయ్య, సర్పంచ్ సున్నం సుదర్శన్ కలిసి లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారురాలు సావిత్రి వెంకటయ్య మాట్లాడుతూ.. గత కొన్ని సంవత్సరాలుగా ఇల్లు లేక ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నానని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి, సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు అంక్షారెడ్డి సూచనల మేరకు తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు కావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఇందుకు వారికి జీవితాంతం రుణపడి ఉంటానని కృతజ్ఞతలు తెలిపారు.

స్మార్ట్ రేషన్ కార్డులు అందుకున్న మహిళలు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తమకు స్మార్ట్ రేషన్ కార్డులు అందించడం ద్వారా తమ ఆత్మగౌరవాన్ని పెంచారని అన్నారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ జాన్,కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు నరేష్,సున్నం బిక్షపతి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



# నిర్వాసితుల న్యాయం కోసం ఉద్యమాలకు సిద్ధం కావాలి: ఎమ్మెల్సీ కోదండరాం




గజ్వేల్:26 ఆగస్టు 2026
( ప్రజా కలం ప్రతినిధి)

మల్లన్నసాగర్,కొండపోచమ్మసాగర్ ప్రాజెక్టుల నిర్వాసితుల సమస్యల పరిష్కారం కోసం మరోసారి భావవ్యక్తి ఆందోళనలకు సిద్ధం కావాలని ఎమ్మెల్సీ కోదండరాం పిలుపునిచ్చారు. ప్రాజెక్టుల నిర్మాణంలో నిర్వాసిత కుటుంబాలకు జరిగిన అన్యాయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, వారికి న్యాయం జరిగేలా కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్ ప్రాజెక్టుల నిర్వాసితుల కన్నీటి బాధలను ప్రతిబింబిస్తూ ఉపాధ్యాయుడు పులి రాజు, సీనియర్ జర్నలిస్ట్ రాజేందర్ రచించిన 'కన్నీళ్ల సాగరం' పుస్తకాన్ని ఎమ్మెల్సీ కోదండరాం, బహుజన యుద్ధనౌక ఏపూరి సోమన్న, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత ప్రముఖ జర్నలిస్ట్ సజయ,డీపీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్‌లతో కలిసి ఆవిష్కరించారు.ఈ సందర్భంగా కోదండరాం మాట్లాడుతూ మల్లన్నసాగర్ నిర్మాణ సమయంలో నిర్వాసితుల తరపున అనేక ఉద్యమాలు చేపట్టినట్లు గుర్తుచేశారు.అప్పటి ప్రభుత్వం 14 గ్రామాల ప్రజలకు అన్యాయం చేసిందని ఆరోపించారు. నిర్వాసితులకు న్యాయం చేయాలని ఆందోళన చేపట్టిన సమయంలో తనను రెండుసార్లు అరెస్టు చేసి జైలుకు పంపించారని పేర్కొన్నారు. ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందని కుటుంబాలను గుర్తించి సమగ్ర నివేదిక రూపొందించాలని కోరారు.ఈ సమస్యను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి నిర్వాసిత కుటుంబాలకు న్యాయం జరిగేలా కృషి చేస్తానని తెలిపారు.

**2013 చట్టం ప్రకారం న్యాయం చేయాలి**

మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్ నిర్వాసిత కుటుంబాలకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం న్యాయం చేయాలని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, ప్రముఖ జర్నలిస్ట్ సజయ డిమాండ్ చేశారు. 'కన్నీళ్ల సాగరం' పుస్తకావిష్కరణ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ప్రాజెక్టుల నిర్మాణం కోసం భూములు, ఇళ్లు కోల్పోయిన ముంపు బాధితులకు చట్టప్రకారం పూర్తి నష్టపరిహారం అందించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు.మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్ ముంపు బాధితులకు ఇప్పటికీ పూర్తిస్థాయిలో న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి కుటుంబానికి 2013 చట్టం ప్రకారం న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకున్నప్పుడే హక్కులు సాధించుకోగలమని, నిరాశ చెందకుండా న్యాయం దక్కే వరకు ఉద్యమించాలని సూచించారు.

**ముంపు గ్రామాల బాధితులు ఐక్యంగా పోరాడాలి**

ముంపు గ్రామాల బాధితులు ఐక్యంగా తమ సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని బహుజన యుద్ధనౌక ఏపూరి సోమన్న అన్నారు. ప్రజల పక్షాన తన పాట, తన పోరాటం ఎప్పటికీ కొనసాగుతుందని పేర్కొన్నారు. ముంపు గ్రామాల బాధితుల సమస్యలపై ఏపూరి సోమన్న ఆలపించిన పాటకు మహిళలు కన్నీటి పర్యంతమయ్యారు. ప్రభుత్వం ఏర్పడి ఇన్ని సంవత్సరాలు గడిచినా ముంపు బాధితులను పరామర్శించేందుకు ఒక్క మంత్రి కూడా రాకపోవడం బాధాకరమని అన్నారు. గతంలో నిర్వాసితుల కోసం పోరాడుతూ లాఠీ దెబ్బలు తిని,కేసులు ఎదుర్కొన్న విషయాన్ని గుర్తుచేశారు.ప్రస్తుతం కూడా నిర్వాసితుల పక్షాన నిలబడి వారి సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో పుస్తక రచయితలు పులి రాజు, రాజేందర్,తెలంగాణ జన సమితి పార్టీ జిల్లా అధ్యక్షుడు నీరుడు స్వామి, యువజన అధ్యక్షుడు కీసర స్వామి, అందె ప్రవీణ్ కుమార్,కౌన్సిలర్లు విష్ణువర్ధన్‌రెడ్డి,వెల్దండి నరసింహారెడ్డి,ఉపేందర్‌రెడ్డి, దాసరి కృష్ణ,రాజులు, గోపాల్, చంద్రశేఖర్‌రెడ్డి, రాజేశం, సత్యనారాయణ, నరేందర్,మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

# పాశమైలారంలో అమ్మవారి ప్రతిష్ఠాపన సందడి

## - 8:13కు ప్రాణప్రతిష్ఠ.. 28న మహోత్సవ శిఖరం..



పటాన్‌చేరు,ఆగస్టు 26 (ప్రజా కలం) ప్రతినిధి

పాశమైలారంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. శ్రీ త్రిశక్తి దుర్గాభవాని దేవి ప్రతిష్ఠాపన మహోత్సవాలు బుధవారం భక్తిశ్రద్ధల మధ్య వైభవంగా ప్రారంభమయ్యాయి.

మూడు రోజుల పాటు జరిగే ఈ మహోత్సవాలు ఈ నెల 26 నుంచి 28 వరకు కొనసాగనున్నాయి.తొలిరోజు ఉదయం 8 గంటల నుంచి ప్రత్యేక పూజలు,ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారి అనుగ్రహం కోసం భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు రెండో రోజు గురువారం ఉదయం 8 గంటల నుంచి ఆవాహిత దేవతా పూజలు,మండప పూజలు, వివిధ హోమాలు, ప్రతిష్ఠాపనకు సంబంధించిన ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.

మూడో రోజు శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి కార్యక్రమాలు ప్రారంభమై,బ్రాహ్మణోత్తములు నిర్ణయించిన సుముహూర్తంలో ఉదయం 8 గంటల 13 నిమిషాలకు శ్రీ త్రిశక్తి దుర్గాభవాని దేవి ప్రాణ ప్రతిష్ఠ నిర్వహించనున్నారు.అనంతరం ప్రధాన పూజా కార్యక్రమాలు కొనసాగుతాయి.మధ్యాహ్నం 12:30 గంటలకు అన్నప్రసాద వితరణ చేపట్టనున్నారు. మూడు రోజుల మహోత్సవాలకు భక్తులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారి ఆశీస్సులు పొందాలని నిర్వాహకులు కోరారు. మహోత్సవాల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లన్నీ పూర్తి చేసినట్లు తెలిపారు..

# రావిరాలలో ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీ ఎన్నిక

## రావిరాల గ్రామ అధ్యక్షులు ఆలేటి వెంకటేష్ మాదిగ

మహేశ్వరం, ఆగస్టు 26( ప్రజా కలం )

మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు మాన్యశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు, రంగారెడ్డి జిల్లాలో ప్రతి మండలంలో గ్రామ కమిటీలను ఏర్పాటు చేసి మండల కమిటీల పునర్నిర్మాణం చేస్తున్న కార్యక్రమంలో భాగంగా మంగళవారం నాడు మహేశ్వరం మండలం రావిరాల గ్రామంలో నూతన దండోరా గ్రామ కమిటీని ఎన్నుకోవడం జరిగింది.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మార్పీఎస్ మాజీ జిల్లా అధ్యక్షులు రావుగళ్ళ బాబు మాదిగ, మాజీ మండల అధ్యక్షులు ఎర్ర గణేష్ మాదిగ గారు హాజరై నూతన కమిటీని ప్రకటించారు.

రావిరాల గ్రామ నూతన కమిటీ వివరాలు:

గ్రామ అధ్యక్షులు ఆలేటి వెంకటేష్ మాదిగ,అధికార ప్రతినిధి జోగు శివరాజ్ మాదిగ,ప్రధాన కార్యదర్శి జోగు సుమన్ మాదిగ,ప్రధాన కార్యదర్శి – బైండ్ల స్వామి మాదిగ, ఉపాధ్యక్షులు రెడ్డిగళ్ళ దేవేందర్ మాదిగ, ఆలేటి రమేష్ మాదిగ, ఎర్రోళ్ల శ్రీధర్ మాదిగ కోశాధికారి కొటగళ్ల విజయ్,కార్యదర్శులు నేదునూరి రఘు, రావుగళ్ళ శ్రీధర్ మాదిగ, కొంగరి వెంకటేష్ యస్ పొట్టోళ్ల సుధాకర్, సహాయ కార్యదర్శులు ఆలేటి కార్తీక్, బుస్సగారి మహేందర్ మంకాల సురేందర్, కిన్నరి ప్రవీణ్, కార్యవర్గ సభ్యులు కూటగళ్ల ప్రవీణ్ ఎన్నుకున్నారు.

ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మాదిగ కుల పెద్దలు పొట్టోల్ల నరసింహ, కోటగళ్ల బాలరాజ్, కోటగళ్ల సుధాకర్, కిన్నరి రాజు, దప్పు యాదయ్య, రావుగళ్ళ దయానంద్, ఆలేటి శ్రీను, రావుగళ్ళ జంగయ్య, ఆలేటి జగన్, కిన్నరి ధనరాజ్, ఆకంపల్లి యాదయ్య, రావుగళ్ళ అమరేందర్, బాట శ్రీను, బాట ఆనంద్, రావుగళ్ళ నరసింహ మాదిగ తదితరులు పాల్గొని నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం నాయకులు మాట్లాడుతూ రానున్న రోజుల్లో ఎమ్మార్పీఎస్ ను గ్రామస్థాయిలో మరింత బలోపేతం చేసి మందకృష్ణ మాదిగ ఆశయాల కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు.



# 22ఏ భూములపై భగ్గుమన్న బీఆర్ఎస్..

## -22ఏ భూములపై సమరశంఖం.. 29న మహాధర్నా..

పటాన్‌చెరు, ఆగస్టు 26 (ప్రజా కలం) ప్రతినిధి

అమీన్‌పూర్ పరిధిలో 22ఏ నిషేధిత జాబితాలో 200కుపైగా సర్వే నంబర్లకు చెందిన 600 ఎకరాలకు పైగా భూములను చేర్చడంపై తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది.ఈ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని అమీన్‌పూర్



మాజీ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి డిమాండ్ చేశారు.హెచ్‌ఎండీఏ అనుమతులు పొందిన లేఅవుట్లను సైతం నిషేధిత జాబితాలో చేర్చడం సరికాదన్నారు. 22ఏ సమస్యపై ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఈ నెల 29న నవ్య సర్కిల్ వద్ద బీఆర్ఎస్ ఆధ్వర్యంలో భారీ మహాధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. మాజీ మంత్రి హరీష్ రావు ముఖ్య అతిథిగా, ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి నాయకత్వంలో ధర్నా జరుగుతుందని పేర్కొన్నారు. బాధిత కాలనీవాసులు, భూయజమానులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. సమస్య పరిష్కారం కాకపోతే కలెక్టరేట్ ముట్టడికి సైతం వెనుకాడబోమని పాండురంగారెడ్డి హెచ్చరించారు. సమావేశంలో బాశెట్టి క్రిష్ణ, పటోళ్ల కల్పన ఉపేందర్ రెడ్డి, బిజిలి రాజు, గోపాల్, తలారి రాములు, యూనుస్, మంజుల చంద్రశేఖర్, నర్సింగ్ రావు, తుమ్మల ప్రభాకర్ రెడ్డి, ప్రతాపరెడ్డి, రుశ్వంత్ రెడ్డి, శ్రీను, వివిధ కాలనీల వాసులు పాల్గొన్నారు..

# ప్రసిద్ధ దేవాలయాలను సందర్శించిన సూర్య నమస్కారాలు బృందం.

గజ్వేల్:26 ఆగస్టు 2026 ( ప్రజా కలం ప్రతినిధి)

గజ్వేల్ కు చెందిన సూర్య నమస్కారాలు బృందం ప్రసిద్ధ దేవాలయాలను దర్శించుకున్నారు,కేరళ,తమిళనాడు రాష్ట్రాలలో ఉన్న ప్రసిద్ధిగాంచిన పుణ్యక్షేత్రాలను సందర్శించింది.మొదటగా కాణిపాకం వినాయకుడు, కన్యాకుమారి లో శ్రీరంగం విష్ణుమూర్తి,త్రివేంద్రంలో అనంత పద్మ స్వామి దేవాలయం,ఆజ్మాల దేవాలయం,కేరళలో ఉన్న అయ్యప్ప స్వామి శబరిమలై, మధురై పుణ్యక్షేత్రాలు సందర్శించారు.సూర్య నమస్కారాలు,యోగ్యాసనాలు చేపడుతూ ప్రపంచ చరిత్రపై అవగాహన పెంచుకునేందుకు పర్యటక కేంద్రాలను సందర్శిస్తామని సూర్య నమస్కారాలు బృందం అభిప్రాయపడ్డది. కేరళలో గత ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధిని సందర్శకులకు ఆకట్టుకుంటుంది. కేరళ రాష్ట్రంలో 20సంవత్సరాల పాటు వామపక్ష పార్టీ ప్రభుత్వం అధికారాన్ని మొన్నటి వరకు చేపట్టింది.దీని ద్వారా అయ్యప్ప శబరిమల దేవాలయం వద్ద మార్పులపై సూర్య నమస్కార బృందం గుర్తుచేసుకుంది.దేవాలయం వద్ద శుభ్రత పరిశుభ్రత.భక్తులకు మౌలిక సదుపాయాల ఏర్పాటుపై సంతోషం వ్యక్తం చేశారు.సూర్య నమస్కార బృందంలో దాదాపు 50 మంది కొరకు ఉండటం ప్రతి ఏటా మార్పులు చేర్పులు చేస్తూ కేరళ రాష్ట్రంలో ఉన్న మన పుణ్యక్షేత్రాలు అభివృద్ధి కనిపించిందని సూర్య నమస్కార బృందం వారు అన్నారు





## సైబరాబాద్ కమిషనర్ కుత్బుల్లాపూర్ లో సుడిగాలి పర్యటన

### జగద్గిరిగుట్ట సూరారం పోలీస్ స్టేషన్లో తనిఖీ

ప్రజాకలం/ కుత్బుల్లాపూర్ (ప్రతినిధి) సైబరాబాద్ పోలీసు కమిషనర్ ఏం రమేష్ రెడ్డి బుధవారం కుత్బుల్లాపూర్ లో సుడిగాలి పర్యటన చేశారు. జగద్గిరిగుట్ట, సూరారం పోలీస్ స్టేషన్లో ఆయన తనిఖీలు నిర్వహించారు. సూరారం పోలీస్ స్టేషన్‌ను సీపీ సైబరాబాద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని లా ఉ ఆర్డర్ పరిస్థితులను పరిశీలించి, ఎస్ఐలు, రిసెప్షన్ సిబ్బంది మరియు వివిధ సెక్షన్ ఇన్‌చార్జీలతో ఇంటరాక్ట్ అయ్యారు. స్టేషన్ నిర్వహణ, పెండింగ్ కేసులు మరియు విధుల నిర్వహణకు సంబంధించిన అంశాలను సమీక్షించారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ డిసిపి కోటిరెడ్డి, అడిషనల్ డిసిపి, కుత్బుల్లాపూర్ ఏసిపి, సూరారం సిఐ బాలరాజు, జగద్గిరిగుట్ట సీఐ సురేష్ ను పాల్గొన్నారు.

## శాంతి, సహనం, పరస్పర గౌరవం, పేదల పట్ల దయ, మానవ సేవ భావాలను చాటేదే మిలాద్ ఉన్ నబీ పండుగ:ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్

ప్రజాకలం/ కుత్బుల్లాపూర్ (ప్రతినిధి) 126 - జగద్గిరిగుట్ట డివిజన్ మగ్దుమ్ నగర్ లో మిలాద్ ఉన్ నబీ పండుగను పురస్కరించుకొని భారీ ర్యాలీ నిర్వహించగా ముఖ్యఅతిధిగా హాజరై ఎమ్మెల్యే కేపీ వివేకానంద ర్యాలీని ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.... ప్రవక్త మహమ్మద్ (స) బోధించిన శాంతి, సహనం, పరస్పర గౌరవం, పేదల పట్ల దయ, మానవ సేవ వంటి విలువలను



ప్రతి ఒక్కరూ ఆచరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. మిలాద్-ఉన్-నబీ పర్వదినం సందర్భంగా జగద్గిరిగుట్ట డివిజన్‌లోని ముస్లిం సోదర సోదరీమణులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖ శాంతులు, సౌభాగ్యం నెలకొనాలని ఆకాంక్షించారు. "ప్రేమ, శాంతి, కరుణ -- ప్రవక్త మహమ్మద్ (స) చూపిన మానవతా మార్గం" అనే సందేశంతో ర్యాలీ ఉత్సాహంగా సాగింది. ఈకార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జగన్, శ్రీ వెంకటేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ వేణుయాదవ్, డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, డివిజన్ మైనారిటీ అధ్యక్షులు ఎండి. ఆజం, సీనియర్ నాయకులు సయ్యద్ సాజిద్, పాషా, ఖయ్యుమ్, మహమ్మద్ మెహెమూద్, మహమ్మద్ అన్వర్, మహమ్మద్ ఇబ్రహీం, మహమ్మద్ సోహెల్, ఎస్.కె.జావీద్, మహమ్మద్ ఖదీర్, మహమ్మద్ అక్బర్, సయ్యద్ జలీల్, సురేష్ గుప్తాలు పాల్గొన్నారు.

# కులమతాలకు అతీతంగా ఐక్యంగా ముందుకు సాగాలి

### నిజామాబాద్ మిలాద్ వేడుకల్లో షబ్బీర్ అలీ, మహేష్ కుమార్ గౌడ్





నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) ఆగస్టు 26:

నిజామాబాద్ పట్టణంలో మిలాద్ ఉన్ నబీ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఖిలా రోడ్డు నుంచి ప్రారంభమైన మిలాద్ ఉన్ నబీ ర్యాలీ ఉత్సాహభరితంగా కొనసాగగా, అనంతరం ఖిలా రోడ్డు, నెహ్రూ పార్క్‌లో ఏర్పాటు చేసిన సభలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ గార్లు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులకు మిలాద్ ఉన్ నబీ శుభాకాంక్షలు తెలిపిన షబ్బీర్ అలీ, మహేష్ కుమార్ గౌడ్‌లు మహమ్మద్ ప్రవక్త బోధించిన ప్రేమ, శాంతి, సోదరభావం, మానవత్వం వంటి విలువలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని పిలుపునిచ్చారు. మతాల మధ్య ఐక్యతే తెలంగాణ బలం: షబ్బీర్ అలీ

సభలో ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ మాట్లాడుతూ. మనిషిని మనిషిగా గౌరవించడం, ప్రేమించడం, కష్టాల్లో ఒకరికొకరు అండగా నిలవడమే నిజమైన మానవత్వం అని అన్నారు. కులం, మతం, ప్రాంతం పేరుతో మనుషుల మధ్య విభేదాలు సృష్టించుకోవద్దని ఆయన పిలుపునిచ్చారు. తెలంగాణ సమాజం ఎప్పటి నుంచో కులమతాలకు అతీతంగా కలిసి జీవించే గొప్ప సంస్కృతిని కలిగి ఉందని, ఈ సామరస్యాన్ని భవిష్యత్ తరాలకు కూడా అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. మిలాద్ ఉన్ నబీ సందర్భంగా ప్రవక్త మహమ్మద్ చూపిన శాంతి, కరుణ, సహనం, సోదరభావం మార్గంలో సమాజం ముందుకు సాగాలని ఆయన ఆకాంక్షించారు. కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ సెక్యులర్ సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేసే పార్టీ అని షబ్బీర్ అలీ అన్నారు. కులం, మతం, భాష, ప్రాంతం అనే తేడాలు లేకుండా ప్రతి ఒక్కరినీ సమానంగా గౌరవించడం కాంగ్రెస్ పార్టీ విధానమని తెలిపారు.

తెలంగాణలో ప్రతి పౌరుడు ప్రశాంతంగా, గౌరవంగా జీవించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. సమాజంలోని అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. మిలాద్ ఉన్ నబీ సందర్భంగా ఖిలా రోడ్డు నుంచి ప్రారంభమైన ర్యాలీలో పెద్ద సంఖ్యలో వేలాది గా ,ముస్లిం సోదరులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, యువత పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, రైతు కమిషన్ సభ్యులు గడుగు గంగాధర్. నుడచైర్మన్ కేశ వెను, శేఖర్ గౌడ్, నరాల రత్నాకర్ , జావిద్ అక్రమ్, కూద్దూస్, హారున్, కార్పొరేటర్లు సజ్జాద్ రహీల్, నయీమ్ షారాన్, అబ్దుల్ కరీం, అబుద్ బిన్ హందన్, అన్వార్, మొహమ్మద్ అహ్మద్, కో ఆప్షన్ మెంబెర్ మహేందర్ సింగ్, ఆసిఫ్, వహీద్, మరియు మీలాద్ కమిటీ అధ్యక్షులు ష?యైబ్ రజా, మహమ్మద్ అబ్బు రజా, రషీద్ రాజా, ముజహిద్ ఖాన్, పాప ఖాన్, జావీద్ ఖాన్, కయ్యుమ్, షబ్బీర్ రాజ్జాక్, జఫర్, యువజన కాంగ్రెస్ అధ్యక్షులు మొయిన్, సమీ, రియాజుదిన్, సఫ్దర్, అఫ్రోజ్ ఖాన్, సాదిక్ సోహైల్, షైక్ మహబూబ్, పర్వేజ్, ఈసా,మత పెద్దలు, కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, యువజన నాయకులు, కార్యకర్తలు, వివిధ వర్గాల ప్రజలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ విద్యారంగాన్ని పటిష్ఠపరచాలి

### - కార్పోరేట్ విద్యా సంస్థల ఫీజుల దోపిడీ అరికట్టాలి:సిపిఎం

ప్రజాకలం/ కుత్బుల్లాపూర్ (ప్రతినిధి) ఆగస్టు 30న జిల్లా విద్యా సదస్సు ను జయప్రదం చేయాలని పుచ్చలపల్లి లీలా సుందరయ్య ఫంక్షన్ హాల్, ప్రగతినగర్ విద్య ప్రజల హక్కు ప్రభుత్వాల బాధ్యత ప్రగతినగర్ సుందరయ్య భవన్లో సిపిఎం పార్టీ బాచుపల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా సిపిఎం పార్టీ బాచుపల్లి మండల కార్యదర్శి బి.వెంకటరామయ్య, సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు రాథోడ్ సంతోష్ లు మాట్లాడుతూ....కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ రంగంలోని విద్యను బలహీన పరుస్తూ, ప్రైవేటీకరిస్తున్నాయి. విద్యా కార్పోరేటీకరణతో ఫీజుల దోపిడీ విచ్చలవిడిగా సాగుతుందన్నారు. ఫలితంగా పేద, మధ్యతరగతి ప్రజలు విద్యకు దూరం అవుతున్నారు. విద్యలో అంతరాలు ఏర్పడుతున్నాయి. అంతస్తులను బట్టి



విద్యను పొందే పరిస్థితులు ఏర్పడ్డాయి. 79సంవత్సరాల స్వతంత్ర భారతంలో ఈరోజుకీ ప్రజలందరికీ నాణ్యమైన ఉచిత విద్యనందించడంలో విఫలమైనందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సిగ్గుపడాలి. కొఠారి కమిషన్(1966) నుంచి నూతన విద్యా విధానం- 2020 వరకు విద్యపై కేంద్ర ప్రభుత్వ వ్యయాన్ని GDPలో కనీసం 6శాతానికి పెంచాలని పదేపదే సిఫారసు చేసినప్పటికీ 2022-23లో కేంద్రం కేవలం GDPలో 1.09% మాత్రమే కేటాయించిందని గుర్తు చేశారు. రాష్ట్రాలు తమ బడ్జెట్లో 30% కేటాయించాలని అనేక సిఫార్సులు చెబుతుంటే రాష్ట్రాల 2025-26 సగటు విద్యా కేటాయింపు 14.5% కాగా, తెలంగాణ 2026-27లో 9.8% మాత్రమే కేటాయించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ బాధ్యతల నుండి తప్పుకుంటున్నాయని ఈఅంకెలు తెలియజేస్తున్నాయి. ప్రజలందరికీ ఉచితంగా నాణ్యమైన విద్యను అందించాలని, కార్పొరేట్ ఫీజుల దోపిడీని అరికట్టడానికి సమగ్ర ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని, విద్యా వ్యాపారాన్ని అరికట్టాలని డిమాండ్ చేశారు.

సిపిఎం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కమిటీ 2026 ఆగస్టు 30న జిల్లా విద్యాసదస్సును నిర్వహిస్తుంది. ప్రజలు, ప్రజాస్వామిక వాదులు, విద్యావేత్తలు, పేరెంట్స్ అసోషియేషన్ ప్రతినిధులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో సిపిఎం పార్టీ బాచుపల్లి మండల కమిటీ సభ్యులు బాల వెంకటేశ్వరరావు, కృష్ణయ్య, సిపిఎం నాయకులు అక్బర్ అలీ ఖాన్, బాలపీర్, శంకర్రావు, వెంకటేశ్వరరావు, భాస్కర్, పాషా, రామకృష్ణ, నరేందర్ పాల్గొన్నారు.

## గ్రామ వార్డు సభలు ఓటర్లు తప్పనిసరిగా హాజరుకావాలి

### ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ

### నియోజకవర్గ ఎన్నికల అధికారి ఆర్డీవో జగదీశ్వర్ రెడ్డి

మహేశ్వరం, ఆగస్టు 26,(ప్రజా కలం)

ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ -- 2026 కార్యక్రమంలో భాగంగా 50-మహేశ్వరం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో రేపు అనగా ఆగస్టు 27, 2026న అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలో గ్రామసభలు, వార్డు సభలు నిర్వహించనున్నట్లు నియోజకవర్గ ఎన్నికల అధికారి ఆర్డీవో జగదీశ్వర్ రెడ్డి తెలిపారు.గ్రామీణ ప్రాంతాల్లో సంబంధిత గ్రామ పంచాయతీ భవనాల్లో, పట్టణ ప్రాంతాల్లో సంబంధిత పోలింగ్ కేంద్రాల వద్ద ఈ సభలు జరుగుతాయి. ఈ సభల్లో సంబంధిత బి ఎల్ ఓ లు, చునావ్ పాఠశాల సభ్యులు పాల్గొని సర్ కార్యక్రమంపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పిస్తారు.

సభల్లో చర్చించే ప్రధాన అంశాలు:

1. ముసాయిదా జాబితా పరిశీలన:

ముసాయిదా ఓటర్ల జాబితాలోని పేర్లను బి ఎల్ ఓ లు సభలో చదివి వినిపిస్తారు.

2. పేరు లేని అర్హుల గుర్తింపు జాబితాలో పేరు నమోదు కాని అర్హులైన భారతీయ పౌరుల వివరాలను గుర్తించడం.

3. కొత్త ఓటర్ల నమోదు:లి 01-10-2026 నాటికి 18 ఏళ్లు నిండే యువత ఫారం-6, డిక్లరేషన్ ఫారం మరియు అవసరమైన పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలి.

4. తప్పుల సవరణ: పేరు, వయస్సు, చిరునామా తదితర వివరాల్లో తప్పులు ఉంటే ఫారం-8 ద్వారా సవరణకు దరఖాస్తు చేసుకోవచ్చు.

5. అనర్హులపై అభ్యంతరం: జాబితాలో అనర్హులు ఉంటే అదే నియోజకవర్గానికి చెందిన ఓటరు ఫారం-7 ద్వారా అభ్యంతరం తెలపవచ్చు.

6. క్లెయిమ్స్, అభ్యంతరాలపై అవగాహన:

అవసరమైన పత్రాలు, గడువులపై ప్రజల సందేహాలను నివృత్తి చేస్తారు.ప్రజలందరూ తమ ప్రాంతంలో జరిగే గ్రామ/వార్డు సభలో పాల్గొని ముసాయిదా జాబితాలో తమ పేరు, వివరాలను తప్పనిసరిగా సరిచూసుకోవాలని, ఏవైనా లోపాలు ఉంటే ఫారం-6, 7, 8 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఎన్నికల అధికారి విజ్ఞప్తి చేశారు. అర్హులైన యువత తమ పేర్లను నమోదు చేసుకోవాలని, సర్ కార్యక్రమం విజయవంతానికి సహకరించాలని కోరారు.సభల నిర్వహణకు సంబంధించిన ప్రొసీడింగ్స్, ఫోటోలను బి ఎల్ ఓ రిజిస్టర్‌లో భద్రపరుస్తామని తెలిపారు.

## నాగారంలో ఘనంగా ఈద్-మిలాద్-ఉన్-నబీ ర్యాలీ

### - ముఖ్య అతిథిగా నాగారం గ్రామ సర్పంచ్ బండారి లింగం



మహేశ్వరం, ఆగస్టు 25 (ప్రజా కలం):

ఈద్-మిలాద్-ఉన్-నబీ పర్వదినాన్ని పురస్కరించుకుని మహేశ్వరం మండలంలోని నాగారం గ్రామంలో ముస్లిం మత పెద్దల ఆధ్వర్యంలో ఘనంగా ర్యాలీ నిర్వహించారు. హజ్రత్ మహబూబ్ షుబాని గౌసేపాక్ దర్గా మత పెద్ద ఇబ్రహీం ఖాన్ ఆధ్వర్యంలో విద్యా వికాస్ స్కూల్ నుంచి దర్గా వరకు పెద్ద ఎత్తున ఈ ర్యాలీ కొనసాగింది.ఈ సందర్భంగా ఇబ్రహీం ఖాన్ మాట్లాడుతూ.. దైవ ప్రవక్త మహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) బోధించిన సోదరభావం, దయ, కరుణ, నిజాయితీ, మానవత్వం, శాంతి వంటి విలువలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని కోరారు. కులమతాలకు అతీతంగా ప్రపంచ శాంతి, మానవాళి సంక్షేమం కోసం ప్రవక్త అందించిన సందేశాన్ని ప్రజలందరూ పాటించాలని సూచించారు.ర్యాలీలో పాల్గొన్న యువత, భక్తులు క్రమశిక్షణతో వ్యవహరించాలని, మతం లేదా కులం పేరుతో ఇతరులను దూషించవద్దని ముస్లిం మత పెద్దలు సూచించారు.

ర్యాలీకి సహకరించి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసిన మహేశ్వరం ఎస్‌హెచ్‌వో, సీఐ రాఘవేందర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా నాగారం గ్రామ సర్పంచ్ బండారి లింగం, మహేశ్వరం ఎస్ఐ ప్రసాద్, ఇంటెలిజెన్స్ పోలీస్ మల్లేష్, మాజీ ఉప సర్పంచ్ లతీఫ్ ఖాన్ హాజరయ్యారు.వార్డు సభ్యులు షాహాబుద్దీన్ ఖాన్, నహీం ఖాన్, ఫిరోజ్ ఖాన్, షానవాజ్ ఖాన్, షేక్ ఛాన్ పాషా, గని ఖాన్, అంజాద్ ఖాన్, ఆఫ్రోజ్ ఖాన్, పేరోజ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## శివగల్ల యాదయ్య మాతృమూర్తికి నివాళులు అర్పించి పరామర్శించిన టియూఎఫ్ఐడిసి చైర్మన్ చల్లా నరసింహారెడ్డి

మహేశ్వరం, ఆగస్టు 26,(ప్రజా కలం)

మహేశ్వరం మండలం 67వ డివిజన్ మంఖాల్ కు చెందిన వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ శివగల్ల యాదయ్య మాతృమూర్తి ఈరోజు ఉదయం అనారోగ్యంతో కన్నుమూశారు.విషయం తెలుసుకున్న తెలంగాణ పట్టణ ఆర్థిక, మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ చైర్మన్ చల్లా నరసింహారెడ్డి వెంటనే మంఖాల్ లోని వారి నివాసానికి చేరుకున్నారు.ఈ సందర్భంగా యాదయ్య ని, వారి కుటుంబ సభ్యులను చల్లా నరసింహారెడ్డి పరామర్శించారు. మృతురాలి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి, సంతాపాన్ని తెలియజేశారు.





# చైత్యభూమిని సందర్శించి నివాళి అర్పించిన నేహా

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) ఆగస్టు 26:

"భారత నేల నుంచి బీజేపీ ఆర్.ఎస్.ఎస్ ని అంతం చేయడానికి అసలైన స్వాతంత్ర్యం కోసం రెండవ పోరాటం అవసరం. ఈ స్ఫూర్తి అంబేడ్కర్ ఐడియాలజీ నుంచే లభిస్తుందని" అంటున్న ఆలిండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఐసా) జాతీయ అధ్యక్షురాలు కామ్రేడ్ నేహా బోరా. జెన్ –జీ రైజింగ్ లో భాగంగా దేశవ్యాప్త పర్యటనలో ఉన్న విద్యార్థి నేత్రి నేహా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ సమాధిఐన చైత్యభూమిని సందర్శించి, ఆయనకు ఘనంగా నివాళి అర్పించారు. వీరితో పాటు ఐసా టీం కూడా ఉద్యమ పర్యటనలో ఉన్నారు. తమ ఉద్యమానికి స్ఫూర్తిదాతలు పూలే, సావిత్రి మాయి, ఫాతిమా షేక్, పెరియార్, భగత్ సింగ్, అంబేద్కర్లే అంటూ పిడికిలెత్తి హెలాన్ చేస్తున్న ఉద్యమ నేత్రి నేహా. ఐతే ఆమె యాత్ర మంగళవారం సాయంత్రం ముంబైలో బహిరంగ సభ, బుధవారం ఉదయం మేధావులతో భేటీ, అదే రోజు సాయంత్రం ప్రెస్ మీట్, మధ్యాహ్నం ముంబై దాదర్లోని చైత్యభూమి సందర్శన అనంతరం మరుసటి రోజు పూణే సిటీకి చేరుకున్నారు.

# భారతీయ జనతా పార్టీ మేడ్చల్ జిల్లా ఎస్సి మోర్చా ఉపాధ్యక్షులుగా ఎస్.నర్సింగ్ రావ్ నియామకం

ప్రజాకలం/ కుత్బుల్లాపూర్ (ప్రతినిధి)

బీజేపీ సీనియర్ నాయకులు మల్లంపేట్ నివాసి ఎస్.నర్సింగ్ రావ్ భారతీయ జనతా పార్టీ మేడ్చల్ జిల్లా ఎస్సి మోర్చా ఉపాధ్యక్షులుగా ఎస్ నర్సింగ్ రావ్ నియమితులైయ్యారు. బుధవారం బీజేపీ సీనియర్ నాయకులు మల్లంపేట్ చెందిన ఎస్. నర్సింగ్ రావ్ బీజేపీ సీనియర్ నాయకులు రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు డాక్టర్ ఎస్.మల్లారెడ్డిని వారి నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి ఆశీస్సులు తీసుకున్నారు.



వారితో వివిధ సంస్థాగత విషయాలపై చర్చించారు. ఈసందర్భంగా దుండిగల్ సర్కిల్ బీజేపీ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... పార్టీ ప్రతిష్ట కోసం తన వంతు నిరంతరం పనిచేస్తానని తెలిపారు. తనపై నమ్మకం ఉంచి ఎస్సీ మోర్చా అధ్యక్షుడిగా పదవి ఇచ్చినందుకు దళిత వర్గాలను చైతన్య పరుస్తానని వివరించారు. ఈకార్యక్రమం సర్కిల్ బీజేపీ అధ్యక్షులు పీసరి కృష్ణారెడ్డి, సీనియర్ నాయకులు మాజీ జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులు గోనె మల్లారెడ్డి, ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షులు ఎం. వెంకటేష్ నాయక్, మాజీ ప్రధాన కార్యదర్శి ఎ.శ్రీనివాస్ యాదవ్, ఆకుల విజయ్, మాజీ యువమోర్చ జిల్లా కార్యదర్శి ఎం.అతీష్ బాబు, ఆకుల యశ్వంత్ పటేల్, సారా నవీన్, గణేష్ ముదిరాజ్, కాసాని సంతోష్,రాహుల్ తదితరులు పాల్గొన్నారు

# గజ్వేల్‌లో ఫుట్‌బాల్ బాలికల జట్టు ఎంపిక

గజ్వేల్:26 ఆగస్టు 2026( ప్రజా కలం ప్రతినిధి)

గజ్వేల్‌లో ఫుట్‌బాల్ బాలికల జట్టు ఎంపిక పోటీలు బుధవారం ఉత్సాహంగా జరిగాయి.స్థానిక మినీ స్టేడియంలో నిర్వహించిన ఈ ఎంపిక పోటీలకు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 30 మంది క్రీడాకారిణులు హాజరయ్యారు.వారిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 20 మంది క్రీడాకారిణులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు.ఎంపికైన క్రీడాకారిణులు సెప్టెంబర్ 4 నుంచి నిజామాబాద్‌లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నారు.ఈ ఎంపిక పోటీలను కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఎన్‌సీ సంతోష్,ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు రాంగారి గణేశ్,గజ్వేల్ ఫుట్‌బాల్ క్లబ్ అధ్యక్షులు జంగం రమేష్,జిల్లా చందు,శేఖర్ పర్యవేక్షించారు.శిక్షకుడు రాంగారి నర్సింలు,ఎంపిక కమిటీ సభ్యులు చక్రపాణి,ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



# అక్రమ నిర్మాణాలకు అండదండలు

- కానరాని అధికారుల తనిఖీలు..
- కాసులు కురిపిస్తున్న అనుమతుల ఉల్లంఘనలు
- ప్రజావాణిలో వెల్లువెత్తుతున్న ఫిర్యాదులు,చర్యలు నిల్..
- నోటీసుల జారీకే పరిమితం..సిబ్బంది కొరత సాకు..
- అక్రమార్జనకు ఫిర్యాదులే ఆయుధం....



హైదరాబాద్, ఆగస్టు 25 (ప్రజా కలం ప్రతినిధి)

గ్రేటర్ లో అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. స్థానిక ప్రజాప్రతినిధులకు తలొగ్గిన టౌన్ ప్లానింగ్ అధికారులు ఆయా నిర్మాణాలను ప్రోత్సహిస్తున్నట్లు ఆరోపణలు వెలువడుతున్నాయి.అక్రమ నిర్మాణాలు చేపట్టిగా స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకున్న పాపాన పోలేదని తెలుస్తుంది. వెరసి మున్సిపల్ కార్పోరేషన్ కు రావల్సిన ఆధాయం లేదు,కానీ అవినీతి అధికారుల ఖజాన అమాంతం పెరిగిపోతుం దన్న అపవాదు ఉన్నది. దీనితో టౌన్‌ప్లానింగ్ అధికారుల అండదం డలతో కోర్ సిటీ పరిధిలో అక్రమ నిర్మాణాలు యథేచ్ఛగా సాగుతు న్నాయనే ఆరోపణలు వెల్లువెత్తు తున్నాయి.స్థానికులు, ప్రజాసం ఘాలు ఎప్పటికప్పుడు బాధ్యతా



యుతంగా అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నప్పటికీ వారు మాత్రం ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. నిర్మాణాలను ప్రాథమిక దశలోనే గుర్తించి అడ్డుకోవాల్సిన సిబ్బంది, బిల్డర్లతో కుమ్మక్కై ఇష్టారాజ్యంగా అంతస్తుల పై అంతస్తులు లేపేందుకు సహకరిస్తున్నారు. సదరు భవనాలకు కనీస భద్రతా ప్రమాణాలు పాటించకుండా ఇష్టారాజ్యంగా నిర్మాణాలు చేపట్టిన సంఘటనలు వెలుగులోకి వచ్చాయి. తాజాగా సైబరాబాద్ మున్సిపల్ కమిషనరేట్ పరిధిలో చోటు చేసుకున్న సంఘటన అందుకు ఉదాహరన అని చెప్పక తప్పదు..ఇటీవల అంజయ్యనగర్‌లో కేవలం 50 గజాల స్థలంలో నిర్మించిన ఏడంతస్తుల భవనం కుప్పకూలి ఇద్దరు కార్మికులు ప్రాణాలు కోల్పోయిన ప్రమాదం టౌన్ ప్లానింగ్ అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం. నిబంధనల ప్రకారం ఫీల్డ్ విజిట్ చేయాల్సిన అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడం వల్లే ఇలాంటి విషాదాలు చోటుచేసుకుంటున్నాయి. నామమాత్రంగా నోటీసులు జారీ చేసినా... సదరు భవన యజమానులు స్థానిక ప్రజాప్రతినిధుల అండదండలతో రాజకీయ ఒత్తిళ్లు చేయడం ఆ తర్వాత పరినామాలు పక్కదారి పడుతున్నాయని చెప్పకతప్పదు. దీనితో ఆ నోటీసుల విషయం కాలగర్భంలో కలిసిపోయిందని చెప్పక తప్పదు.

నిబంధనలు లేకుండానే అదనపు అంతస్తులు..

అనుమతులు తీసుకున్న యజమానులు సైతం ఆరు అడుగులు ముందుకు వేసి అదనంగా అంతస్తులు నిర్మాణం చేస్తున్నారు. అందుకోసం ఏ నిబంధనలు అవసరం లేదన్నట్లు వ్యవహరిస్తున్నారు.ఈ ఉల్లంఘనల పై అధికారులే మార్గాలు చూపుతున్నట్లు విమర్శలు వస్తున్నాయి. రెండు లేదా మూడు అంతస్తుల అనుమతి పొందిన వారు మరో అంతస్తు నిర్మించుకునేందుకు సుమారు రూ.5 లక్షల వరకు లంచాలు వసూలు చేసన్నా, చట్టపరమైన అనుమతులు అవసరం లేదని తప్పుదోవ పట్టిస్తున్నారు. ఇక పై అధికారుల నుంచి ఒత్తిడి రావడంతో తప్పని పరిస్థితుల్లో సదరు నిర్మాణదారులకు నోటీసు జారీ చేయడం శరామాములే,ఇక వారిని రక్షించేందుకు నోటీసులిచ్చి, కోర్టు నుంచి స్టే తెచ్చుకోవాలని ఉచిత సలహాలు ఇస్తున్నట్లు సమాచారం.ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో టౌన్‌ప్లానింగ్ విభాగానికే అత్యధికంగా ఫిర్యాదులు వస్తుండటం పరిస్థితి తీవ్రతను స్పష్టం చేస్తోంది.మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్‌లో 23 దరఖాస్తులు రాగా 19 టౌన్ ప్లానింగ్,ఇక సైబరాబాద్‌లో కమిషనరేట్ పరిధిలో 47 ఫిర్యాదులు రాగా 38 టౌన్‌ప్లానింగ్‌కు సంబంధించినవే అంటే టౌౌన్ ప్లానింగ్ పై ప్రజల నుండి ఏమేరకు ఫిర్యాదులు వస్తున్నాయో గమనార్హం. అధికారులు కేవలం ప్రజలు ఇచ్చే ఫిర్యాదులను తీసుకోవడం తప్పా పరిష్కారం చేసినవి ఎన్ని ఎంత మందికి నోట్నసులు ఇచ్చారు అన్నది అధికారుల నుండి సమాధానం లేదు.

పైగా ఆయా ఫిర్యాదులను అందుకున్న అధికారులు వాటిని ఆసరాగా చేసుకుని అక్రమార్కుల నుంచి దందాలు చేయడం, ప్రశ్నించిన వారిని కోర్టు స్టేల పేరుతో బురిడీ కొట్టించడం టౌన్‌ప్లానింగ్ విభాగంలో నిత్యకృత్యంగా మారిందని నగరవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# పచ్చదనం ప్రగతికి సోపానాలు నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలి

## - భావితరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించడమే వన మహోత్సవం లక్ష్యం: -జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్.



సంగారెడ్డి, ప్రతినిధి ఆగస్టు 25:( ప్రజా కలం):

వన మహోత్సవంలో భాగంగా జిల్లావ్యాప్తంగా పెద్ద ఎత్తున మొక్కలు నాటి, పచ్చదనాన్ని పెంపొందించడంతో పాటు నాటిన ప్రతి మొక్కను సంరక్షించేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా అటవీ శాఖ ఆధ్వర్యంలో సంగారెడ్డి పట్టణంలోని తారా డిగ్రీ కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, అడిషనల్ కలెక్టర్ పాండు, జిల్లా అటవీ శాఖ అధికారి ప్రసాద్ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, అటవీ శాఖ అధికారులు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులతో కలిసి వివిధ రకాల మొక్కలను నాటారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణ బాధ్యతను కూడా తీసుకోవాలన్నారు. మొక్కలను నాటడం ఒకరోజు కార్యక్రమంగా కాకుండా, వాటిని నిరంతరం సంరక్షించి పెద్దవిగా పెంచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. చెట్లు పెరిగితేనే భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలి, ఆహ్లాదకరమైన వాతావరణం అందుతుందని పేర్కొన్నారు.

వన మహోత్సవంలో భాగంగా జిల్లాలోని అన్ని మండలాలు, గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీల పరిధిలో విస్తృతంగా మొక్కలు నాటే కార్యక్రమాలు కొనసాగుతున్నాయని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, మండల ప్రత్యేక అధికారులు, జిల్లా అధికారులు, యువత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కలు నాటుతున్నారని చెప్పారు. అన్ని మున్సిపాలిటీల పరిధిలో ఇంటి వద్ద ,పరిసరాలలో నాటుకునేలా అవసరమైన మొక్కలను పంపిణీ చేస్తున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. దీనివల్ల ప్రతి ఇంటి పరిసరాల్లో పచ్చదనం పెంపొందడంతో పాటు పట్టణాల్లో ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడుతుందని తెలిపారు.జిల్లాలో నాటిన ప్రతి మొక్కకు జియో ట్యాగింగ్ చేపడుతున్నామని, తద్వారా మొక్కల వివరాలను నమోదు చేసి వాటి సంరక్షణపై పర్యవేక్షణ కొనసాగిస్తామని పేర్కొన్నారు. నాటిన ప్రతి మొక్కను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని స్పష్టం చేశారు. మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించి, భావితరాలకు స్వచ్ఛమైన గాలి, పచ్చని వాతావరణాన్ని అందించేందుకు అందరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ పాండు, జిల్లా అటవీ శాఖ అధికారి ప్రసాద్ రెడ్డి, డీఆర్‌డీఓ జ్యోతి, డీఎం అండ్ హెచ్‌ఓ డాక్టర్ లలితాదేవి, పీసీబీ అధికారి విజయలక్ష్మి, హౌసింగ్ పీడీ చలపతిరావు, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రవీణ, వైస్ ప్రిన్సిపాల్, అధ్యాపకులు, తహసీల్దార్ జయరాం నాయక్, అటవీ శాఖ అధికారులు, కళాశాల విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# రెండవ వార్డులో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

గజ్వేల్:26ఆగస్టు 2026( ప్రజా కలం ప్రతినిధి)

గజ్వేల్ పట్టణంలోని రెండవ వార్డులో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డు కౌన్సిలర్ గోలి మమత సంతోష్ పాల్గొని, రేషన్ డీలర్లు మామిడి శ్రీనివాస్, రవి వద్దకు వచ్చిన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో గోలి సంతోష్, వార్డు ప్రెసిడెంట్ తాళ్ల నరేష్ గౌడ్, సిరాజ్, సాయి, కనిశెట్టి వెంకటేశం, గండిశెట్టి ఉమేష్, బాలచంద్రం, బెల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.





# నిజామాబాద్‌లో పాంచజన్య సంకల్ప సభ ఏర్పాట్లు ముమ్మరం

## తెలంగాణ రక్షణ సేన ఇంచార్జ్ డాక్టర్ రఘు

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) ఆగస్టు ,26:

నగరంలోని కలెక్టరేట్ మైదానంలో ఈ నెల 31వ తేదీన ప్రతిష్టాత్మకంగా నిర్వహించ తలపెట్టిన "పాంచజన్య సంకల్ప సభ" ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. బుధవారం ఈ సభా ప్రాంగణాన్ని, అక్కడ జరుగుతున్న పనులను తెలంగాణ రక్షణ సేన కోరుట్ల నియోజకవర్గ ఇంచార్జ్ డాక్టర్ రఘు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ రఘు మాట్లాడుతూ.. ఈ నెల 31న నిర్వహించే పాంచజన్య సంకల్ప సభను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకోనున్నట్లు తెలిపారు. సభకు భారీ సంఖ్యలో జనం తరలివచ్చే అవకాశం ఉన్నందున, హాజరయ్యే వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల ముందస్తు ఏర్పాట్లు వేగవంతం చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ సభను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సభా ప్రాంగణ పనుల పరిశీలనలో డాక్టర్ రఘుతో పాటు లింగంపల్లికి చెందిన అజార్ బాయ్, చెట్లపల్లికి చెందిన సంజీవ్, సుఖేందర్ గౌడ్, రేండ్ల రాజన్న తదితరులు పాల్గొని ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు.

# బాల్కొండలో గంజాయి ముఠాలపై పోలీసుల ఉక్కుపాదం: 32 మంది అరెస్ట్

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) ఆగస్టు 26:

బాల్కొండ మండలంలో గంజాయి విక్రయిస్తున్న, తాగుతున్న వారిపై బాల్కొండ పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టి ఉక్కుపాదం మోపారు. రెండు వేర్వేరు ప్రాంతాల్లో నమ్మదగ్గ సమాచారంతో దాడులు నిర్వహించి ఒక విక్రేతతో పాటు మొత్తం 32 మంది గంజాయి రాయుళ్లను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని వనెల్ బి వరద కాలువ గట్టు పైన కొంతమంది చేరి గంజాయి తాగుతున్నారనే పక్కా సమాచారంతో పోలీసులు అక్కడికి చేరుకున్నారు. ఆ సమయంలో అక్కడ గంజాయి తాగుతున్న 18 మందితో పాటు, వారికి గంజాయి విక్రయించేందుకు వచ్చిన ఒక వ్యక్తిని పోలీసులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వారిని విచారించగా విక్రేత వద్ద 40 గ్రాముల ఎండు గంజాయి, చిన్న చిన్న జిప్ లాక్ కవర్ల ప్యాకెట్, ఒక మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. గంజాయి విక్రయిస్తున్న ప్రధాన నిందితుడిని రిమాండ్‌కు తరలించగా, గంజాయికి బానిసలైన మిగతా 18 మందిని డి–అడిక్షన్ (వ్యసన విముక్తి) కేంద్రాలకు పంపించనున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. మరొక ఘటనలో.. బాల్కొండలోని మల్లన్న గుట్ట సమీపంలో గంజాయి తాగుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు పోలీసులు దాడి చేశారు. అక్కడ వ్యసనానికి పాల్పడుతున్న 13 మందిని పట్టుకున్నారు. వారిని కూడా డి–అడిక్షన్ సెంటర్లకు పంపే దిశగా చర్యలు చేపట్టారు. పట్టుబడిన వారందరిపై కేసులు నమోదు చేసి, ఈ గంజాయి నెట్‌వర్క్ వెనుక ఉన్న మరికొందరి కోసం దర్యాప్తు ముమ్మరం చేసినట్లు బాల్కొండ పోలీసులు వెల్లడించారు.



# చర్చి గాగిల్లాపూర్‌లో రూ.40.50 లక్షలతో స్మశాన వాటిక అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాకలం/ కుత్బుల్లాపూర్ (ప్రతినిధి)

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ సర్కిల్ పరిధి చర్చిగాగిల్లాపూర్ డివిజన్(214)లో రూ.40.50 లక్షల నిధులతో చేపట్టనున్న స్మశాన వాటిక అభివృద్ధి పనులకు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి హాజరై శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... అన్ని వర్గాల ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తూ నియోజకవర్గాన్ని సమగ్రంగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించి, ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులను చేపడుతున్నామని పేర్కొన్నారు. రూ.40.50 లక్షలతో చేపడుతున్న ఈ అభివృద్ధి పనుల ద్వారా స్మశాన వాటికలో అవసరమైన మౌలిక వసతులు మెరుగుపడనున్నాయని తెలిపారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు జక్కల మల్లేష్ యాదవ్, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు బొట్ల విజయ్ కుమార్, డివిజన్ ఎస్సీ సెల్ అధ్యక్షులు చెవిటి శ్రీనివాస్, మాజీ సర్పంచ్ కావలి గణేష్, కావలి శశి కుమార్, ఆకుల ప్రేమ్, శ్రీకర్ రెడ్డి, మైనార్టీ నాయకులు నయీమ్, మహేందర్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

# రోడ్డా డంపింగ్ యార్డా...?

## - దేవేందర్ నగర్ నుండి కెసిఆర్ నగర్ వెళ్లే రోడ్డుపై చెత్త డంపింగ్
## - దుర్గంధంతో జనం ఉక్కిరిబిక్కిరి - పెరిగిపోయిన దోమల బెడద
## - రోడ్డుపై చెత్తను తొలగించి సమస్యలు పరిష్కరించాలని కోరుతున్న స్థానికులు



**ఉప్పల్ ఆగస్టు 26(ప్రజాకలం న్యూస్)**

మేడ్చల్ మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ ఉప్పల్ డివిజన్ పరిదిలోని దేవెందర్ నగర్ నుండి కేసిఆర్ నగర్ వెళ్లే ప్రధాన రహదారిలో ఉన్న డంపింగ్ యార్డ్ లో వేయాల్సిన చెత్తను రోడ్డుపై వేయడంతో జనం ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. ఈ సమస్యపై మున్సిపల్ అధికారులు,పాలకులు పట్టించుకోవడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇండ్లనుండి సేకరించిన చెత్తను తీసుకొచ్చి డంపింగ్ కేంద్రం వద్ద రోడ్లపై డంప్ చేయడంతో దుర్గందపు వాసన వెదజల్లుతుంది. దీంతో పాదచారులు, వాహనదారులు మురుగు వాసన బరించలేక జనం నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత రెండు మూడు రోజులుగా వచ్చిన వర్షానికి రోడ్లపై పేరుకుపోయిన చెత్త తడిసి పోవడంతో వాసనకు పక్కనే ఉన్న సాయికృష్ణ నగర్,చర్చికాలనీ, టీవీకాలనీలో దోమల బెడద పెరిగిపోయింది. ఈ సమస్య అధికారులకు, పాలకులకు పట్టడం లేదా అని జనం వాపోతున్నారు. ప్రజలకు ఇబ్బందికరంగా మారిన ఈ చెత్త సమస్యపై మున్సిపల్ అధికారులు, పాలకులు తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.






# ఉత్తమ కూచిపూడి నృత్య అకాడమీగా భావనలయకు అవార్డు

మల్కాజిగిరి ఆగస్టు26,(ప్రజా కలం ప్రతినిధి)

నాగపూర్‌లో శ్రీకృష్ణ కల్చరల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆగస్టు 20 నుంచి 23 వరకు నిర్వహించిన అఖిల భారత నృత్య, సంగీత పోటీల్లో మల్కాజిగిరికి చెందిన భావనలయ నృత్య అకాడమీ విద్యార్థులు ప్రతిభ చాటారు. అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షులు, నృత్యాచార్యులు డా. వట్టికోట యాదగిరాచార్యుల ఆధ్వర్యంలో సుమారు 50 మంది కూచిపూడి విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. వీరిలో 22 మంది విద్యార్థులు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచి విజయాలు సాధించారు. పోటీల్లో భావనలయ నృత్య అకాడమీకి ఉత్తమ నృత్య అకాడమీ అవార్డు లభించగా, ఉత్తమ నృత్య ప్రదర్శనకు దేవహర్ష అవార్డును అందుకున్నారు. భావనలయ నృత్య అకాడమీ గత 35 సంవత్సరాలుగా వివిధ ప్రాంతాల్లో కూచిపూడి నృత్య ప్రదర్శనలు నిర్వహిస్తూ పలువురి ప్రశంసలు పొందుతోందని డా. వట్టికోట యాదగిరాచార్యులు తెలిపారు. విద్యార్థులు పోటీల్లో ప్రతిభ కనబరిచి విజయం సాధించడం పట్ల వారి తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. భవిష్యత్తులోనూ ఇదే స్ఫూర్తితో మరిన్ని విజయాలు సాధించే దిశగా అకాడమీని ముందుకు తీసుకెళ్తామని డా. వట్టికోట యాదగిరాచార్యులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# మౌలాలిలో ఘనంగా ఈద్ మిలాద్ ఉన్ నబీ వేడుకలు

మల్కాజిగిరి ఆగస్టు26(ప్రజా కలం ప్రతినిధి)

ఈద్ మిలాద్ ఉన్ నబీ పర్వదినాన్ని పురస్కరించుకొని మౌలాలి డివిజన్‌లో పలు సేవా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా షర్బత్ పంపిణీ, అన్నదాన



కార్యక్రమాలతో పాటు ర్యాలీ నిర్వహించారు. మౌలాలి డివిజన్‌లో నిర్వహించిన షర్బత్ పంపిణీ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొని ప్రజలకు షర్బత్ అందజేశారు. భరత్‌నగర్‌లో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఎం.జె. కాలనీలోని మహమూద్ మసీదు నుంచి కాప్రా మున్సిపల్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈద్ మిలాద్ ఉన్ నబీ సందర్భంగా ప్రేమ, శాంతి, సోదరభావం, దయ, మానవతా విలువలను పెంపొందించుకోవాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు. సమాజంలో ఐక్యత, పరస్పర గౌరవం, సేవాభావంతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. కుషాయిగూడ పోలీస్ స్టేషన్ సీఐ భాస్కర్ రెడ్డి, ఎస్ఐలు వెంకటేశ్వర్లు, విజయ్‌తో పాటు పోలీస్ సిబ్బంది కార్యక్రమాల్లో పాల్గొన్నారు. 186వ డివిజన్ అధ్యక్షుడు పోతుల వినోద్ యాదవ్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఫారూఖ్, మౌలాలి డివిజన్ మైనార్టీ అధ్యక్షుడు షకీల్,సిద్ధిక్, పలువురు నాయకులు, కార్యకర్తలు,ముస్లిం సోదరులు,స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# బాలాపూర్ గణేష్ అందరివాడు

## -ఒక వర్గానికే చెందినవాడు కాదు
## -బాలాపూర్ గణేష్ మండపం వద్ద ఎస్సి , ఎస్టీ , బిసి యువకుల నిరసన






మహేశ్వరం, ఆగస్టు 26,(ప్రజా కలం)

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ పేరుతో గణేషుడిని ఏర్పాటు చేసి బాలాపూర్ గ్రామస్తులకే విలువ ఇవ్వడం లేదని బాలాపూర్ గ్రామ ప్రజలు, ఎస్సి ఎస్టీ బిసి యువకులు ఆవేదన వ్యక్తం చేశారు.

గత కొన్ని సంవత్సరాలుగా కేవలం ఒకే వర్గం వారు బాలాపూర్ గణేష్ ఉత్సవాలను శాసిస్తున్నారని ఆరోపిస్తూ మంగళవారం బాలాపూర్ గణేష్ మండపం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు.

ఈ సందర్భంగా గ్రామ యువకులు మాట్లాడుతూ బాలాపూర్ గ్రామంలో స్వయంభుగా వెలసిన వేణుగోపాల స్వామి ఆలయ వేడుకలు, బాలాపూర్ ధర్మ రక్షణ సభ, బొడ్రాయి వేడుకలలో అన్ని కుల సంఘాలను కలుపుకుని ఘనంగా నిర్వహిస్తున్నట్లే, బాలాపూర్ గణేష్ ఉత్సవాలను కూడా అన్ని కులాలను కలుపుకుని నిర్వహించాలని డిమాండ్ చేశారు.

వారి ప్రధాన డిమాండ్లు:

- ఐక్య కమిటీ ఏర్పాటు:

వెంటనే బాలాపూర్ గణేష్ ఉత్సవ కమిటీని పునర్వ్యవస్థీకరించి, అందులో అన్ని కుల సంఘాలకు చెందిన యువకులకు భాగస్వామ్యం కల్పించాలి.

- కుల వివక్షకు స్వస్తి:

బాలాపూర్ గణేశుడు అందరివాడు, ఏ ఒక్క వర్గానికో చెందినవాడు కాదు. గణేష్ మండపంలో కొనసాగుతున్న కుల వ్యవస్థ పద్ధతిని మార్చాలి.

- పారదర్శక లెక్కింపు: భక్తులు సమర్పించే కట్నకానుకలు, హుండీ డబ్బుల లెక్కింపును వ్యక్తిగత ఇళ్లలో కాకుండా, గ్రామంలోని స్వయంభు వేణుగోపాల స్వామి దేవాలయంలో బహిరంగంగా లెక్కించాలి.

- గ్రామాభివృద్ధికి నిధులు:

ఆ విధంగా వచ్చిన ఆదాయాన్ని బాలాపూర్ గ్రామ అభివృద్ధి పనులకు వినియోగించాలని వారు కోరారు.

బాలాపూర్ గణేష్ ఉత్సవాలను రాజకీయాలకు, కులాలకు అతీతంగా, గ్రామమంతా ఏకమై ఘనంగా జరుపుకోవాలని ఈ సందర్భంగా యువకులు పిలుపునిచ్చారు.

# సీనియర్ నాయకుల కుటుంబానికి భరోసా

## - మహేశ్వరం నియోజకవర్గ ఇన్చార్జ్ కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి

మహేశ్వరం, ఆగస్టు 26,(ప్రజా కలం)

మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండల కేంద్రం బడంగ్‌పేట్ జిహెచ్ఎంసి 61వ డివిజన్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు, బి ఎల్ ఏ సుధాకర్ అనారోగ్యంతో 5 రోజుల క్రితం మృతి చెందారు. విషయం తెలుసుకున్న మహేశ్వరం నియోజకవర్గ ఇన్చార్జ్ కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి ఈరోజు వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను, పిల్లలను పరామర్శించారు. ఈ సందర్భంగా కె ఎల్ ఆర్ మాట్లాడుతూ.. సుధాకర్ కుటుంబానికి అండగా ఉంటామని, తక్షణ ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం అందించడంతో పాటు, ప్రభుత్వం ద్వారా ఇందిరమ్మ డబుల్ బెడ్ రూమ్ ఇల్లు మంజూరు చేయిస్తామని, పిల్లల చదువు బాధ్యత తాను తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు బంగారి అశోక్, నాదర్ గుల్ డివిజన్ అధ్యక్షులు గోవర్ధన్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ పెద్దబావి సుదర్శన్ రెడ్డి, సీనియర్ నాయకులు ఆనంద్ రెడ్డి, నవారు మల్లారెడ్డి, గట్టు బాలకృష్ణ, సెల్ అధ్యక్షులు కుమారస్వామి, చంద్రపాల్ రెడ్డి, యువ నాయకుడు సామ వరుణ్ రెడ్డి, మహిళా అధ్యక్షురాలు అమృత నాయుడు, అరుణ్ జ్యోతి, లక్ష్మి శెట్టి మనోహర్, శివ మరియు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# రాష్ట్ర అభివృద్ధి, పేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట

## - అర్హులైన ప్రతి పేదకు ఇందిరమ్మ ఇల్లు కేటాయింపు - సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు తూంకుంట అంక్షారెడ్డి



గజ్వేల్:26 ఆగస్టు 2026 (ప్రజా కలం ప్రతినిధి)

రాష్ట్ర అభివృద్ధి, పేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు తూంకుంట అంక్షారెడ్డి,గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ నరేందర్ రెడ్డి,వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్,మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు అశోక్ రెడ్డి అన్నారు. అర్హులైన ప్రతి పేదకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. బుధవారం అహ్మదీపూర్‌లో ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న వారు,అనంతరం గజ్వేల్‌లో 20 వ వార్డులో వార్డు కౌన్సిలర్లు అత్తెల్లి శ్రీనివాస్ గుప్త, గుంటుకు లక్ష్మి శ్రీనివాస్‌లతో కలిసి స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వం లోని కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో అభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. గజ్వేల్ నియోజకవర్గంలోని 55 గ్రామాలకు రూ. 5.50 కోట్ల వ్యయంతో మహిళా భవనాలు మంజూరయ్యాయని,వాటి నిర్మాణాలను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. అలాగే సీసీ రోడ్లు, మురుగు కాల్వల నిర్మాణానికి రూ. 5.41 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. నియోజకవర్గానికి 6 వేల ఇందిరమ్మ ఇళ్లు కేటాయించామని, అర్హులైన పేదలందరికీ వాటిని అందిస్తున్నామని పేర్కొన్నారు. రైతులకు రూ. 2 లక్షల వరకు పంట రుణమాఫీ, సన్న ధాన్యానికి రూ. 500 బోనస్, రైతు భరోసా చెల్లింపులతో పాటు అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు,సన్న బియ్యం పంపిణీ వంటి సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. ఆరు గ్యారెంటీల్లో భాగంగా ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు చేరేలా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి, ప్రజలను చైతన్యపరచాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సుఖేందర్ రెడ్డి,పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కొండల్ రెడ్డి,నాయకులు అంజాగౌడ్, ప్రభాకర్, నర్సింహా రెడ్డి, శివారెడ్డి, గాడిపల్లి శ్రీనివాస్, అజహర్ తదితరులు పాల్గొన్నారు.



Corporate .Office :1-7-511/4, Gemini Colony, Near Pochamma Temple, Zamistanpur, HYDERABAD, TELANGANA, 500020 Cell: 9010972526

Printed, Published and owned by **KALAKONDA RAMAKRISHNA**, Printed at **TEJOMAI PUBLICATION**, H.No. 2-24/98/BLN Colony, IDA Uppal Medchal-Malkajgiri, Hyderabad, Telangana-50013
Published from H.No.10-1-7, Bada Bazar, Beside Pothalingaiah Temple, Azam Raod, Nizamabad,TS -503001 TELANGANA - 503001.
Editor: **KALAKONDA RAMAKRISHNA, PRGI.No. TELTEL/2010/33275,** Cell: 90109 72526, Email:prajakalam2010@gmail.com